# జనబలం

ప్రజలే ప్రభువులు

సెప్టెంబర్ 2022 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-

**India75**
స్వాతంత్ర్య
అమృత మహోత్సవం

**Loksatta 25**
రెండో స్వాతంత్ర్య పోరాట
రజతోత్సవం



Azadi Ka Amrit Mahotsav

25 LOK SATTA People Power

FDR, లోక్‌సత్తా వ్యవస్థాపకులు
**Dr. JP తో ముఖాముఖి**

ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాల్ని అందించటం
నివారించదగ్గ బాధల్ని తొలగించటం

## సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిణామాలు
## (1972 - 2022)



# ఆరోగ్యం, విద్యపై ఎక్కువ పనిచేయండి

లోక్‌సత్తా ఉద్యమ సంస్థను ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక్‌సత్తా నేతలు వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌ను హైదరాబాద్ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో రాజకీయ, పాలన, ఆర్థిక పరిస్థితులను విశ్లేషిస్తూ కార్యాచరణపై జేపీ దిశానిర్దేశం చేశారు. ప్రజలకు జేబు ఖర్చు లేకుండా, ప్రభుత్వాలపై పెద్ద భారం లేకుండా, పార్టీలకు కూడా ఓట్లు వచ్చేలా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్)/లోక్‌సత్తా ఆచరణాత్మకంగా రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి అన్ని వర్గాల నుండి సానుకూల స్పందన లభిస్తోందని, అలాగే పాఠశాల విద్యాప్రమాణాలను పెంచేందుకు కూడా ఒక డిజిటల్ ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్‌లో కసరత్తు ప్రారంభించామని, విద్య, ఆరోగ్యంపై కృషికి తెలంగాణలో నాయకత్వం కూడా మరింత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. లోక్‌సత్తా సాధించిన విజయాల నుంచి ఆత్మవిశ్వాసం పొంది దీర్ఘకాలిక లక్ష్యాలపై కృషిని కొనసాగించాలని జేపీ పేర్కొన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు, వంశీప్రసాద్, శివరామకృష్ణ, సూర్యలక్ష్మి, నర్సింగ్, రాఘవాచారి, వికాస్, శ్రీనివాస్‌రెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు.



# జనబలం


లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

సంపుటి 25 | సంచిక 09 | సెప్టెంబర్ 2022

సంపాదకవర్గం
బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్
దూసనపూడి సోమసుందర్


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |


*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




75 ఏళ్లు ఆగినవాడివి..
ఇంకొక్క 25 ఏళ్లు ఆగలేవా!


కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిబువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949
Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# పంచి పెట్టడం కాదు 'పెంచి' పెట్టాలి

ఉచిత పథకాలపై గత నెలలో దేశమంతా విస్తృత చర్చ జరిగింది. అశ్వినీ ఉపాధ్యాయ అనే న్యాయవాది సుప్రీం కోర్టు లో దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం, రేవ్డీ కల్చర్ అంటే తాయిలాల సంస్కృతి పోవాలి అంటూ ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకి కారణమయ్యాయి. జస్టిస్ ఎన్వీ రమణ సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తిగా ఉద్యోగ విరమణ చేసే ముందు ఈ వ్యాజ్యాన్ని స్వయంగా విచారించడం కూడా ఈ అంశంపై ఆసక్తిని పెంచాయి. తన తర్వాత బాధ్యతలు స్వీకరించే ప్రధాన న్యాయమూర్తి దీనిపై విచారించేందుకు ఒక త్రిసభ్య ధర్మాసనం ఏర్పాటు చేయాలని ఆదేశించి, జస్టిస్ ఎన్వీ రమణ రిటైర్ అయిపోవడంతో, ఈ చర్చకి తాత్కాలికంగా బ్రేక్ పడింది. అయితే ఈ చర్చ అనేక ప్రశ్నలను మన ముందు ఉంచింది. ఏది సంక్షేమ పథకమో, ఏది తాయిలమో ఎవరు నిర్ణయించాలి? దేనికి ఎంత ఖర్చు పెట్టాలో నిర్ణయించుకునే అధికారం ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలకి ఉండాలా? ..కోర్టులు, ఎన్నికల కమీషన్ లాంటి సంస్థలకి ఉండాలా? అప్పులు చేసి మరీ అనుత్పాదక పథకాలకి ఖర్చు పెట్టేస్తే, తరువాతి తరాల భవిష్యత్తు ఏంటి, దేశ ఆర్థిక ప్రగతి ఏమైపోతుంది? ఇవి ప్రధానమైన ప్రశ్నలు.

శ్రుతిమించిన ఉచితాలకి మనం తమిళనాడుని ఉదాహరణగా చూస్తాం. ఎన్నికల్లో గెలిపిస్తే ఇంటింటికీ కలర్ టీవీలు, మిక్సీలు, గ్రైండర్లు ఇస్తామని హామీ ఇవ్వడం, గెలిచాక అమలు చేయడం మనం చూశాం. ఈ గ్రైండర్లు ఇవ్వడం పేదరిక నిర్మూలనకి ఒక మార్గం అని కొందరు వాదించారు. ఇంటింటికీ మిక్సీ లేదా గ్రైండర్ ఇవ్వడం వల్ల, పేద మహిళలకి పిండి రుబ్బే శ్రమ తప్పుతుంది, సమయం ఆదా అవుతుంది, అలా ఆదా అయిన సమయాన్ని ఆదాయాన్ని ఇచ్చే వేరే పనికోసం మహిళలు కేటాయించగలుగుతారు... ఆ విధంగా పేదరికం తగ్గుతుంది అనేది వారి వాదన. అలాగే ఇంటింటికీ కలర్ టీవీలు ఇవ్వడం వల్ల, టీవీ కార్యక్రమాలు చూసి ప్రజల్లో చైతన్యం, జ్ఞానం పెరుగుతాయి కాబట్టి టీవీ లు ఇవ్వడం కూడా సంక్షేమ పథకమే అని వాదించే వారు కూడా ఉన్నారు. ఈ వాదనలు అసంబద్ధమైనవి అని చాలామందికి అనిపించవచ్చు. ఏ హామీ అసంబద్ధమైందో ఎవరు నిర్ణయించాలి? ఇది నిర్ణయించుకోవలసింది ఓటర్లే.

మనది అపరిపక్వ ప్రజాస్వామ్యం. ప్రభుత్వ డబ్బు అంటే మనం కట్టే పన్నుల డబ్బు, లేదా మన భవిష్యత్తుని తాకట్టు పెట్టి తెచ్చే అప్పుల డబ్బు అనే వాస్తవం చాలామందికి తెలియదు. ఈ కారణంగా, రాజకీయ పార్టీలు ఎన్నికల వేళ ఉచితాలు ప్రకటించగానే, ఆశపడి ఓట్లు వేస్తున్నారు.

అసలు ప్రభుత్వం ఎందుకు? ప్రభుత్వం విధిగా అందించాల్సిన సేవలు ఏంటి? దీనిపై మన సమాజంలో అవగాహన చాలా తక్కువ. ఆ అవగాహన ఉన్న వాళ్ళు కూడా, "ప్రభుత్వం తను చేయాల్సిన పని చేయదు, ప్రభుత్వం అందించే సేవలు నాసిరకంగానే ఉంటాయి, ప్రభుత్వం వల్ల మనకెలాగూ ఉపయోగం లేదు కాబట్టి, ఏదో ఒక రూపంలో కొన్ని డబ్బులు మన ఖాతాలో పడితే చాలు అనే భావన పెరిగింది.

ప్రభుత్వం మీద, ప్రభుత్వ సేవల మీద ప్రజలు కోల్పోయిన నమ్మకాన్ని తిరిగి పొందాలంటే, చాలా కష్టపడాలి. అంత కష్టపడే ఓపిక, తీరిక మన ప్రజాప్రతినిధులకి లేదు. అందుకే, ప్రజాధనాన్ని తిరిగి ప్రజలకే కొంత నేరుగా పంచి పెట్టడం, కొంత తమ సంచిలో వేసుకోవడం ద్వారా కాలం వెళ్లదీస్తున్నారు. పాలన అంటే పంచి పెట్టడం అనే తాము నమ్ముతూ, ప్రజలని నమ్మిస్తున్నారు.

మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, శాంతిభద్రతలు కాపాడడం, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడే చర్యలు తీసుకోవడం ద్వారా అటు ప్రజల ఆదాయాన్ని, ఇటు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలని, ఆ పెంచిన దానిలో నుండి నిస్సహాయ ప్రజలకి కొంత పంచి పెట్టాలని అదే నిజమైన పాలన అని ప్రజలు, ప్రజాప్రతినిధులు గుర్తిస్తేనే మనదేశం ఆర్థికంగా ఎదుగుతుంది..లేదంటే మరో శ్రీలంక, మరో వెనిజులా లాగా తీవ్ర సంక్షోభంలోకి వెళ్ళే ప్రమాదం ఉంది.

శిరమని నరేష్

# స్పందించే శక్తే మార్పుకి మార్గం చూపుతుంది

## స్వాతంత్ర్య వజ్రోత్సవాలు, లోక్‌సత్తా 25వ వార్షికోత్సవం సందర్భంగా

## డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్‌తో ముఖాముఖి

*దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయ్యాయి. ఆజాదీ కా అమృతోత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నాం. అయితే ఈ 75 ఏళ్లు ఎటువంటి అవరోధాలు, అడ్డంకులు లేకుండా సాఫీగా సాగాయా అంటే లేదనే చెప్పాలి. ఎన్నో పెద్ద పెద్ద అవాంతరాలను ఎదుర్కొన్నాం. ఒక దశలో దేశం ఆర్థికంగా, రాజకీయంగా అనేక సంక్షోభాలను ఎదుర్కొంది. సామాజికంగానూ ఏ దేశం చూడనన్ని దౌర్జన్యాలను, అరాచకాలను కూడా చూసింది. అయితే ఈ అవరోధాలన్నింటిని అధిగమించి ఇండియా వజ్రోత్సవాలను ఇంత ఘనంగా జరుపుకోవడం మనందరికీ గర్వకారణం. దీని వెనుక ఎంతోమంది కృషి ఉంది. దేశం మొత్తం కొన్ని విలువలకు కట్టుబడి ఉంది. కొంతమంది వ్యక్తులు, సంస్థల కష్టం వల్ల ఈ రోజు మనం ఈ స్థాయిలో ఉన్నాం. మన తెలుగురాష్ట్రాల్లో యువతను ఎంతో ఉత్తేజపరిచి, ఆలోచనల్లో పదును పెంచి, ఆశయాల్లో ఒక లోతును కూడా పెంచిన వ్యక్తి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్. ఆయన చేసిన పనుల వల్లే కాదు ఆయన ప్రారంభించిన సంస్థల ద్వారా కూడా సత్యం ఏది, మనందరం ఎటువైపు నడుస్తూ ఉండాలనే జాగురూకతను, ఆలోచనను కలిగిస్తూ ముందుకు నడిపిస్తున్నారు. లోక్‌సత్తా కూడా 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంలో లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్‌తో సోషల్ యాక్టివిస్ట్ , యువ జర్నో స్వాతి ముఖాముఖి. జనబలం పాఠకుల కోసం...*




**స్వాతి: 75 ఏళ్ల స్వాతంత్ర భారతంలో 50 ఏళ్ల పాటు మీరు కీలకమైన పాత్ర పోషించారు. మనం సరైన దారిలోనే వెళుతున్నామా?**

జేపీ : స్థూలంగా సరైన దారిలోనే వెళుతున్నాం. 25 ఏళ్ల క్రితం లోక్‌సత్తా ప్రారంభించినప్పుడు 1996 నుంచి 2000 సంవత్సరం దాకా జాతీయ స్థాయిలో 50 ఏళ్ల స్వర్ణోత్సవాలు కానీ, 50 ఏళ్ల రిపబ్లిక్ కానీ చాలా కమిటీల్లో కీలకపాత్ర పోషించాను. ఆనాడు 50 ఏళ్లు అయినా ఏంటి ఇంకా ఈ దేశం ఇలా ఉందని కంగారు పడే వాళ్లం. అప్పటికి ఇప్పటికి తేడా ఏంటంటే..

ఒకప్పుడు ఏం జరగాలనే స్పష్టతను లోక్‌సత్తా తీసుకొచ్చింది. లోక్‌సత్తా ఉద్యమానికి ఉన్న విశిష్టత అది. ఎక్కడ పొరపాటు జరుగుతుంది..ఏం జరగాలనే స్పష్టత హేతుబద్ధంగా జరిగింది. కానీ ఇదేదో మనం తలచుకుంటే అయిపోతుంది. చట్టం చేస్తే అయిపోతుంది..రాజ్యాంగం చెబితే అయిపోతుంది..అనుకున్నాం కానీ ఈ ప్రక్రియ చాలా

నెమ్మదిగా నడుస్తుంది. ఈ సమాజం అంత వేగంగా మారదు అన్న విషయం ఇప్పుడు అర్థం అయింది. అందుకనే వ్యక్తిగతంగా నా ప్రయాణం 47..48 ఏళ్లు సాగినా కూడా లోక్‌సత్తా ఉద్యమంగా 25 ఏళ్లు సాగింది. ఇంకో 25 ఏళ్లు అవసరమవుతుంది. అంటే ఒక సమాజంలో మౌలికమైన మార్పు రావడానికి ప్రజాస్వామ్యంలో కొంత సమయం పడుతుంది. ఏ దేశంలో అయినా కూడా ఆ రకంగా ఆలోచిస్తే నిరాశ పడాల్సిన అవసరం లేదు. ఇప్పుడు మన అదృష్టం ఏంటంటే చాలా స్పష్టమైనటువంటి అవగాహన ఉంది. ఎక్కడ పొరపాటు చేస్తున్నాం అనే అవగాహన గణనీయంగా పెరిగింది. రెండోది ఆర్థికవ్యవస్థలో ఉన్న తప్పుల్ని సవరించే ఏర్పాటు జరుగుతోంది. ప్రపంచంలో రాజకీయాలకు అతీతంగా టెక్నాలజీ విపరీతంగా పెరుగుతోంది. అది గొప్ప అవకాశాల్ని ఇస్తోంది. కాబట్టి ఇంకా జరగాల్సింది చాలా ఉందనే వేదన నా మనసులో ఉన్నప్పటికీ కచ్చితంగా జరుగుతుందనే విశ్వాసం కూడా ఉంది.

***ప్రశ్న : తప్పు ఎక్కడ జరుగుతుందో తెలుస్తుందన్నారు..ఆ తప్పు ఏంటి? మీకు విశ్వాసం కలిగిస్తున్న అంశాలు ఏంటి?***

జేపీ: రాజకీయాలు, పరిపాలన గురించి ఒక్కసారి పక్కన పెట్టి మన జీవితాల గురించి ఆలోచిద్దాం. లోక్‌సత్తా ప్రారంభించినప్పుడు ఫోన్‌లు లేవు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ప్రారంభించిన తర్వాతే నాకు ఈ-మెయిల్ గురించి తెలిసింది. ఇవాళ సామాన్యులకు కూడా ఇవి ఎంతగా అందుబాటులో ఉన్నాయో చూడండి. జీవితం మారలేదనుకోవడం చాలా పొరపాటు. మనం ప్రతీది రాజకీయ కోణం నుంచి చూస్తున్నాం..ఈ దేశంలో మనకి రాజకీయ రంగు ఎక్కువ. పొద్దున్నుంచి సాయంత్రం వరకు ఎవరు పరిపాలన చేస్తున్నారు..ఎవరు పెత్తనం చేస్తున్నారనేదే చూస్తున్నాం..మన జీవితాల గురించి ధ్యాస లేకుండా పోయింది. సామాజికంగా మనలో కూడా పొరపాటు ఉంది. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ..

ఇంత వైవిధ్యం ఉన్న సమాజం నిజంగా చాలా నిలకడగా ఉంది. ఇన్ని కులాలు, మతాలు, ప్రాంతాలు ఉన్న సమాజంలో ఇంత నింపాదిగా, ఇంత తక్కువ హింసతో సుహృద్భావంతో ఉండడం అసాధ్యం. 140 కోట్ల జనాభా ఉన్న దేశంలో ఆరు లక్షల గ్రామాలు, 15 లక్షల ఆవాసాలు ఉన్న దేశంలో ఏదోఒకటి ఎక్కడో ఒక చోట జరుగుతుంది. మనం భూతద్దంలో చూసి హింస పెరిగిపోతుందని కాకుండా , ఇంత సమాజంలో ఏం జరుగుతోందీ అని ఆలోచిస్తే చాలా సుస్థిరత్వం ఉన్న సమాజం మనది, అంత భయపడాల్సిన అవసరం లేదు అని అర్థం అవుతోంది. అమెరికాలో చూస్తే తుపాకీలతో కాల్చేసుకోవడం, నల్లవాళ్లు, తెల్లవాళ్లు అని కొట్టుకోవడం చూస్తున్నాం. మనకిక్కడ అలా లేదు. ఆర్థికంగా మనం తప్పులు చేశాం. కానీ ఇప్పుడు మారుతోంది. అట్లాగే రాజకీయంగా గత 25-30 ఏళ్లలో లోక్‌సత్తా ఏర్పాటైన తర్వాత ఫెడరలిజం బలపడింది. ఆనాడు రాష్ట్రాలకు రాజకీయంగా ఉనికి ఉండేది కాదు. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం స్వతంత్రంగా బలోపేతం అవుతున్నాయి. గతంలో ఎలా ఉందో తెలియదు కనుక ప్రస్తుత పరిస్థితిని చూసి చాలా అధ్వానంగా ఉందని యువత అనుకుంటున్నారు. నిజమే అధ్వానంగా ఉంది. కానీ నిన్న ఎలా ఉంది..ఈ రోజు ఎలా ఉంది చూస్తే కానీ ఆ గమనం అర్థం కాదు. అలా చూస్తే కొన్ని రంగాల్లో సరైన దారిలో వెళ్తున్నాం. కొన్ని చోట్ల పొరపాట్లు జరుగుతున్నాయి. రాజకీయం మరింత కుళ్లిన మాట వాస్తవం. ఓట్ల కొనుగోలు మరింత పెరిగిన మాట వాస్తవం. ఆ రోజుల్లో ఎమ్మెల్యే ఎన్నికకు కోటి రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తుందని చెబితే ఉత్తర భారతంలో నమ్మేవాళ్లు కాదు. అతిశయోక్తులు చెబుతున్నానని అనుకునే వారు. ఇవాళ మనందరికీ తెలుసు రూ. 25-30 కోట్లనేది మామూలు వ్యవహారం అయిపోయింది. ఉప ఎన్నికలు వస్తే కొన్ని చోట్ల రూ. 50 నుంచి 100 కోట్ల వరకు కూడా వెళ్లిపోయింది. ఓట్ల కొనుగోలు, తాయిలాల విషయంలో మరింత చెడిపోయిన మాట వాస్తవం. కానీ మిగతా చాలా విషయాల్లో మనం ప్రగతిని చూస్తున్నాం. అది ఒక్క రోజు కనిపించదు. అద్భుతంగా కనిపించదు, అందంగా కనిపించదు..వంట చేసే మనిషికి ఆ వంట తినాలంటే ఆ వాసనలు అవి భరించలేక వాంతి వస్తుంది.. అలాగే ఓ వ్యవస్థలో మార్పులు వచ్చేటప్పుడు మొత్తం చూస్తుంటే కొంత చికాకు కలుగుతుంది..కానీ దీర్ఘదర్శనం చేయాలి.

***ప్రశ్న: ఈనాడు యువతకు రోజువారీ జీవితమే ఓ పోరాటం అయిపోయింది. అలాంటి యువత ఈ రోజు గతాన్ని తెలుసుకుని, వర్తమానాన్ని అర్థం చేసుకుని భవిష్యత్తును అంచనా వేసుకోవడం సాధ్యంకాని పని. ఈ పరిస్థితుల్లో అలాంటి యువతను మళ్లీ రాజకీయాల్లో భాగస్వాముల్ని చేయడానికి ఎలాంటి పద్ధతులు ఉన్నాయి.***

జేపీ: గతాన్ని తెలుసుకోవాలంటే చరిత్ర చదవక్కర్లేదు, పుస్తకాలు అక్కర్లేదు. మీ తల్లిదండ్రులతో మాట్లాడండి. రోజువారీ విషయాలు కాకుండా వాస్తవాలను వారితో చర్చించండి. 20..30 ఏళ్ల క్రితం మన కుటుంబం ఎలా ఉంది..మన చుట్టూ పరిసరాలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకోండి. అప్పుడు చరిత్ర గమనం అర్థం అవుతుంది. గతం అంటే ఔరంగజేబు ఏంటి? అక్బర్ ఏంటి? అశోకుడు ఏంటి చెప్పక్కర్లేదు..20-30 ఏళ్ల క్రితం ఏం జరిగిందో మన కుటుంబమే సాక్ష్యం. మనకు అవగాహన ఉండకపోవచ్చు. చరిత్రను లోతుగా అధ్యయనం చేయకపోయినా ఆ పునాది లేకుండా భవిష్యత్తును నిర్మాణం చేసుకోవాలనుకోవడం చాలా పొరబాటు. ఎక్కువ కాకపోయినా ఏం జరుగుతుందనేది కొంత పట్టించుకోండి..ఈ దేశంలో కానీ, ప్రపంచంలో కానీ జరుగుతున్న సాంకేతిక మార్పులను గమనించండి..కొద్దిపాటి నైపుణ్యం ఉంటే చాలు, వారు ఎలా తంటాలు పడి ఎదగడానికి తాపత్రయపడుతున్నారో అర్థం అవుతుంది. గోడమీద పెయింటింగ్ చేసే ఓ వ్యక్తిని రోడ్డుపై ఓ సారి పలకరించి జీవితంఎలా ఉందని అడిగితే బాగుంది సార్..రూ. 40-50 వేలు సంపాదిస్తున్నానని చెప్పాడు. అదే సరిపోతుందని నేను అనడం లేదు. ఒకవేళ ఆ కుటుంబానికి అకస్మాత్తుగా అనారోగ్యం వస్తే వేలల్లో ఖర్చయిపోతుంది. ఆ పిల్లల చదువుకోసం వేలల్లో ఫీజులు కట్టాల్సి వస్తోంది. కానీ అతనిలో ఉన్న ఆనందం, ఆత్మవిశ్వాసం చూస్తే గర్వమనిపించింది. ఒకప్పుడు ఇలాంటి పనులు చేస్తే తక్కువ అనుకున్న సమాజంలో కాలక్రమేణా డిగ్నిటీ ఆఫ్ లేబర్ వస్తోంది. నైపుణ్యంతో పనిచేస్తే రివార్డు వస్తుంది. ఒకప్పుడు ఉన్న ధోరణులు పోయి ఉద్యోగము అంటే కుర్చీలో కూర్చుని గుమస్తాగా పనిచేయాలి..పనిచేయకపోయినా నెలజీతం వస్తుందనే ధోరణి నుంచి.. పనికొచ్చే సేవలు అందించినట్టయితే నాకు ప్రతిఫలం వస్తుంది. నైపుణ్యం ఉంటే హాయిగా బతకగలనన్న విశ్వాసం కలిగే సమాజం వస్తుంది. ఇంకా చాలా మార్పులు రావాలి. ఆ రకంగా ఆలోచిస్తే సమాజాంలో అవసరాలు చాలా ఉన్నాయి. ఆ అవసరాలు తీర్చే నైపుణ్యం నాకుందని భావిస్తే యువత భవిష్యత్తుకు ఢోకా లేదు. అయితే అది చాలదు. ఎందుకు పట్టించుకోవాలనే దానికి సమాధానం. మొట్టమొదట చూసుకోవాల్సింది వ్యక్తిగత జీవితం. అది చూసుకుంటూనే చుట్టూ ఉన్న సమాజంలో పరిస్థితులు మారకపోతే నాకు నష్టం ఏంటని ఆలోచించాలి. వర్షం కురిస్తే వరదలు వస్తున్నాయి..హైదరాబాద్ నగరంలో పొరపాటున మ్యాన్‌హోల్‌లో పడి ప్రాణాలు కోల్పోయిన వారిని ఏడాదికి ఒకర్నో, ఇద్దర్నో మనం చూస్తున్నాం. వారు ఏం పాపం చేశారు. వారు మన కుటుంబంలోని వారే కావచ్చు..మనమే కావచ్చు కదా? రోడ్డు మీద వెళ్లడం పాపమా? ఆ దారిని వెళ్లడం పాపమా? చుట్టూ ఉన్న పరిస్థితుల నుంచే వైరల్ వ్యాధులు వస్తున్నాయి..దోమలను నియంత్రించడమే సమాజాన్ని పట్టించుకోవడం. అంతే...అంతకంటే ఎక్కువ వద్దు..మోదీ, జగన్, కేసీఆర్‌ల గురించి కాదు..మన చుట్టూ ఉన్న పరిసరాల గురించి ఆలోచించండి..దాన్ని బాగుచేయడానికి ఉన్న మార్గాలేంటో అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి..సాధ్యమైన సమయాల్లో దానిలో పాలుపంచుకోండి. మొట్టమొదట మీ జీవితాన్ని మీరు చూసుకుంటూ సమాజాభివృద్ధిలో భాగస్వాములు కండి.

*ప్రశ్న: ప్రజలు వీటిలో ఎలా భాగస్వాములు కావాలి?*

జేపీ: వార్డు కమిటీలు విధిగా ఉండాలి. మూడు లక్షల జనాభా దాటితే చట్టం ప్రకారమే వార్డు కమిటీలు ఉండాలి. మనకు పెట్టడం లేదు. పెట్టినా నామమాత్రంగా ఉంటున్నాయి. ఈ మధ్య కర్ణాటక వంటి రాష్ట్రాలలో అమలు చేస్తున్నారు..మన దేశంలో వరదలు వచ్చిన ప్రాంతంలో మూడు నెలల తర్వాత మంచి నీళ్లు లేవని చెబుతున్నాం. ప్రపంచంలోనే అత్యధిక వర్షపాతం ఉన్న చిరపుంజి వంటి ప్రాంతాలలో ఎండాకాలంలో నీళ్లు లేవు. అక్కడ దాదాపు 30 అడుగుల వర్షం వస్తుంది.. అంత వర్షం పడే ప్రాంతంలో ఎండాకాలంలో చాలా చోట్ల మంచినీళ్లు లేవు. ఎక్కడి నుంచి వస్తాయి..ముఖ్యమంత్రిని తిడితే నీళ్లు ఎక్కడి నుంచి వస్తాయి. ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకుందాం..మన కాలనీలో చేద్దాం..మన అపార్ట్‌మెంట్‌లో చేద్దాం..మన గ్రామంలో చేద్దాం. తలచుకుంటే మార్గాలున్నాయి. అందరూ అన్నీ చేయలేరు. ఎక్కడ అవగాహన ఉంటే, ఎక్కడ చేయాలనే కోరిక ఉంటే, పదిమంది కలిసి వచ్చే అవకాశం ఎక్కడ ఉంటే మొదలు పెట్టండి. మనకు మన చుట్టూ ఉన్న వాళ్లకు పనికొచ్చే కొద్దిపాటి కార్యాచరణ చేస్తే పది మార్గాలు వస్తాయి.

***ప్రశ్న: ఓటర్లే ముందుకు వచ్చి చిన్న చిన్న మార్పులకు నాంది పలికితే పెద్ద పెద్ద మార్పులన్నీ సాధ్యం అవుతాయంటారా?***

**జేపీ:** మరో మార్గం లేదు. ముఖ్యమంత్రి ఏమైనా దేవుడా ?ఆయన కూర్చుని ఇలా అంటే మారిపోతుందా?. ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు చేసే పని ఏంటంటే మనం కట్టే పన్నుల డబ్బును మనకు పెద్ద స్థాయిలో

సద్వినియోగం చేయడానికి మార్గాలను చూపెట్టి దాని కోసం పనిచేయడం అంతే. మన జీవితాలు మన వల్ల మారతాయి కానీ వాళ్ల వల్ల కాదు. మనం వాళ్లకు పూర్తిగా ఇచ్చేసి మిమ్మల్ని కొత్తగా ఎన్నుకున్నాం..మీరు తలుచుకుంటే పని అయిపోతుందని అనుకుంటున్నాం. చాలా సందర్భాల్లో మనకు ఎలా అగమ్యగోచరంగా ఉందో వారికి అలానే ఇది ఎలా అనేది అగమ్యగోచరంగా ఉంటుంది. మిగతా చెడు తీసేయండి..మనల్ని మెప్పించాలి..మళ్లీ ఓటు పొందాలి..అధికారం సంపాదించాలి..మనకు ఆ భయాలు లేవు కదా? అధికారం ఇచ్చే వాళ్లం అధికారం పొందేవాళ్లం కాదు..వారికి అధికారం పోతుందనే భయం ఉంది..మనకు ఏం భయం ఉంది. కాబట్టి మన చర్చ కానీ, ఆలోచన కానీ పూర్తిగా మారాలి. ఇక్కడ మొదలు పెట్టండి.. కచ్చితంగా అది కూడా మారుతుంది. పట్టణ ప్రాంతాల్లో ఓట్లు వేసేవారి శాతం పెరిగింది..రాజకీయపార్టీల్లోనూ కొంత మార్పు వచ్చింది..విద్యావంతులు, యువత, ఆలోచన ఉన్న వాళ్లని పార్టీలు ఈ రోజు అధికారప్రతినిధులుగా నియమిస్తున్నాయి. అందరూ వాళ్లలో నాయకులుగా మారడం లేదు..అది వేరు. కానీ ప్రజలకి ముఖం చూపెడుతున్నారు..మనలాంటి వాళ్లలో చలనం వస్తే వారు నాయకులుగా మారొచ్చు. ఇక్కడి చలనమే అక్కడి మార్పుకు మార్గం అవుతుంది.

***ప్రశ్న: రాజకీయం ప్రజల చుట్టూ కాకుండా నాయకుల చుట్టూ తిరుగుతుంది..ఈ రోజు రాజకీయాలు ఒక వినోదంగా మారిపోయాయి...ఈ సమస్యను ఎలా అధిగమించాలి?***

జేపీ: మన సమాజంలో చాలా గొప్ప లక్షణాలు ఉన్నా కొన్ని అవలక్షణాలు కూడా ఉన్నాయి. పెత్తందారి స్వభావం మన సమాజంలో అంతర్లీనంగా ఉంది. నాయకుల్లో కాదు మనలో ఉంది. మన కుటుంబం దగ్గర నుంచి కూడా అది ఉంది. పితృస్వామిక కుటుంబంలో తండ్రి ఎంత అసమర్థుడైనా సరే అతడి మాట నెగ్గాలి. ప్రజలకు ఆత్మన్యూనతా భావం..ఏదో రకంగా పదవి, పెత్తనం ఉంటే నాకు గుర్తింపు ఉంటుంది..గౌరవం ఉంటుందన్న భావన మనందరిలో కూడా ఉంది. దాని వల్లే ఈ పిచ్చి రాజకీయం చుట్టూ తిరగడం దానికి అంత గ్లామర్‌ను ఆపాదించడం మన సమాజం చేస్తుంది. ముందు మనం దాన్ని గుర్తించాలి. నిజాయితీగా మనకి మనం ఆలోచన చేసుకోవాలి..మనం చేసే పనివల్ల మనకు గౌరవం వస్తుంది కానీ మన పనివల్ల జరిగే ఫలితం వల్ల గౌరవం వస్తుంది కానీ మనం ఆక్రమించిన పదవి వల్ల గౌరవం వస్తే అంతకు మించిన దురదృష్టం ఇంకోటి లేదు. నేను చాలా ఏళ్ల క్రితం సహకార బ్యాంకులను అధ్యయనం చేయడానికి నెదర్లాండ్స్ వెళ్లాను. ఇక్కడ సహకార బ్యాంకుల్లో రూపాయి లేకపోయినా పదవి కోసం వేలాది మందిని సభ్యులుగా చేర్పించి బ్యాంకు అధ్యక్షులుగా ఎన్నికయ్యేవారు. ఆ బ్యాంకులో పైసా డబ్బులు ఉండేవి కావు. కానీ నెదర్లాండ్స్‌లో చాలా పెద్ద బ్యాంకులో పదవి గురించి వెంపర్లాట లేదు. అక్కడ బ్యాంకు అధ్యక్ష పదవి ఖాళీ అయితే 23 మంది అధికార పక్ష సభ్యులు కలిసి ఒక్కడే ఉన్న ప్రతిపక్ష సభ్యుడ్ని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. దీనిపై వారిని ప్రశిస్తే..రాజకీయ సిద్ధాంతాల్లో మేం రాజీపడం కానీ బ్యాంకు నిర్వహణ, ఆర్థిక విషయాల్లో అంత అవగాహన, ముందుచూపు, టెక్నాలజీ గురించిన



అవగాహన మాకు ఎవరికీ లేదు. మా డబ్బు సురక్షితంగా ఉండాలి, బ్యాంకు నిర్వహణ సమర్థవంతంగా ఉండాలి..అందుకే ప్రతిపక్షం అయినా ఆయన్ను ఎన్నుకున్నామని చెప్పారు. అదీ ప్రజాస్వామ్యం. జీవితంలో ఏమీ తెలియదు..సొంత కుటుంబాన్ని కూడా చూసుకోలేని మనిషి, పదవి ఏంటో అర్థం కాకపోయినా దాని కోసం వెంపర్లాడి కూర్చునే వాళ్లు ఈ దేశంలో కోకొల్లలుగా ఉన్నారు. రాజకీయ పదవుల కోసం భారతదేశంలో ఉన్నంత పోటీ ప్రపంచంలో ఎక్కడా లేదు. ఇక్కడ రాజకీయాన్ని తిట్టొద్దు. సమాజంలోనే బలహీనత ఉంది. ప్రజాస్వామ్యం అనేది ఒక్క రోజులో వచ్చేది కాదు. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికల్లో ఓట్లేసి, అరిచే స్వేచ్ఛ ఇస్తే వచ్చేది కాదు. ఓటు అంటే ఏంటో అర్థం అయ్యే వ్యవస్థ నిర్మాణం కావాలి. ఈ దేశంలో అది చేయలేదు. ఎప్పుడైతే ఓటంటే అర్థం అయ్యే వ్యవస్థ ఏర్పాటు చేయలేదో..పెత్తనం అది వ్యక్తిగతంగా

ఉంటుంది తప్ప నూటికి 90 శాతం సమాజానికి పనికొచ్చేలా ఉండడం లేదు.

ఎందుకు ఎన్నుకున్నాం..ఏం చేయాలి..చేయకపోతే నష్టం ఏంటో అర్థం అయితే ఓటు జాగ్రత్తగా వేస్తాం. అర్థం కాలేదనుకోండి..నా ఓటు వల్ల ఫలానా వారు రాజు అవుతున్నారు..కావున ఆయన డబ్బులు ఇస్తే తీసుకుంటాను..అనుకుంటున్నారు. ఓటు ఎందుకు వేస్తున్నామో అర్థం కాని వ్యవస్థను ప్రజాస్వామ్యం పేరుతో నిర్మాణం చేశాం.

***ప్రశ్న: సమర్థత, అర్హత లేనివాళ్లే ఎన్నికల్లో పోటీ పడు తున్నప్పుడు ఎవరిని ఎంచుకోవాలి?***

జేపీ: సమర్థులైన వ్యక్తులు ఈ దేశంలో లక్షల్లో ఉన్నారు. ప్రతీ కాలేజీ, గ్రామాల్లో అనేక మంది యువత కనిపిస్తున్నారు. కానీ వారిని నాయకులు అనడం లేదు. నాయకులు అంటే మనకు ఓ భావన ఉంది. నిజమైన నాయకత్వం అంటే పదిమందిని నడిపించే చాతుర్యం, నైపుణ్యం, పరిష్కారాలను చూపించే దిటవు కావాలి..అలాంటి వాళ్లు మన ఇళ్లల్లో, సంస్థల్లో, మన చుట్టూ ఉన్నారు..వారిని ఉపయోగించుకోవడం లేదు. వారిని ఉపయోగించుకోకుండా వారందర్నీ అర్జీదారులుగా తయారు చేశాం. సమస్యలను పరిష్కరించే వాళ్లంతా అర్జీదారులైపోయి..పరిష్కరించే సామర్థ్యం లేని వాళ్లో, పరిష్కరించాలనే ఆలోచన లేని వాళ్లందరూ రాజులైపోతుంటే ఏం అవుతుంది. వ్యవస్థ అడ్డదిడ్డంగా ఉంటుంది. ఈ దేశంలో పరిపాలనలో ఏం జరుగుతుందో ఎవరికైనా తెలుసా..ఏదో గుడ్డెద్దు చేలో పడ్డట్టు పోతున్నాం. అందుకే రాజకీయంలో ఉన్న వాళ్లు ఏం చేస్తున్నారూ.. ఎలాగు ఈ జనం ఒప్పుకోరు కాబట్టి మనం ఏంచేసినా నచ్చట్లేదు కాబట్టి మన వల్ల ఫలితాలు రావడం లేదు కాబట్టి వాళ్లను తృప్తి పరచాలి. ఎన్నికల్లో ఓట్లకు డబ్బులివ్వాలి..నెల నెల ఇంత వచ్చే ఏర్పాటు చేయాలి..ఇదే పరిపాలన. ఇంతకు మించి ఏం చెప్పట్లేదు.. ఇదిగో నీకు ఇంత ఇస్తున్నాను..నీ ఖాతాలో ఇంత పడుతుంది..నేను నీకే ఇచ్చేస్తున్నాను అని చెబుతున్నారు. డబ్బు మనది ప్రజలది.. మనం పన్నుల రూపంలో కట్టాం..వారికి ఉన్న అధికారం మనది ఓటు రూపంలో అక్కడ పెట్టాం. వాళ్లు మన దగ్గరకొచ్చి బిచ్చగాళ్లగా చేసి నేను నీకు ఇస్తున్నా అంటున్నాడు..మనం బాబ్బాబు అంటున్నాం. వాళ్లను నేను తప్పుబట్టడం లేదు. అది అనివార్యం. కేంద్రీకృత ప్రజాస్వామ్యంలో ఓటు ఎందుకో అర్థం కాని వ్యవస్థను నిర్మాణం చేస్తే పన్నుల డబ్బులు ఎక్కడికి పోతున్నాయో తెలియకుండా ఉంటే, అధికారం అందనంత దూరంగా ఉంటే .. మూడు మాటలు చెప్పాను..ఓటు అర్థం కావడం లేదు, పన్నుల డబ్బులు ఏమవుతున్నాయో తెలియడం లేదు, అధికారం అందనంత దూరంలో ఉంటుంది..ఈ మూడు ఉంటే ఈ రోజు చాలా రాష్ట్రాలలో జరుగుతుంది అనివార్యం. ఎవర్నో తిట్టొద్దు. ఎలా మార్చాలో ఆలోచిద్దాం.

***ప్రశ్న: మనం ఎన్నుకున్న వ్యక్తి ఐదేళ్లలో ఏం చేయాలి..ఏం చేశారు..అనేది ఓ సామాన్య వ్యక్తి ఎలా తెలుసుకోవాలి?***

జేపీ : అందరికీ నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందిస్తామనే నమ్మకం కలిగించాలి. ఏ ఊరికి ఆ ఊరులో సమస్యల పరిష్కారానికి వనరులను ఎలా అందిస్తామో అర్థం అయ్యే వ్యవస్థ నిర్మాణం కావాలి. మన ఆడపిల్లకి అన్యాయం జరిగితే వెంటనే నిందితుడికి శిక్ష పడే వ్యవస్థను ఎలా ఏర్పాటు చేస్తామో చెప్పగలగాలి. అప్పుడు ఏమౌతుందీ.. తాయిలాలకు బదులు ఇంకొకటి ఉందనే ప్రత్యామ్నాయం దొరకుతుంది. రాజకీయంలో ఇవాళ దేశంలో చాలా మేరకు దివాళకోరుతనం ఉంది. ఏ రకంగా ప్రజలకు ప్రత్యామ్నాయాలను చూపెట్టాలో..దాన్ని అమలు చేయాలో తెలియక రాజకీయ పార్టీలు కుడితో పడ్డ ఎలకల్లాగా ఉండిపోతున్నాయి. దీర్ఘకాలంలో నిజంగా అధికారాన్ని జనం దగ్గరకు తీసుకురావాలి. కొన్ని జాతీయ స్థాయిలోనే జరుగుతాయి..దేశ రక్షణ మన ఊరిలో జరగాలంటే మూర్ఖత్వం అవుతుంది. కొన్ని రాష్ట్ర స్థాయిలోనే జరుగుతాయి. విద్యావిధానం ఎలా ఉండాలి, ఆరోగ్య వ్యవస్థ నిర్మాణం ఎలా చేయాలనేది రాష్ట్రస్థాయిలోనే జరుగుతాయి..కానీ ఎన్నో విషయాలు మన ఊర్లో మన చుట్టూ మన దగ్గర్లో జరుగుతాయి..సాధ్యము..అవసరము. ప్రపంచం అంతా జరుగుతుంది. కాబట్టి అధికారాన్ని ఏమేరకు ఎట్లా ప్రజలకు అర్థం అయ్యే రీతిలో ప్రజలు పూర్తిగా మార్పులను స్థానికంగా సాధించేందుకు వికేంద్రీకరించాలి..ఈ రెండూ చేస్తే ఈ ప్రజాస్వామ్యం బాగుపడుతుంది. లేకపోతే ఇలాగే ఏదో ప్రవాహంలో కొట్టుకుపోతుంది. ఉన్నకొద్దీ అందరూ అదే పద్ధతిని పాటిస్తున్నారు. ఓట్ల కొనుగోలు మొదట్లో కొంతమంది చేసేవారు ఇప్పుడు అందరూ చేస్తున్నారు..తాయిలాలు కొందరిచ్చే వాళ్లు ఇప్పుడు అందరూ ఒకర్ని మించి ఒకరు పోటాపోటీగా అన్ని రాష్ట్రాల్లో ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు. కాబట్టి అది మార్గం కాదు..అది పూర్తిగా వినాశనానికి

మార్గం దానికి ప్రత్యామ్నాయంగా ఓటేమిటి..పన్నుల డబ్బు ఏంటి? ఈ ఎన్నికయితే ఆ మనిషి వల్ల నా జీవితంలో జరిగే మార్పు ఏంటి స్పష్టంగా అర్థం అయ్యే వ్యవస్థను నిర్వచించాలి..విధానాల్ని రూపొందించాలి. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో అద్భుతమైన నాయకత్వం ఉండేది. స్థానిక ప్రభుత్వాలు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేవి. స్థానిక ప్రభుత్వాలు బలపడుతున్న సమయంలో దాన్ని చంపేసి 1970ల్లో కేంద్రీకరణ తీసుకొచ్చి అసలు పరిపాలన అంటే అసెంబ్లీ, పార్లమెంటు ఇంకొకటి లేదసలు..కొత్తది కాదు ఒకప్పుడు ఉన్నదే. మళ్లీ దానికి వెళ్లాలి.

*ప్రశ్న: పరాయీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేసి స్వాతంత్ర్యం పొందిన మన ప్రజలు మళ్లీ ఇలా పరాధీనులుగా ఎందుకు మారిపోయారు?*

జేపీ: పెత్తందారీస్వభావం ఉన్న దేశం. తెల్లదొరల బదులు నల్లదొరలు పెత్తనం చేస్తే స్వరాజ్యం అని చాలా మంది అనుకున్నారు. గాంధీగారు మాత్రం అలా అనుకోలేదు. ఆయన మాటల్ని తాత్కాలికంగా గౌరవించారు..నమస్కరించారు..కానీ ఆయన భావజాలం మనస్సుల్లోకి ఇంకలేదు. ఇవాళ కాకపోతే రేపైనా తెల్లవాళ్లందరూ వెళ్లిపోతారు..అయితే మన పోరాటం వల్ల పోతారు లేకపోతే భరించలేకపోతారు. ఇంత పెద్ద దేశాన్ని మేం ఎక్కడ చూస్తాం మా చావు మేం చస్తాం అని పోతారు..అది అనివార్యం. వాళ్లు పోయినంత మాత్రాన స్వరాజ్యం వచ్చినట్టు అనుకుంటున్నారా..చాలా పొరపాటు. ఈ వారణాసి నగరంలో ఈ మురికి ఏంటి? ఈ మలమూత్రాలు ఏంటి? ఈ అసహ్యం ఏంటి? ఇది తెల్లవాళ్ల వల్ల వచ్చిందా? దాన్ని బాగు చేసుకునే సత్తా మనకు లేకపోతే, నైపుణ్యం లేకపోతే స్వరాజ్యం ఎక్కడుంది. జెండా మారితే స్వరాజ్యం కాదని 1915లో బెనారస్ విశ్వవిద్యాలయంలో ని ఓ సమావేశంలో గాంధీగారు ఈ మాటలు చెప్పారు. మహాత్మాగాంధీకి చాలా స్పష్టమైన ఆలోచన ఉంది. నీకు ఎప్పుడైన ఓ పనిచేయాలా వద్దా అనే సందేహం కలిగితే మారుమూల ఉన్న మనిషిని చూడు.. నువు చేసే పని వల్ల వాడి జీవితం మీద వాడికి అధికారం పెరిగేటట్టయితే అది చేయదగింది. నువు చేసే పని వాడ్ని మరింత పరాధీనుడ్ని చేస్తే అది చేయదగింది కాదు..అని పరిపాలనలో ఉన్న వాళ్లకు చెప్పారు. అది స్వరాజ్యం. స్వరాజ్యానికి మనం పూర్తిగా వికృతమైన అర్థాన్నిచ్చాం. నా జీవితం మీద నాకు అధికారం పెరిగిందా లేదా, నా పిల్లలకు బాగా చదువొచ్చింది..తెలివి వికసించింది.. ప్రపంచంలో మనగలరు..అధికారం పెరిగింది. నాకు మంచి ఆరోగ్యం వచ్చింది. ఉత్పాదకత పెరిగింది, పనిచేసుకోగలను , అప్పుడు స్వరాజ్యం వచ్చింది..పదిమంది కలిసి పనులు చేసుకోగలం, స్వయంగా నిర్ణయించుకోగలం..స్వరాజ్యం వచ్చింది. వాస్తవాలను తెలుసుకోగలను..నిలదీయగలను.. స్వరాజ్యం వచ్చింది. ఇది తప్ప మనం అన్నీ చేశాం. కాబట్టి గాంధీజీ, అంబేద్కర్ ఆనాటి మహనీయులు కోరుకున్న స్వరాజ్యం వేరు. ఆ తర్వాత దానికి మనం తీసుకొచ్చిన అర్థం వేరు. మొదట కొంతకాలం పాటు ప్రయత్నం చేశాం. తర్వాత ఆ స్ఫూర్తిని చంపేశారు. పూర్తిగా పరాధీనుల్ని చేశారు. పంచదార కావాలంటే పర్మిట్ కోసం ఆ రోజుల్లో అడుక్కునే పరిస్థితి తీసుకొచ్చారు. ఆత్మగౌరవాన్ని చంపేశారు. పది బస్తాల సిమెంట్ కావాలంటే సబ్‌కలెక్టర్ ఆఫీసు ముందు పర్మిట్ తీసుకునేవారు. కొరతను సృష్టించి, స్వేచ్ఛను తీసేసి ఆర్థికంగా అలా నాశనం చేశాం. పోటీ చంపేసి , ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని కొనసాగించి ప్రతి దానికి ప్రభుత్వంపై ఆధారపడడం.. మరి ప్రభుత్వ నిర్వహణలో ఈ విధంగా కేంద్రీకరణ చేసి మన ఊళ్లో ఉన్న స్వావలంబన చంపేసి అధికారం మనకు లేకుండా చేసి మనల్ని మరో రకంగా పరాధీనుల్ని చేసే ఆ ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతోంది.. ఆర్థిక వ్యవస్థలో కొంత మార్పు వచ్చింది..కానీ రాజకీయంగా ఇంకా కేంద్రీకరిస్తున్నాం.

*ప్రశ్న: నేరచరిత్ర ఉన్న వాళ్లు రాజకీయాల్లోకి రాకుండా అడ్డుకోవడం ఎలా?*

జేపీ : ఈ అంశంపై ఉద్యమాన్ని ప్రారంభించిందే లోక్‌సత్తా . 1998-1999లో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల నేరచరిత్రను లోక్‌సత్తా బయటపెట్టింది. నిర్దిష్ట ప్రమాణాలు నిర్ణయించి వివరాలు సేకరించాం. మహామహులతో కమిటీ ఏర్పాటు చేసి పక్షపాతాలు, పార్టీలకతీతంగా ప్రజల ముందు 42 మంది నేరచరితుల పేర్లను బయటపెట్టాం. దేశవ్యాప్తంగా ఆ రోజు సంచలనం అయింది. అయితే ఇది మౌలికమైన సమస్యగా ఆనాడు కూడా భావించలేదు. మన రాజకీయంలో ఉన్న కుళ్లుకు తిరుగులేని నిదర్శనం నేర రాజకీయం. ఈ వ్యవస్థలో ఉన్న తప్పేంటి అనేది అర్థం కాకపోయినా వ్యవస్థ ఎక్కడో కుళ్లిపోయిందన్న విషయం అర్థం కావాలంటే నేరస్తులు చట్టాలు చేయడం ఏంటి? అనేది అర్థం కావాలి. అప్పుడు చెప్పాను..ఇప్పుడు చెప్పాను. ఇది ఊరికే ఆర్డర్ ఇస్తే పోయేది కాదు. వెనకాల ఉన్న మూల కారణాలు ఉన్నాయి. మొదటి

కారణం ఏంటి? మనం నేరస్తుడు అనుకున్న వ్యక్తి సమాజంలో సెటిల్‌మెంట్లు చేస్తున్నాడు..అప్రకటిత న్యాయమూర్తులుగా గూండాలు చలామణీ అవుతున్నారు. ఎప్పుడైతే సమాజంలో చట్టబద్ధ పాలన ఉండదో, వేగంగా న్యాయం అందే ఏర్పాటు ఉండదో. నేరస్తులకు మంచి డిమాండ్ వస్తోంది. రెండోది డబ్బు, పరపతి ఉన్నా రాజకీయాల్లోకి వస్తున్నాడు. ఈ దేశంలో పోలీసు యంత్రాంగం, నేరపరిశోధన యంత్రాంగం రాజకీయనాయకులకు సలాం అనాల్సి వస్తోంది. అమెరికాలో 1970వ దశకంలోనే ఎఫ్‌బీఐలో జోక్యం చేసుకునే అధికారం ఆ దేశ అధ్యక్షుడికి సైతం లేదు. జోక్యం కోసం చాలా ప్రయత్నం చేశారు. కానీ చివరకు చేయలేకపోయారు. మన దేశంలో ఎంపీపీనో, మున్సిపల్ చైర్మన్‌పైనే నేరారోపణ వస్తే నిజాయితీగా పరిశోధన చేయమనండి. సాధ్యమా? చట్టం ఈ దేశంలో అధికారం కానీ డబ్బు కానీ ఉన్న వాడి చేతిలో బందీ అయిపోయింది. నేరపరిశోధనను మీరు స్వతంత్రం చేయండి..ఇవాళ ఏం అవుతుంది. ఏ గూండా అయితే పోలీసులను చూసి భయపడాలో ఆ గూండా రాజకీయాల్లోకి రాగానే అతడ్ని చూసి పోలీసులు భయపడుతున్నారు. బదిలీ చేయించేది ఆయన..లేకపోతే శంకరగిరి మాన్యాలు పట్టిస్తాడు. ఒక కేసు కట్టాలా? లేదా ఒక కేసు తీసేయాలా? ఇది నిర్ణయం చేసేది రాజకీయాల్లో ఉన్న వాడు. ఆ మాట వినకపోతే మర్నాడు పంపించేస్తారు. కాబట్టి పక్షపాతాలకు అతీతంగా అదే సమయంలో జవాబుదారీతనం ఉండేట్టుగా చేయాలి. పోలీసులను నిరంకుశుల్ని చేస్తే అదీ ప్రమాదం అవుతుంది. సామాన్యుల ప్రాణాలకే ముప్పు కలుగుతుంది. కాబట్టి జవాబుదారీతనం ఉండేలా వ్యవస్థలో ఆ మార్పులు తీసుకురావాలి. గతి లేక వీళ్లని రాజకీయాల్లోకి తీసుకొస్తున్నారు. వీళ్లొస్తే నెగ్గే అవకాశం ఉన్న మాట వాస్తవం. ఎన్నికల్లో కావాల్సిన డబ్బులు, మందిబలం, కులం బలం ఉంటున్నాయి. రాజకీయాల్లోకి వచ్చిన ప్రతీ నేరచరిత నాయకుడు ఏదో రకంగా కులం నాయకుడిగా చలామణీ అయ్యాడు. కులం నాయకుడిగా చలామణీ కాకుండా ఒక్కరు నెగ్గలేదు. వీటిని మార్చకుండా ఊరికే తిట్టిపోస్తుంటాం. అయితే పరిష్కారం ఉంది. వేగంగా న్యాయం అందించే ఏర్పాటు చేస్తే సెటిల్‌మెంట్లకు గూండాలు అవసరం లేదు. చట్టబద్ధ పాలన తెండి..డబ్బు , అధికారంతో సంబంధం లేకుండా నిష్పాక్షికంగా పనిచేసే వ్యవస్థను ఏర్పాటు చేయండి..అది చేయలేకపోవడం మన దురదృష్టం. అది ఈ దేశంలో చేయలేదు. ఎన్నికల వ్యవస్థను మార్చండి. సమస్య స్వరూపాన్ని అర్థం చేసుకోకుండా ప్రతీ దాన్ని నైతికంగా మాట్లాడతాం. నీతి, నిజాయితీ నైతిక విలువలు పోయాయని మాట్లాడతాం. మనకే విలువలు ఉన్నాయి..అధికారంలో ఉన్న వాళ్లకు లేవు అంటే ఎలా? అధికారంలో ఉన్న వాళ్లు దాన్ని నిలబెట్టుకోవడానికి ఆ ప్రవాహంలో కొట్టుకుపోతున్నారు. మనం అధికారం కోసం పాకులాడడం లేదు కాబట్టి నిజాన్ని నిర్భయంగా చెప్పగలుగుతున్నాం. అధికారాన్ని ఆశించినప్పుడు వీటిని మార్చకపోతే ప్రవాహంలో మీరు కూడా బందీ అయిపోయారు. మీరు ఎంత గొప్పవాళ్లయినా దాన్నుంచి బయటపడలేరు. దీన్ని మార్చడానికి పద్ధతులున్నాయి. పదవులుంటే నాయకత్వం కాదు.

***ప్రశ్న: ఈ భావదారిద్ర్యం పోవాలంటే స్వాతంత్రోద్యమ పోరాటం 2.0 రావాలి. బానిసలం అనే భావనను మనం వదిలేయాలి. మనకున్న శక్తిసామర్థ్యాలను మనం తిరిగి ఉపయోగించుకోగలిగితే మన దేశాన్ని మనం అభివృద్ధి చేసుకోగలం? ఇది ఎంతవరకు కరెక్టు?***

జేపీ: నూటికి నూరుపాళ్లు ఇది వాస్తవం. నాయకత్వంలో ఉన్న వాళ్లు చేయాల్సింది. మీకు అధికారం ఉన్న మేరకు అందరూ ఒకరోజే చేస్తారని నేను అనడం లేదు. దానికి తగ్గ పరిస్థితులను సమకూర్చాలి..అది జరిగే దాకా ఆర్థిక వ్యవస్థ వేగాన్ని పెంచాలి. అందుకే ఈ మధ్య కాలంలో ఓ ప్రయత్నం జరుగుతోంది. రాష్ట్రాలు దివాళా తీస్తున్నాయి. జాతీయస్థాయిలో కూడా అప్పులు పెరుగుతున్నాయి కావున కొంత అదుపు ఉండాలని. సుప్రీంకోర్టు మాట్లాడుతోంది. కచ్చితంగా ఇది అవసరం. నిష్పాక్షికంగా చేయాలి. అలాగే మంచి విద్య, మంచి ఆరోగ్యం. విద్యకు చాలా ఖర్చు పెడుతున్నా విద్య అందడం లేదు. విద్య అందకపోతే ఆ వ్యక్తి మేధస్సు వికసించదు..స్వయం పోషణరాదు. ఆత్మవిశ్వాసం కలగదు. ఆరోగ్యం లేకుండా ఈసురోమని దేశం ఉంటే ప్రగతి ఉండదు. ఈ మార్పులు పూర్తిగా మనదేశంలో సాధ్యం. చట్టబద్ధపాలన, స్థానిక ప్రభుత్వాలు అవసరం. ఈ పనులు మనసు పెట్టి చేయండి. 2047లో ఈ చర్చ ఉండదు. మనం ఏమీ బాధపడాల్సిన అవసరం లేదు. గొప్ప విజయాల్ని సాధించాం. ఇన్నేళ్లపాటు ఒక స్వతంత్ర దేశంగా ఐక్యంగా మనగలగడమే గొప్ప విజయం. ఒక బలమైన ఫెడరల్ వ్యవస్థను నిర్మాణం చేయడమే అద్భుతం. ఎంతో కొంత ఆర్థిక వ్యవస్థను సాధించడం అద్భుతం. కాబట్టి మనం అద్భుతాలను సాధించగలం. దానికి మార్గం ఉంది. 75 ఏళ్ల అనుభవం మనకు ఆ మార్గాన్ని చూపింది.

# 1972-2022
# సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిణామాలు
## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్




అయిదు వేల సంవత్సరాల అవిచ్ఛిన్నమైన సంస్కృతి ఉన్న ఒక జాతికి యాభై ఏళ్ల కాలం చాలా స్వల్పంగా అనిపించవచ్చు. కానీ శరవేగంగా మారుతున్న కాలంలో అర్థ శతాబ్దం చాలా దీర్ఘకాలం. 1970ల దశకం నాటికి మన సమాజంలో స్వతంత్ర పోరాట స్ఫూర్తి, ఆ పోరాటాన్ని ప్రేరేపించిన సార్వజనీనమైన మానవ విలువలు, కులమతాలను అధిగమించిన ఉదారవాద జాతీయవాదం.. ఇవన్నీ ఇంకా కొనసాగుతున్నాయి. గత 50 ఏళ్లలో కొంతవరకు ఆ స్వతంత్ర పోరాట జ్ఞాపకాలు, మానవ విలువల ప్రభావం, అడ్డుగోడల్ని తొలగించే జాతీయవాదం పలచబడ్డాయి. స్వతంత్ర పోరాటకాలంనాడూ, ఆ తర్వాత పాతికేళ్లపాటు బలంగా సాగిన సామాజిక సంస్కరణ ఉద్యమాల ప్రభావం గత యాభై ఏళ్లలో క్రమక్రమంగా తగ్గుముఖం పట్టింది. అప్పటిదాకా కులవ్యవస్థ నిర్మూలన కోసం, మూఢనమ్మకాల్ని అంతం చేయటం కోసం, మానవ హక్కుల్ని, ముఖ్యంగా స్త్రీల హక్కుల్ని కాలరాసే మత ఛాందసాన్ని రూపుమాపటం కోసం బలమైన ఉద్యమాలు నడిచాయి. కానీ గత అర్థశతాబ్దంలో సామాజిక సంస్కరణల విషయంలో కూడా రాజ్యానికి, చట్టానికి పెద్దపీట వేయటం జరిగింది. చాలా రంగాల్లో విఫలమైనా, సామాజిక సంస్కరణల విషయంలో మన రాజ్యవ్యవస్థ నాడు, నేడు ఉదార వైఖరినే అవలంబిస్తున్నది. బాల్య వివాహాలను అరికట్టటంగానీ, వరకట్న నిర్మూలనగానీ, అస్పృశ్యతా నిర్మూలనగానీ, పుట్టుకతో చూపే వ్యవస్థాగతమైన వివక్షగానీ, వెట్టిచాకిరి నిర్మూలనగానీ, మహిళలకు గర్భస్రావ హక్కుగానీ, మహిళలకు ఆస్తిహక్కుగానీ, గృహహింస నిరోధంగానీ ఎన్నో మంచి చట్టాలు సత్సంకల్పంతో వచ్చాయి. కానీ కేవలం కొద్దిరంగాలలో మాత్రమే చట్టాలు గణనీయమైన ఫలితాలను ఇచ్చాయి. మిగిలిన రంగాలలో బలమైన సామాజిక ఉద్యమాలు లేకపోవటంతో చట్టం, రాజ్యం చేపట్టే చర్యలు కేవలం సత్సంకల్పానికి నిదర్శనంగా నిలిచినాయి తప్ప, అనుకున్నంత ఫలితాలనివ్వలేదు.

అయితే ఆధునిక శాస్త్ర సాంకేతిక విజ్ఞాన ప్రభావం వలన మూఢ నమ్మకాలు కొంతవరకు సడలినాయి. అలాగే పెరుగుతున్న పట్టణీకరణ వల్ల, మారుతున్న ఆర్థిక వ్యవస్థ వల్ల కులవ్యవస్థలో కట్టుబాట్లు చాలావరకు సడలినాయి. కానీ ఓవంక ఇప్పటికీ అత్యధిక వివాహాలు, దాదాపు 95% కులం లోపలే జరపటం, రెండోవంక రాజకీయం ప్రజలను సమీకరించటానికి కులాన్ని ప్రధాన సాధనంగా వాడటం.. కారణాల వల్ల రాజకీయంగా, ఆర్థికంగా కులం స్పృహ పెరిగింది. కులాలకతీతంగా రాజ్య నిర్మాణం జరగకుండాకకులం ప్రాతిపదికగా రాజకీయం నడుస్తున్నది.

### తగ్గుతున్న లింగవివక్ష

విద్య, ఆరోగ్యం, ఆర్థిక రంగాలలో లింగ వివక్ష చాలావరకు తగ్గింది. మధ్యతరగతి వర్గాల బాలికలు/యువతులు విద్యాభ్యాసంలో అన్ని స్థాయిల్లోనూ బాలురు/యువకుల కంటే ముందున్నారు. అవకాశాలిస్తే, మహిళలు సమాజంలో అన్ని రంగాలలోనూ రాణించగలరని నిత్యం రుజువవుతున్నది. కానీ ఆ అవకాశాలు ఇప్పటికీ కొన్ని రంగాలకి, కొన్ని వర్గాలకి మాత్రమే పరిమితమవుతున్నాయి. ఉదాహరణకి, రాజకీయంలో ఇప్పటికీ మహిళల పాత్ర నామమాత్రమే. గత అర్థశతాబ్దంలో మహిళలకి కాలక్రమేణా చట్టబద్ధంగా ఆస్తిహక్కులు సంక్రమించినా, ఇంకా కొనసాగుతున్న సాంప్రదాయాల కారణంగా ఈ హక్కు అందరికీ వాస్తవ రూపం ధరించటం లేదు. అన్నిటినీ మించి గత ఇరవై ఏళ్లలో కార్మికశక్తిలో మహిళల భాగస్వామ్యం గణనీయంగా తగ్గిపోయింది. ఒకప్పుడు 35% ఉండగా, ఈ భాగస్వామ్యం ఈనాడు 20% కంటే తగ్గిపోయింది. మత ఛాందసాన్ని రాజ్యానికి పునాదిగా చేసుకున్న సౌదీ అరేబియా లాంటి దేశాల కంటే మన దేశంలో ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యం ఇంకా తక్కువ.

మన పొరుగున ఉన్న దేశాలు శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్, ఇరాన్, మలేషియా, ఫిలిప్పిన్స్, థాయ్‌లాండ్, ఇండొనేషియా లాంటి దేశాల కంటే మన దేశంలో స్త్రీల భాగస్వామ్యం తక్కువగా ఉంది. ఇది చాలా ఆందోళన కలిగించే పరిణామం. మన సమాజం, రాజ్యం ఇందుకు కారణాలను లోతుగా ఆలోచించి వెంటనే పరిష్కారాల్ని అమలు చేయకపోతే, వచ్చే 25 ఏళ్లలో పరిస్థితి మరింత క్షీణించే ప్రమాదం ఉంది.

పెరుగుతున్న పట్టణీకరణ వల్ల సాంప్రదాయంగా వస్తున్న సామాజిక కట్టుబాట్లు కొంతవరకు సడలిపోయాయి. అయితే గ్రామాల్లో మౌలిక సదుపాయాలలేమి, ఎక్కడికక్కడ ఆర్థిక వ్యవస్థను ఆధునికీకరించి స్థానిక పట్టణీకరణను ప్రోత్సహించే ఏర్పాటు లేకపోవటం వల్ల గ్రామ ప్రాంతాల నుంచి సుదూరమైన నగరాలకు పొట్ట చేత పట్టుకుని తరలిపోవాల్సి వస్తోంది. కొద్దిపాటి చదువు, నైపుణ్యం, ఎదగాలనే తపన ఉన్నవారంతా దూరప్రాంతాలకు వలసలు పోవటంతో చాలా గ్రామాలు క్రమంగా నిర్జనం కావటమే కాకుండా, గ్రామీణ సమాజానికి ప్రగతిశీల నాయకత్వాన్నిచ్చే వ్యక్తులు కరువయ్యారు. గ్రామాలకి, పట్టణాలకి మధ్య అంతరం విపరీతంగా పెరుగుతున్నది. గ్రామీణ సమాజం కేవలం పార్టీ/వర్గ రాజకీయాల వేదికగా మారిపోయింది. నివసించే ప్రాంతాన్ని బట్టి ఒకే దేశం గ్రామీణ, నగర భారతాలుగా విడిపోయింది.

కాలానుగుణంగా కుటుంబ వ్యవస్థలోను, వైవాహిక సంబంధాలలోనూ కొన్ని మార్పులు వచ్చినా చాలావరకు కుటుంబ వ్యవస్థ బలంగా ఉంది. అందుకే ఎంత బీదరికం ఉన్నా అత్యధికులైన పిల్లలు కుటుంబంలో పెరుగుతున్నారు. పట్టణ ప్రాంతాలలో నేరప్రవృత్తి కొంత మేరకు పెరిగినా, మన దేశంలో ఉన్న బీదరికం, విద్యా వ్యవస్థలో బలహీనత, చట్టబద్ధపాలనలో వైఫల్యం.. ఈ మూడింటి నేపథ్యంలో ఇప్పటికీ మన సమాజంలో ప్రపంచంతో పోలిస్తే నేరాలు చాలా అదుపులో ఉన్నాయి. అందుకే సమాజాన్ని ఆధునికీకరిస్తూనే, కుటుంబ వ్యవస్థను కాపాడుకోవటం మన సమాజ భవిష్యత్తుకి అవసరం.

గత 50 ఏళ్లలో రాజకీయంలో ఉన్న అపశృతులు, అధికారమే లక్ష్యంగా చేపట్టిన విధానాలు కొన్ని విధాలుగా సమాజాన్ని బాగా బలహీనపరిచాయి. ఒకప్పుడు బీదరికంలో ఉన్నా.. ఆత్మగౌరవం, స్వావలంబన మన ప్రజల నినాదాలుగా ఉండేవి. రాజకీయ వ్యవస్థ ఓట్ల వేటలో ప్రజల శక్తిసామర్థ్యాలను పెంచకుండా, తాత్కాలికమైన తాయిలాలకు ప్రాధాన్యత ఇవ్వటం ప్రజల్ని చాలావరకు పరాధీనుల్ని చేసింది. తమ కాళ్ల మీద తాము నిలబడాలనే తపన కలిగి, ఎంతటి కష్టంలో ఉన్నా పౌరుషంతో బతికిన సమాజం.. కాలక్రమంలో సంఘటిత కృషిని, స్వావలంబనను మరచిపోయి ప్రతి చిన్న పనికీ ఎవరో వస్తారని, ఏదో చేస్తారని, తమ పన్నుల డబ్బుతో పోషించే తాము ఎన్నుకున్న ప్రభుత్వం, తమకేదో చేసిపెడుతుందని ఎదురుచూడటం మొదలుపెట్టారు.

**విజయవంతంగా కుటుంబ నియంత్రణ**

ఇక ఆధునిక యుగంలో సమాజాన్ని సమూలంగా మార్చే



రెండు మౌలికమైన ఆయుధాలు ఆరోగ్యం, విద్య. కొంతవరకు ఆధునిక ఆరోగ్య వ్యవస్థ ఫలితాలు మన ప్రజలకు అందినాయి. 1972లో ఒక మహిళ తన జీవితకాలంలో సగటున 5.4 మంది పిల్లలకి జన్మనిచ్చేది. గత యాభై ఏళ్లలో సమాజంలో అవగాహన పెరగటంతోపాటు కుటుంబ నియంత్రణ పద్ధతులు సమర్థంగా అందటంతో సంతానోత్పత్తి గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం దేశం మొత్తంలో సగటున ఒక మహిళ జీవితకాలంలో ఇద్దరు పిల్లలకు జన్మనిస్తున్నది. దక్షిణాది రాష్ట్రాల్లోనైతే, ఈ సంఖ్య ఇంకా తగ్గి 1.6 దగ్గర ఉన్నది. 1970ల దశకంలో ఆలోచనాపరులందరూ జనాభా విస్ఫోటం గురించి విపరీతంగా కలత చెందేవారు. ఒక వైద్య విద్యార్థిగా జనాభా విస్ఫోటం కారణంగా దేశ భవిష్యత్తు గురించి ఎంత ఆందోళన చెందానో ఇప్పటికీ గుర్తున్నది. కానీ ఈ రంగంలో తొలుత కొన్ని తప్పటడుగులు వేసినా కాలక్రమేణా అనుభవం నుంచి పాఠాలు నేర్చుకుని మన సమాజం గణనీయమైన ఫలితాలు సాధించింది. ఆనాడు జననాల రేటు 1000 జనాభాకి 38.7 ఉండగా, ఈనాడు అది 17.16కి పడిపోయింది. అలాగే ఆనాడు మరణాల రేటు 1000 జనాభాకి 16.54 ఉండగా, ఈనాడు అది 7.38కి పడిపోయింది. ఈ కారణంగా జనాభా వృద్ధి రేటు గణనీయంగా తగ్గటంతోపాటు సగటు జీవనకాలం పెరిగింది. 1972లో మన దేశంలో ఒక పౌరుడి సగటు జీవనకాలం 48.72 సంవత్సరాలుండగా, ఇప్పుడది 70.19 సంవత్సరాలకు పెరిగింది. 1972లో మన జనాభా 58 కోట్లుండగా, 2022లో అది 140 కోట్లు దాటింది. బహుశా మరో 30 ఏళ్ల కాలంలో మన దేశ జనాబా 160 కోట్లకు చేరుకుని, అప్పట్నుంచి క్రమంగా తగ్గుతుంది. 2100 నాటికి మన దేశ జనాభా 109 కోట్లకు తగ్గుతుందని అంచనా. అయితే అందరికీ ఆరోగ్యం ఇంకా సుదూరమైన లక్ష్యంగానే మిగిలిపోయింది.

ఇప్పటికీ ప్రతి ఏటా ఐదున్నర కోట్ల మంది ప్రజలు సరైన ఆరోగ్యం అందక బీదరికంలోకి జారిపోతున్నారు. అంటే, సరైన

ఆరోగ్యాన్ని అందరికీ జేబులో ఖర్చు లేకుండా అందించగలిగితే, చాలా కొద్దికాలంలోనే బీదరికాన్ని పూర్తిగా నిర్మూలించగలం. కాని మనకి అవకాశాలున్నా ఇంకా ఆ ప్రయత్నం జరగటంలేదు.

**ఎమర్జెన్సీలో అణచివేత**

గత 50 ఏళ్లలో మన దేశ రాజకీయంలో సంభవించిన అత్యంత కీలక పరిణామం 1975లో విధించిన అత్యయిక పరిస్థితి. తొలి 25 ఏళ్ల స్వతంత్రంలో ప్రజాస్వామ్య పునాదులు కొంతమేర బలపడ్డ మాట వాస్తవం. కానీ 1972 నాటికి దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న రాజకీయ, పాలనా వైఫల్యాల ప్రభావం రాజకీయం మీద స్పష్టంగా కన్పించటం మొదలైంది. పెరుగుతున్న అవినీతి, దుష్పరిపాలన, అధికార కేంద్రీకరణ, నిరుద్యోగం, బీదరికం ఇవన్నీ ప్రజల్లో అసహనాన్ని, ఆగ్రహాన్ని పెంచాయి. అయితే తొలి 25 ఏళ్ల అనుభవాల్ని బేరీజు వేసుకుని పొరపాట్లను సరిదిద్దే సంకల్పంగానీ, సామర్థ్యంగానీ రాజకీయ వ్యవస్థకు కొరవడ్డాయి. ఒక నిర్మాణాత్మకమైన చర్చను, ఆచరణసాధ్యమైన పరిష్కారాలు, సంస్కరణలు, విఫలమైన విధానాల్లో సవరణలు ఇవేమీ చేపట్టకపోవటంతో ప్రజల ఆగ్రహాన్ని అణచివేయటం ఒక్కటే పాలక వ్యవస్థకు మార్గమైంది. ఆ కారణంగా 1975 జూన్‌లో దేశంలో అత్యయిక పరిస్థితిని విధించి, ప్రాథమిక హక్కులను కాలరాసి, రాజకీయ ప్రత్యర్థులందరినీ జైళ్లలో పెట్టి, దేశం మొత్తాన్నీ ఒక అతిపెద్ద జైలుగా మార్చేశారు. గత 50 ఏళ్లుగా ఆనాటి అత్యవసర పరిస్థితి ప్రభావం, పరిణామాలు మన రాజకీయ వ్యవస్థని ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. 19 నెలల చీకటి రోజుల తర్వాత 1977 పార్లమెంటు ఎన్నికల ఫలితాలతో అత్యవసర పరిస్థితి అంతమై ప్రజలకు మళ్లీ స్వేచ్ఛ లభించింది. కానీ మౌలిక రాజకీయ సంక్షోభాన్ని అర్థం చేసుకునే ప్రయత్నంగానీ, నిజమైన ప్రజాస్వామ్య సంస్కరణల్ని చేపట్టే ప్రయత్నంగానీ జరగలేదు. ఆటగాళ్లు తాత్కాలికంగా మారారుగానీ, ఆట నియమాలు అవే కొనసాగాయి. దాంతో రాజకీయ సంక్షోభం ముదురుతూ వస్తోంది గానీ, ప్రజాస్వామ్యం బలోపేతం చేసే దిశగా అడుగులు పడటం లేదు.

**సొంత ఆస్తులుగా మారిన పార్టీలు**

1970ల దశకం నాటికే ఆనాడు అత్యంత బలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం మరుగున పడింది. కాలక్రమేణా పార్టీలలో వ్యక్తిస్వామ్యం, నియంతృత్వం, పార్టీలు ప్రజల ప్రజాస్వామిక వేదికలుగా కాకుండా కొందరు వ్యక్తుల, కుటుంబాల సొంత ఆస్తులుగా చెలామణి కావటం దాదాపు అన్ని పార్టీలకూ వ్యాపించింది. ఈనాడు ఇక దేశంలో అత్యధిక పార్టీలు ఏమాత్రం అంతర్గత ప్రజాస్వామ్యం లేకుండా నడుస్తున్నాయి. పార్టీలోకి ప్రవేశం లేదా బహిష్కరణ, పార్టీల నాయకత్వం ఎంపిక, పార్టీ వనరుల సమీకరణ, వినియోగం, పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక ఇవన్నీ పూర్తిగా అప్రజాస్వామికంగా, పార్టీ అగ్రనాయకుల ఇష్టానుసారంగా నేటికీ జరుగుతూ వస్తున్నాయి. అంతర్గత ప్రజాస్వామ్యంలేని పార్టీలు సమాజంలో ప్రజాస్వామ్యాన్ని నడపలేవు. పార్టీ అగ్రనాయకుల ఇష్టానుసారమే పార్టీలో సభ్యుల ఎదుగుదల, అలాగే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక నిర్ణయమైతే, సమాజహితాన్ని కోరే సమర్థులకి రాజకీయంలో స్థానముండదు. నాయకుల అడుగులకి మడుగులొత్తేవారు మాత్రమే అలాంటి రాజకీయంలో మనగలరు. కాలక్రమేణా ప్రజలకు రాజకీయ వ్యవస్థ మీద విశ్వాసం సన్నగిల్లుతుంది. పార్టీల వ్యవస్థ కొందరు వ్యక్తుల అక్రమ ధనార్జనకి మార్గమవుతుంది. పార్టీలు సమాజ ప్రయోజనం కోసం కాకుండా కొందరు వ్యక్తులు అధికార దాహాన్ని తీర్చుకునే వేదికలవుతాయి. అధికారం ప్రజల ప్రయోజనాలని నెరవేర్చే సాధనంగా కాక, సొంత ప్రయోజనాలను నెరవేర్చుకునే లక్ష్యంగా మారుతుంది. మన దేశంలో రాజకీయ పార్టీల్లో ఈ అవలక్షణాలన్నీ స్పష్టంగా గోచరిస్తున్నాయి. గత 50 ఏళ్లలో పార్టీల్ని ప్రజాస్వామీకరించే ప్రయత్నం జరగలేదు. కాంగ్రెస్ ప్రభావం తగ్గుతున్న నేపథ్యంలో చాలా రాష్ట్రాలలో కాంగ్రెస్‌కు పోటీగా, ప్రత్యామ్నాయంగా ప్రాంతీయ పార్టీలు ఆవిర్భవించాయి. ఈ ప్రాంతీయ పార్టీలు ఆయా రాష్ట్రాలలో బలమైన ప్రభావాన్ని చూపెట్టాయి. కానీ ఆ పార్టీల అంతర్గత నిర్మాణం, వాటి రాజకీయ సంస్కృతి పూర్తిగా కాంగ్రెస్‌ను అనుకరించటంతో, ఉన్నకొద్దీ పార్టీలు ప్రయివేటు ఆస్తులుగా మారిపోయాయి. ఎన్నికల్లో నిజమైన పోటీ గుర్తింపుపొందిన పార్టీల మధ్యలోనే ఉండటంతో, ఎన్నికల్లో ఏ పార్టీ నెగ్గినా రాజకీయం తీరు, పరిపాలన తీరు మాత్రం యధాస్థితిగా కొనసాగుతున్నాయి.

**ఎన్నికలలో డబ్బు, తాయిలాల ప్రభావం**

ఓ వంక పార్టీల నిర్మాణం, నిర్వహణ చాలా లోపభూయిష్టంగా, అప్రజాస్వామికంగా ఉండగా.. మనకు అనువుగాని ఎన్నికల వ్యవస్థ రాజకీయ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసింది. బ్రిటన్‌లో ఉన్న ఎన్నికల పద్ధతిని, అందులో నియోజకవర్గాలవారీగా పోటీలో ఉన్న అభ్యర్థుల్లో అతి ఎక్కువ ఓట్లు పొందిన వారు ప్రాతినిధ్యం ఉండే వ్యవస్థని మనం అనుకరించటంతో, పార్టీలు రాజకీయంగా ఎంత దిగజారినా, వాటికి ప్రత్యామ్నాయాన్ని సృష్టించటం చాలా కష్టమైంది. మన ఎన్నికల వ్యవస్థలో ఒక్కో రాష్ట్రంలో రెండు పార్టీలకు మాత్రమే స్థానం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఓ 30-40% ఓట్లు వస్తాయన్న నమ్మకం లేకపోతే, ఆ పార్టీకి ఓట్లు పడవు, సీట్లు రావు. ఓట్లు వేసినా సీట్లు రావు కాబట్టి ఆ పార్టీ సిద్ధాంతం పట్ల విశ్వాసం ఉన్నా, నాయకత్వం పట్ల నమ్మకం ఉన్నా, ఆ పార్టీకి ఓటు వేయటం వల్ల ఓటు వృధా అనే నమ్మకంతో ఓట్లు వేయరు. ఇలాంటి ఎన్నికల వ్యవస్థ ఉన్న ఏ దేశంలోనైనా ఇదే తీరు ఉన్నది. కానీ ఆ దేశాల్లో పార్టీల్లో బలమైన అంతర్గత ప్రజాస్వామ్యం, ప్రజల్లో చైతన్యం, అత్యున్నత ప్రమాణాల బహిరంగ చర్చ, అధికార వికేంద్రీకరణ ఇవన్నీ బలంగా వేళ్లూనుకోవటంతో పెద్ద పార్టీలు అన్ని రకాల భావాలకీ వేదికలుగా ఉండి, నిజమైన అంతర్గత ప్రజాస్వామ్యంతో సమాజానికి మంచి మార్గాన్ని, పరిపాలనని అందించగలుగుతున్నాయి. ప్రత్యామ్నాయ విధానాల్ని అందించగలుగుతున్నాయి. కానీ మన నియంతృత్వ పార్టీ వ్యవస్థ, మన ఎన్నికల విధానం ఈ రెంటి కలయిక, దేశ ప్రజాస్వామ్యానికి

అత్యంత ప్రమాదకరమైనది. ఒక్క ఓటు ఎక్కువ వస్తే గెలుపు, ఒక్క ఓటు తక్కువ వస్తే ప్రాతినిధ్యంలేని ఎన్నికల వ్యవస్థలో గెలిచే ఓట్లు రాబట్టటం కోసం ఓటర్లని ప్రలోభాలకి గురిచేయటం ఒక బీద దేశంలో అనివార్యమైంది. తెలుగు రాష్ట్రాల్లో, తమిళనాడులో, కర్ణాటకలో, కాలక్రమంగా మరిన్ని ఇతర రాష్ట్రాల్లో ఓట్లకు డబ్బులు పంచటం ఎన్నికల ప్రక్రియలో అంతర్భాగమైంది. బరిలో ఉన్న అన్ని ప్రధాన పార్టీలూ విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేస్తున్నాయి. డబ్బు పంచితే గెలుపు ఉంటుందన్న గ్యారంటీ లేదు కానీ, డబ్బు పంపకం లేకపోతే ఎన్నికల బరి నుండే నిష్క్రమించాల్సి ఉంటుంది. అంటే, డబ్బు పంపిణీ ఎన్నికల్లో పోటీ ఇవ్వటానికి కనీస అవసరంగా మారిపోయింది. దాంతో ఎన్నికల్లో డబ్బు విచ్చలవిడిగా ఖర్చు చేసి, ఎన్నికల్లో అధికారాన్ని దుర్వినియోగం చేసి అక్రమార్జన చేసేవారికే రాజకీయంలో అవకాశం దొరుకుతుంది. జనహితం కోసం చిత్తశుద్ధితో పనిచేయాలనే సంకల్పం ఉన్నా, అది అసాధ్యమనే పరిస్థితి నెలకొంది. ఎన్నికల్లో నెగ్గటానికి కావలసిన లక్షణాలు వేరు, ఎన్నికయ్యాక నిజాయతీ అయిన, సమర్థమైన పాలన అందించటానికి కావలసిన లక్షణాలు వేరు అనే పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వాలు ఎప్పుడైతే మంచిపాలన అందించలేకపోతున్నాయో ప్రజల్లో అసంతృప్తి జ్వాలలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల్ని మచ్చిక చేసుకుని ఓట్లు పొందటానికి రాజకీయ పార్టీలు అనుసరిస్తున్న మరో మార్గం ప్రజలిచ్చిన పన్నుల డబ్బుతో ప్రజలకు కావలసిన ఉమ్మడి సేవల్ని అందించకుండా, వ్యక్తులకి, కుటుంబాలకి తాత్కాలికమైన తాయిలాల్ని అందించటం. ఆ విధంగా ఓట్లు పొందటం మన ఎన్నికల రాజకీయంలో అంతర్భాగమైపోయింది. సమాజం ప్రభుత్వ వ్యవస్థని ఏర్పాటు చేసుకున్నది.. అందరికీ కావలసిన ఉమ్మడి అవసరాలను తీర్చటం కోసం. అలాకాకుండా వ్యక్తులకి తాత్కాలికంగా తృప్తినిచ్చే పథకాలను చేపట్టటం రాజకీయం పరమావధి కావటంతో, ఉచితంగా ఆహారం, విద్యుత్, మంచినీరు, నెలనెలా రకరకాల పథకాల పేరుతో బ్యాంకు అకౌంట్లలో డబ్బు జమ ఇలా వివిధ రూపాలలో ప్రజాధనమంతా జీతభత్యాలకి, తాత్కాలికమైన తాయిలాలకి మాత్రమే పరిమితమవుతోంది. ఏ సేవలు సమాజ మనుగడకి, బీదరికాన్ని తొలగించటానికి, ప్రతి బిడ్డ ఆత్మగౌరవంతో ఎదగటానికి అవసరమో, ఆ సేవల్ని చాలావరకు విస్మరించటం జరుగుతోంది. బీదరిక నిర్మూలన, నాగరిక సమాజ నిర్మాణం, ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశం, ఆర్థిక ప్రగతి కావాలంటే సమాజంలో చట్టబద్ధపాలన, మౌలిక సదుపాయాల కల్పన, మంచినీళ్లు, మురుగునీటి పారుదల, వరదనీటి పారుదల లాంటి జీవనావసరాల ఏర్పాటు, కుటుంబాలకు ఆర్థిక భారం లేకుండా ప్రతి బిడ్డ ప్రతిభనూ వెలికితీసే అత్యున్నత ప్రమాణాల విద్య, సొంత ఖర్చు అవసరం లేకుండా అత్యున్నత ప్రమాణాల ఆరోగ్యం ఇవన్నీ అత్యవసరం. మన రాజకీయంలో, పరిపాలనలో వీటన్నింటినీ చాలావరకు విస్మరించారు. ఎన్నికల్లో ఓట్లు పొందేందుకు తాత్కాలికమైన తాయిలాల్ని ఎరగా ప్రయోగించి ప్రజల్ని మభ్యపెట్టటం, బీదరికాన్ని శాశ్వతంగా కొనసాగించటం, బీదలంతా ఎల్లకాలం ప్రభుత్వాల మీద, పార్టీల మీద ఆధారపడేలా చేయటం ఇవన్నీ రాజకీయ వ్యూహాలలో అంతర్భాగమయ్యాయి. దాని ఫలితంగా బీదరికం ఇంకా కోట్లాది జీవితాల్ని పీడిస్తూనే ఉంది, ఆర్థిక ప్రగతి కుంటుపడింది, పుట్టిన పుట్టుక కోట్లాది బిడ్డల భవిష్యత్తును శాసిస్తున్నది. ఆధునిక అవకాశాలు బీదలకు కరువవటంతో, బీదరికం కొనసాగటంతోపాటు కుల వ్యవస్థ వల్ల జరిగిన నష్టం పిల్లలకు సరైన అవకాశాలు అందకపోవటంలో ఇంకా కొనసాగుతూనే ఉంది. ఓట్ల కొనుగోలు, తాయిలాలు చాలకపోతే వైవిధ్యభరితమైన భారతీయ సమాజంలో కులం, మతం, ప్రాంతం, వర్గం పేరుతో వైషమ్యాలని పెంచి విభజన సృష్టించి దాన్ని ఓటుబ్యాంకులుగా మార్చుకోవటం ఆనవాయితీ అయింది. ఈ విధంగా డబ్బుతో ఓట్ల కొనుగోలు, తాత్కాలిక తాయిలాలు, వైషమ్యాలను పెంచటం ఈ మూడూ మన ఎన్నికల రాజకీయాన్ని భ్రష్టు పట్టిస్తున్నాయి. సమాజానికి, రాజకీయాలకు తీరని హాని చేస్తున్నాయి.

**పేలవమయిన స్థానిక ప్రభుత్వాలు**

ఇక గత 50 ఏళ్లలో కన్పించే మరో ప్రస్ఫుటమైన అంశం అధికార కేంద్రీకరణ. స్వతంత్రం వచ్చాక తొలి ఇరవై ఏళ్లలో కొంతమేర స్థానిక ప్రభుత్వాల ఏర్పాటుకి, వాటిని బలోపేతం చేయటానికి ప్రయత్నాలు జరిగాయి. రాజ్యాంగబద్ధంగా తొలి నుంచీ మూడో అంచె ప్రభుత్వాల్ని ఏర్పాటు చేయకపోయినా, 1960ల దశకంలో చాలా రాష్ట్రాల్లో బలమైన స్థానిక ప్రభుత్వాలు ఏర్పడి, మంచి నాయకుల్ని ముందుకు తెచ్చాయి, ప్రజలకు మంచి సేవల్ని అందించాయి. కానీ గత 50 ఏళ్లలో స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేయటం జరిగింది. 1970ల నుంచి 1990ల దాకా– కేరళ, కర్ణాటక వంటి కొన్ని చోట్ల తాత్కాలిక మినహాయింపులు తప్ప, చాలా రాష్ట్రాల్లో స్థానిక ప్రభుత్వాల్ని నిర్వీర్యం చేయటం జరిగింది. అంతకు ముందు సమర్థంగా నడిచిన స్థానిక ప్రభుత్వాలను రద్దు చేయటం, ఎన్నికల్ని వాయిదా వేయటం, ఒకవేళ ఎన్నికలు జరిగినా ఏమాత్రం అధికారం, వనరులు లేకుండా చేయటం రెండు దశాబ్దాల పాటు జరిగింది. 1990ల దశకంలో రాజ్యాంగాన్ని సవరించి మూడో అంచె ప్రభుత్వాలకు రాజ్యాంగబద్ధమైన ఉనికి అందించే ఏర్పాటు జరిగింది. కానీ స్థానిక ప్రభుత్వాల నిర్మాణం గురించి అవసరాన్ని మించిన సవివరమైన ఏర్పాట్లని రాజ్యాంగం చేసిందిగానీ, ఆ ప్రభుత్వాల పాత్రని విస్పష్టంగా నిర్వచించటంలో, వాటికి వనరుల్ని, అధికారాన్ని కట్టబెట్టటంలో, ప్రజలకు జవాబుదారీచేయటంలో రాజ్యాంగ ప్రకరణాలు విఫలమయ్యాయి. దాంతో స్థానిక ప్రభుత్వాలు జీవచ్ఛవాల్లా మిగిలిపోయాయి. పేరుకి ఎన్నికలు జరిగినా, ఏమాత్రం వనరులు, అధికారాలు, బాధ్యతలు లేని ఉత్సవ విగ్రహాలుగా స్థానిక ప్రభుత్వాలు మిగిలిపోయాయి. ఈ అపరిమితమైన అధికార కేంద్రీకరణ, బలహీనమైన, నిరర్థకమైన మూడో అంచె ప్రభుత్వాలు మన ప్రజాస్వామ్యాన్ని మరింత బలహీన పరిచాయి. ఓటు అంటే ఏమిటో ప్రజలకు అర్థం కాని

పరిస్థితి. ఓటుకు, ఆ ఓటు వేశాక ఫలితానికి సంబంధించి తెలియకుండా, పెట్టే ఎన్నికలకు-అందే సేవలకు మధ్య పొంతన లేకుండా, అధికారం ఒకరి చెంతన, బాధ్యత మరొకరి చెంతన ఉంటే.. ప్రజాస్వామ్యం కేవలం ఓటు వేయటానికి, వ్యక్తి స్వేచ్ఛకి, నిరసన ప్రదర్శనలకి పరిమితమవుతుంది.

### బలపడ్డ ఫెడరల్ వ్యవస్థ

అయితే ఈ 50 ఏళ్లలో రాజకీయం ఎంత దిగజారినా, కొన్ని రంగాల్లో మన ప్రజాస్వామ్యం గణనీయంగా బలపడింది. తొలి 25 ఏళ్లలో కేవలం కొందరు భూస్వాములకు, మోతుబరి రైతులకి, సమాజంలోని అగ్రకుల పెద్దలకి మాత్రమే పరిమితమైన రాజకీయం క్రమంగా సమాజంలో అన్ని వర్గాల ప్రజలకీ విస్తరించింది. ఈ ప్రజాస్వామీకరణ జరగటంతో ఎన్నికైన ప్రతినిధులు విధిగా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండటం, ఎంతోకొంత సామాన్య ప్రజలకు ప్రభుత్వ పథకాలని అందించటం రాజకీయ మనుగడ కోసం అవసరమైంది. అలాగే రెండవ మంచి పరిణామం యూనియన్, రాష్ట్ర సంబంధాల వరకు మన ఫెడరల్ వ్యవస్థ బలపడింది. స్వతంత్రం వచ్చాక దాదాపు 40 ఏళ్లపాటు, రాష్ట్రాలు చాలా బలహీనంగా యూనియన్ ప్రభుత్వాల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడటం కొనసాగింది. సంకుచిత రాజకీయ కారణాలతో 100 పర్యాయాలుపైగా రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రభుత్వాలని రద్దు చేసి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రపతి పాలన విధించటం జరిగింది. ప్రతి చిన్న విషయానికీ రాష్ట్ర ప్రభుత్వాలకు రాజకీయంగా, ఆర్థికంగా అవరోధాలు కల్పించటం, జాప్యం చేయటం ఆనవాయితీ అయింది. అయితే 1990ల దశకం నుండి సమాఖ్య వ్యవస్థ బాగా బలపడింది. బొమ్మయ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పుతో 356వ అధికరణాన్ని ప్రయోగించి రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయటం దాదాపు అంతరించిపోయింది. 1991లో ఆర్థిక సంస్కరణల్ని చేపట్టి లైసెన్స్-పర్మిట్-కోటా రాజ్యాన్ని చాలావరకు అంతం చేయటంతో రాష్ట్రాలు సొంతంగా తమ ఆర్థిక ప్రగతికి బాటలు వేసుకునే అవకాశం కలిగింది. కాలక్రమేణా ఆర్థిక సంఘాలు హేతుబద్ధమైన ప్రతిపాదనతో, యూనియన్-రాష్ట్రాల మధ్య వనరుల విభజన చేపట్టటంతో అనునిత్యమూ యూనియన్ ప్రభుత్వాన్ని రాష్ట్రాలు అర్థించాల్సిన అవసరం లేకుండా పోయింది. ప్రజలకు ఆర్థిక స్వేచ్ఛ, పోటీ వ్యవస్థ రావటంతో పెట్టుబడుల కోసం యూనియన్ ప్రభుత్వం మీద ఆధారపడాల్సిన అవసరం లేకుండా, రాష్ట్రాలు తరచూ తమంతట తాము పెట్టుబడులను ఆకర్షించి ఆర్థికాభివృద్ధి కోసం పోటీపడుతున్నాయి. ఇలా వివిధ కారణాలుగా యూనియన్, రాష్ట్ర సంబంధాలు గతంతో పోలిస్తే మెరుగుపడ్డాయి. ఉదాహరణకు, సుదీర్ఘకాలం యూనియన్, రాష్ట్రాలు చర్చలు జరిపి పరోక్ష పన్నుల్ని దేశం మొత్తంలో ఏకం చేసి దేశం మొత్తాన్ని ఏకమార్కెట్‌గా చేయటం కోసం జి.ఎస్.టి (వస్తు, సేవల పన్ను) విజయవంతంగా ప్రవేశపెట్టాయి. ఇది బలవంతంగా కాకుండా, అన్ని రాష్ట్రాల సమ్మతితో, వారి పూర్తి ఆమోదంతో జరిగింది. పెరుగుతున్న సహకార సమాఖ్య స్ఫూర్తికి ఇదొక మంచి నిదర్శనం. ఇంకా సమాఖ్య వ్యవస్థలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలున్నాయి. కానీ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత కొత్తగా ఒక బలమైన, ఆరోగ్యకరమైన సమాఖ్య వ్యవస్థ నిర్మాణాన్ని విజయవంతంగా చేపట్టి, దాన్ని కొనసాగించిన ఏకైక దేశం భారత్. ఇన్ని భాషలు, సంప్రదాయాలు, వైవిధ్యాలు ఉన్న దేశంలో ఇలాంటి నిజమైన ఫెడరల్ వ్యవస్థ నిర్మాణం కావటం దేశ దీర్ఘకాల మనుగడకి, ప్రజాస్వామ్య వికాసానికి, ఆర్థిక భవిష్యత్తుకి దోహదకారి అవుతుంది.

### ఆర్థిక సంస్కరణలు

ఇక ఆర్థిక వ్యవస్థ. 1970ల దశకం నాటికే స్వతంత్రానంతరం మన దేశం అనుసరించిన ఆర్థిక నమూనా పరిమితులు, వైఫల్యాలు కొట్టొచ్చినట్లు కనిపించాయి. ఆర్థిక వ్యవస్థ మొత్తం ప్రభుత్వం గుప్పెట్లో పెట్టటం, ప్రజలకు ఆర్థిక స్వేచ్ఛ లేకుండా చేయటం, లైసెన్స్-పర్మిట్ విధానం స్థాపన, ప్రభుత్వ రంగ గుత్తాధిపత్యం ఇవన్నీ దేశంలో వస్తువుల, సేవల కొరతను పెంచాయి, బీదరికాన్ని కొనసాగించాయి, ఆర్థిక ప్రగతిని కుంటుపరిచాయి, దేశంలో అవినీతిని ప్రోత్సహించాయి, సమాజంలో ప్రతి సమూహాన్నీ దెబ్బతీశాయి, ప్రపంచంలో భారత్ ప్రతిష్ఠను దిగజార్చాయి. 1977లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జనతా ప్రభుత్వ విజయం ప్రజలకు కోల్పోయిన స్వేచ్ఛను తిరిగి ఇచ్చిందిగానీ, రాజకీయ, ఆర్థిక వ్యవస్థని మార్చలేదు. దాదాపు అదే కాలంలో 1978లో చైనాలో డెంగ్ జియావోపెంగ్ నాయకత్వంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టి, ఆర్థిక ప్రగతికి బాటలు వేశారు. ఆ అనుభవం నుండి కూడా భారత్ నేర్చుకోలేదు. ఆ తర్వాత 14 సంవత్సరాలకు తీవ్రమైన ఆర్థిక సంక్షోభం దేశాన్ని చుట్టుముట్టటంతో ఆపద్ధర్మంగా, అనివార్యంగా దేశం ఆర్థిక సంస్కరణల్ని చేపట్టవలసి వచ్చింది. ఓ వంక దేశంలో వస్తువుల, సేవల కొరతలు, దుబారా ఖర్చులు, అదుపులేని లోటు బడ్జెట్‌లు, మరోవంక విదేశీ మారక నిల్వలు అంతరించిపోవటం, నిత్యావసరాల దిగుమతి కూడా సాధ్యంకాకపోవటం ఇవన్నీ తీవ్ర సంక్షోభానికి దారితీశాయి. నాలుగు దశాబ్దాలకుపైగా చవిచూసిన రాజకీయ వైఫల్యం, విధానాల వైఫల్యం పర్యవసానంగా ఈ సంక్షోభం తలెత్తింది. 1991లో పరిమితంగానైనా చిత్తశుద్ధితో కొన్ని ఆర్థిక సంస్కరణల్ని చేపట్టారు. చేపట్టిన మేరకు విజయవంతంగా అమలు చేశారు. ఒక బీద దేశంలో, ప్రజాస్వామ్యంలో ఆర్థిక సంస్కరణల్ని చేపట్టటం చాలా కష్టతరం. ఆర్థిక క్రమశిక్షణను పాటించటం, పెట్టుబడుల్ని, పోటీని పెంచటం, అనుత్పాదక సబ్సిడీలను తగ్గించటం వీటివల్ల తాత్కాలికంగా కొంతమందికి నష్టం చేకూరుతుంది, కష్టం కలుగుతుంది. కానీ ఈ చర్యల్ని చేపట్టకపోతే దేశం నిరంతరం బీదరికంలో కూరుకుపోయి, ఆర్థిక ప్రగతి మందగిస్తుంది. ప్రస్తుతం శ్రీలంక ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని చూస్తే ఆర్థిక సంక్షోభం దేశాన్ని, సమాజాన్ని ఎలా అతలాకుతలం చేస్తుందో మనకు అర్థమవుతుంది. కానీ మన ప్రజాస్వామ్యంలో ఎన్ని లోపాలున్నా, 1991 నుంచి ఇప్పటి వరకు వివిధ పార్టీల ప్రభుత్వాలు పరిమితుల మేరకయినా ఆర్థిక సంస్కరణల్ని చిత్తశుద్ధితో

దీర్ఘకాలంలో అమలు చేయగలిగాయి. అందుకు కావలసిన సంకల్పం, ఆర్థిక క్రమశిక్షణ, విధానాల్ని సమర్థంగా అమలు చేయటం కోసం అవసరమైన నేర్పరితనం కొంతవరకైనా 1991 నుంచి ప్రభుత్వాలు, పాలనా యంత్రాంగం, ఆర్థికవేత్తలు, ఆర్థిక సంస్థలు ప్రదర్శించగలిగాయి. అందుకే 1990వ దశకం తర్వాత దేశ ఆర్థిక ప్రగతి సగటున గతం కంటే గణనీయంగా పెరిగి వస్తువులు, సేవల కొరతలు పోయి, అందరికి అందుబాటులోకి వచ్చాయి, నాణ్యత పెరిగింది. టెలికాం రగంలో మన దేశం చూసిన విప్లవం ఈ విధానాల అమలులో మన విజయానికి తిరుగులేని దృష్టాంతం. అలాగే జాతీయ రహదారుల నిర్మాణంగానీ, ఇతర మౌలిక సదుపాయాల కల్పనగానీ, పారిశ్రామికీకరణగానీ, కంప్యూటర్లు ఇంటర్‌నెట్ సేవల రంగాల్లోగానీ మన దేశంలో గణనీయమైన ఫలితాల్ని గత 30 ఏళ్ళుగా సాధించింది. ఇంకా ఎన్నో రంగాల్లో ఆర్థిక సంస్కరణల్ని చేపట్టాల్సిన అవసరం ఉంది. ముందుచూపుతో, సమర్థంగా, లాఘవంగా ఈ సంస్కరణల్ని చేపడితే ఒక తరం కాలంలో చైనా స్థాయిని చేరుకోవటం సాధ్యం. నాలుగు దశాబ్దాల క్రితం చైనాకి సమఉజ్జీగా ఉన్న భారత్ ఇప్పుడు చైనా ఆర్థిక వ్యవస్థలో కేవలం ఐదో వంతులో ఉంది. ఈ అంతరాన్ని అధిగమించి, మన సంపదను పెంచి, బీదరికాన్ని తొలగించి, అందరికీ అవకాశాల్ని కల్పించటం మన సమాజం ముందున్న ప్రథమ కర్తవ్యం. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకొని విజ్ఞతతో ముందడుగు వేస్తే, ఈ ఫలితాల్ని ఒక తరం కాలంలోనే సాధించటం సాధ్యం.

**చితికిపోయిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ**

అలాగే వ్యవసాయరంగంలో 1970ల దశకంలోనే దేశం కొన్ని గొప్ప విజయాల్ని సాధించింది. స్వాతంత్ర్యం వచ్చిన తొలి 20 ఏళ్లలో విదేశాల నుంచి ఆహారం అందకుండా, మన ప్రజల ఆకలిని కూడా తీర్చటం సాధ్యంకాని పరిస్థితి ఉంది. అయితే 70ల దశకంలో యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అంతర్జాతీయ సమాజం, మన రైతులు కలిసి చేపట్టిన సంఘటిత కృషి వల్ల స్వల్పకాలంలోనే హరిత విప్లవాన్ని సాధించి దేశంలో ఆహార కొరతని తీర్చగలిగాం. ఆహార రంగంలో స్వయంసమృద్ధి గత 45 ఏళ్లుగా దేశానికి ఒక బలమైన రక్షాకవచంగా నిలిచింది. అయితే కాలక్రమేణా వ్యవసాయరంగం పాత్ర ఆర్థిక వ్యవస్థలో తగ్గుతూ వస్తోంది. వ్యవసాయం మీద ఆధారపడ్డ వ్యక్తుల సంఖ్య మాత్రం పెరుగుతూ వస్తోంది. దాంతో గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వ్యవస్థ ఉన్నకొద్దీ చితికిపోతోంది. పరిశ్రమలు, సేవల రంగాలు ఆశించినంతగా పెరగకపోవటంతో కోట్లాదిమంది గ్రామీణులకి ఆ రంగాల్లో ఉపాధి కల్పించటం సాధ్యం కావటం లేదు. ఆ కారణంగా ఒక వంక సుదూరంగా ఉన్న నగరాలకి లక్షలాది మంది నిరుపేదలు వలసలు పోవటం, మరోవంక వారికి సరైన నైపుణ్యాలు, ఆర్థిక వ్యవస్థలో తగిన ఉపాధి అవకాశాలు లేకపోవటంతో నగరాల్లో దుర్భర దారిద్ర్యం తాండవిస్తున్నది. వస్తూత్పత్తి రంగంలో భారత్ ఇంకా వెనకబడే ఉంది. ఇటీవల అందివస్తున్న అవకాశాల్ని ఉపయోగించుకోవటం శరవేగంగా ఉత్పత్తి పెరగటానికి, దేశ ఆర్థిక ప్రగతికి, నిరుద్యోగ నిర్మూలనకు అవసరం.

**విద్య, ఆరోగ్య రంగాలలో తీవ్ర వైఫల్యం**

మరోవంక విద్య, ఆరోగ్యం నిర్లక్ష్యానికి గురై రెండు రంగాలూ అత్యంత దీనావస్థలో ఉన్నాయి.

గతంతో పోలిస్తే విద్య గణనీయంగా విస్తరించింది. ఇప్పుడు సమాజంలో అన్ని వర్గాల్లోనూ దాదాపు పుట్టిన ప్రతి బిడ్డకీ పాఠశాల విద్య అందుతోంది. 26 కోట్ల మంది పాఠశాల స్థాయిలోను, 3 కోట్ల 60 లక్షల మంది ఉన్నత విద్యారంగంలోనూ విద్యాభ్యాసం చేస్తున్నారు. విద్యారంగంలో వనరులు పుష్కలంగా ఖర్చు పెడుతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ప్రతి పాఠశాల విద్యార్థి మీద ప్రభుత్వాలు రూ.65,000 – 90,000 దాకా ఖర్చు పెడుతున్నాయి. కానీ విద్యాప్రమాణాలు గణనీయంగా పడిపోయాయి. అత్యధికులైన బాలలకి కనీస ప్రమాణాల విద్య అందటం లేదు. మొక్కుబడి చదువులే తప్ప నూటికి 80 మంది విద్యార్థుల ప్రతిభ వికసించటం లేదు. పాఠ్యాంశాలను వల్లెవేసి పరీక్షలు ఉత్తీర్ణులవటం తప్ప, విషయాలని కూలంకషంగా అర్థం చేసుకుని ఆ పరిజ్ఞానాన్ని నిత్యజీవితంలో వినియోగించే శక్తిసామర్థ్యాలు కొద్దిమందికి మాత్రమే పట్టుబడుతున్నాయి. ప్రతిభని అన్ని వర్గాల వారికీ ప్రకృతి సమానంగా పంచుతుంది. కానీ ఆ ప్రతిభ వికసించి ఆ వ్యక్తికి, సమాజానికీ ఉపయోగపడాలంటే సరైన విద్య అవసరం. మొక్కుబడి చదువుల వల్ల నిజమైన విద్య అత్యధికులకి అందక జాతి జన్యుసంపదలో నూటికి 80 పాళ్లు వృథా అవుతున్నది. కుటుంబానికి ఆర్థిక స్తోమత, తల్లిదండ్రులకు విద్యానైపుణ్యాలు, పట్టణాల్లో నివాసం ఉన్న సందర్భాల్లో ఆ కుటుంబాల పిల్లలకి మంచి విద్య అవకాశాలు దొరుకుతున్నాయి. మిగిలిన కుటుంబాల్లో విద్యకి, నైపుణ్యాలకి, ఆర్జన శక్తికి, అవగాహనకి ఏమాత్రం సంబంధం లేకుండా పోయింది. ఈ విద్యావ్యవస్థలోని ఘోరవైఫల్యం వల్ల తీవ్రమైన పరిణామాల్ని సమాజం ఇప్పటికే చవిచూస్తున్నది. కులవ్యవస్థ ద్వారా సంక్రమించిన పుట్టుకతో వచ్చిన అసమానతల్ని తొలగించాలంటే విద్య ఒక్కటే మార్గం. ప్రకృతి అన్ని వర్గాలకీ సమానంగా ప్రతిభాపాటవాల్ని పంచినా, బీదరికం కారణంగా, తల్లిందండ్రుల అవిద్య కారణంగా, కులవివక్షకు గురైన కుటుంబాల పిల్లలకి మంచి ప్రమాణాల విద్య అందకపోతే.. ఆధునిక ప్రపంచంలో తరతరాలుగా బీదల పిల్లలు బీదలుగా మిగిలిపోతారు. బిడ్డల ప్రతిభాపాటవాల్ని బట్టి, క్రమశిక్షణను బట్టి కాకుండా.. పుట్టుకను బట్టి అత్యధికుల భవిష్యత్తు నిర్ణయమవుతుంది. ఆ విధంగా కులం వల్ల వచ్చిన వెనుకబాటుతనం, బీదరికం నిరంతరం కొనసాగుతాయి. మరోవంక ఉత్తుత్తి చదువుల వల్ల ప్రతిభ వికసించకపోవటంతోపాటు, సమాజాన్ని గురించిన లోతైన అవగాహన, పౌరసత్వ భావన కొరవడతాయి. దాంతో మొక్కుబడి

చదువులు కాగితం మీద కనిపిస్తున్నా, వారి జీవితాల్లో ఆ విద్య ప్రభావం మచ్చుకైనా కానరాదు. కులమతాల పేరుతో సమాజంలో విభజనలు తేవటం సులభం. అలాగే పౌరసత్వ భావనలు లేక అటు రాజ్యాంగ విలువలకి, ఇటు నిజమైన ఆధునికీకరణకి సమాజంలో అత్యధిక వర్గాలు దూరమైపోతాయి. ఇవన్నీ ఒక ఎత్తు కాగా, ఉత్తుత్తి చదువుల వల్ల డిగ్రీ కాగితాలు చేతికందుతున్నాయిగానీ, సమాజంలో సంపద పెంచే శక్తి కొరవడటంతో ఉపాధికల్పన అసాధ్యమవుతున్నది. చదువుకున్నామన్న భావనతో, శారీరక శ్రమ లేకుండా, సమాజానికి ఏ వస్తువుల్ని, సేవల్ని అందించే సామర్థ్యం లేకుండా ప్రభుత్వమో, మరొకరో కూర్చోబెట్టి నెలజీతాలిస్తారన్న భ్రమలు పెరిగిపోతాయి. అది సమాజంలో రాజకీయ, పాలనా సంక్షోభానికి దారితీస్తుంది. అలాగే నిరర్థకమైన చదువులు, సంపద ఉత్పత్తికి కావలసిన నైపుణ్యాలు లేకపోవటం, పెరుగుతున్న ఆశలకి– అందుతున్న అవకాశాలకి విస్తరిస్తున్న అగాధం.. ఇవన్నీ పట్టణ యువతలో కొందరిని నేరప్రవృత్తికి, హింసామార్గానికి పురికొల్పుతాయి. విద్యావైఫల్యం వల్ల ఉత్పన్నమవుతున్న ఈ సమస్యను ఇప్పటికే మనం ఆధునిక భారతంలో ముఖ్యంగా పట్టణాలు, నగరాల్లో స్పష్టంగా గమనించవచ్చు. ఇటీవల ఎట్టకేలకు ఒక హేతుబద్ధమైన విద్యావిధానాన్ని రూపొందించారు. కానీ విద్యాప్రమాణాల్ని గణనీయంగా పెంచి, ఓ వంక పిల్లల మీద ఒత్తిడిలేకుండా, మరోవంక వివేచనా శక్తిని, సామర్థ్యాన్ని పెంచే విద్యను అందించటం మన పిల్లల భవిష్యత్తుకి అత్యంత కీలకం.

అలాగే ఆరోగ్య రంగంలో మన ప్రభుత్వాలు పెడుతున్న ఖర్చు ప్రపంచంలోనే అత్యల్పం. మనకు డాక్టర్లు, నర్సులు అవసరమైన సంఖ్యలో ఉన్నారు. ప్రపంచస్థాయిలో వైద్య నిపుణులు ఈ దేశంలో అందుబాటులో ఉన్నారు. ప్రపంచం మొత్తానికీ ఔషధాల్ని, టీకాల్ని మన దేశంలో ఉత్పత్తి చేసి పంపిణీ చేయగలుగుతున్నది. ఆధునిక వైద్య పరీక్షల్లో మనం ఎవరికీ తీసిపోం. కానీ ప్రభుత్వాలు ఉన్నత ప్రమాణాల ఆరోగ్య వ్యవస్థని ప్రాథమికం నుండి తృతీయ స్థాయి దాకా ప్రజల మీద ఆర్థిక భారం లేకుండా అందరికీ అందించటంలో విఫలమయ్యాయి. దీంతో దేశంలో ప్రతి ఏటా 5 కోట్ల 50 లక్షల మంది కేవలం అనారోగ్య కారణంగా కొత్తగా బీదరికంలోకి జారిపోతున్నారు. కోట్లాదిమంది ఉత్పాదకత తగ్గిపోయి ఆర్థిక కార్యకలాపాల్లో పాలుపంచుకోలేకపోతున్నారు. విద్యను, ఆరోగ్యాన్ని సమూలంగా ప్రక్షాళన చేసి అందరికీ ఉత్తమ ప్రమాణాల సేవల్ని కుటుంబాల మీద భారం లేకుండా అందించటం మన దేశ ఆర్థిక భవిష్యత్తుకి అత్యంత కీలక అవసరం.

**వచ్చే 25 సంవత్సరాలు కీలకం**

గత 75 ఏళ్లలో మన దేశం ఎన్నో గొప్ప విజయాల్ని సాధించింది. ప్రపంచంలో ఎక్కడా లేనన్ని బహుళ భాషలున్న సమాజాన్ని ఏకం చేసి, భాషా వైవిధ్యాన్ని ఏ విధంగా సామరస్యంతో సమన్వయం చేసుకోవాలో ప్రపంచానికే మార్గాన్ని చూపాం మనం. బీదరికం, అవిద్య తాండవిస్తున్న దేశంలో ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛని 75 ఏళ్లు కాపాడుకుని వర్తమాన ప్రపంచంలో ఆదర్శంగా నిలవగలిగాం. ప్రపంచంలో ఎక్కడా చూడనంత వైవిధ్యాన్ని మూటగట్టుకున్న మనం, ఎన్నో ప్రతికూల పరిస్థితుల్ని ఎదుర్కొని దేశ ఐక్యతని, స్వావలంబనని సాధించగలిగాం. ఆహార రంగంలో స్వయంసమృద్ధిని సాధించి, పదుల కోట్ల మంది ప్రాణాల్ని నిలబెట్టగలిగాం. జనాభా విస్ఫోటాన్ని అదుపుచేసి సమీప భవిష్యత్తులో జనాభా పెరుగుదలను అరికట్టే స్థాయిని చేరుకున్నాం. ఇవన్నీ సాధిస్తూనే కొరతలు ఎదురైనా ఆర్థిక ప్రగతి ఫలాల్ని కొంతవరకైనా సమాజానికి అందించగలిగాం, విస్తృత సేవలని ప్రజలకు అందించగలిగాం. జీవన ప్రమాణాలు క్రమంగానైనా మెరుగుపడుతున్నాయి. ఇంకా దుర్భర దారిద్ర్యం మనల్ని పీడిస్తున్నా, గతంతో పోలిస్తే బీదల జీవన స్థితిగతుల్ని మెరుగుపరచగలిగాం. దేశంలో గత 30 ఏళ్లలో వచ్చిన ఆర్థిక సంస్కరణలు, నిర్మించుకున్న బలమైన ఫెడరల్ వ్యవస్థ, పెరుగుతున్న సాంకేతిక విజ్ఞానాన్ని అందుకునే చొరవ, ప్రపంచంలో మెరుగుపడిన ఆర్థిక, విదేశీ సంబంధాలు ఇవన్నీ మన దేశ భవిష్యత్తుకి ఒక బలమైన పునాది వేశాయి. ఎక్కడ బలమైన పాఠాలు నేర్చుకున్నామో, ఎక్కడ పొరపాట్లు సరిదిద్దుకున్నామో, ఎక్కడ హేతుబద్ధ ఆలోచనతో, దీర్ఘకాల దృక్పథంతో పక్షపాతాల్ని, పార్టీల్ని పక్కనపెట్టి వ్యవహరించామో.. అక్కడ మంచి ఫలితాల్ని సాధించాం. ఇంకా ఎన్నో రంగాల్లో పొరపాట్లు దొర్లుతున్నాయి. మన పార్టీల నిర్మాణం, ఎన్నికల వ్యవస్థ, రాజకీయ సంస్కృతి దేశ ప్రజానీకానికి తీవ్రమైన నష్టం కలగచేస్తున్నాయి. ఇప్పటికీ ఆర్థిక రంగంలో కొనసాగుతున్న పిడివాదనలు, సాంప్రదాయ, ఛాందస ధోరణులు మన ఆర్థిక ప్రగతికి అవరోధంగా నిలుస్తున్నాయి. తాత్కాలిక రాజకీయ అవసరాల కోసం సమాజాన్ని ముక్కలుగా చేయటం వంటి ధోరణులు మన ఐక్యతను దెబ్బతీస్తున్నాయి. గతానుభవం నుండి పార్టీలు నేర్చుకుంటే, ప్రపంచంలో ఇతర దేశాల, సమాజాల చరిత్ర సారాన్ని ఆకళింపు చేసుకుంటే మన అవసరాలకనుగుణంగా పరిస్థితులు చక్కదిద్దుకునేటువంటి శక్తిసామర్థ్యాలు, నైపుణ్యం, వనరులు, సాంకేతిక సామర్థ్యం మనకు పుష్కలంగా ఉన్నాయి. ఆధునిక యుగంలో, ప్రపంచ చరిత్రలో తొలిసారిగా ప్రతి బిడ్డకీ పుట్టుకతో నిమిత్తం లేకుండా ఎదిగే అవకాశాల్ని ఇవ్వటం, ఆ బిడ్డలో నిబిడీకృతమైన శక్తిసామర్థ్యాల్ని వెలికితీయటం, నివారించదగ్గ క్లేశాల్ని ప్రతి మనిషి నుంచి దూరం చేయటం ఈనాటి ప్రపంచంలో సుసాధ్యం. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకుని రాజకీయ, ఆర్థిక వ్యవస్థల్లో కావలసిన మార్పుల్ని వేగంగా చేపడితే 2047 నాటికి స్వతంత్ర భారతావనికి వందేళ్లు నిండేనాటికి మన సమాజంలో ప్రతి కుటుంబం కలల్నీ సాకారం చేయగలం. ప్రపంచానికే ఆదర్శంగా, అగ్రస్థానంలో, వైవిధ్యభరితమైన, సామరస్యమైన, సుసంపన్నమైన, శాంతియుతమైన భారత్ నిర్మాణాన్ని సాధించే అవకాశం మనకుంది.

**(యువ భారతి సంస్థ ప్రచురించిన 'అమృత భారతి' నుండి)**

# వంకర బుద్ధి రాజకీయం..
# భారత్‌లో మానవాభివృద్ధికి ప్రధాన అవరోధం

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలోనే వలస పాలన నుంచి విముక్తి పొందిన దేశాలతో పోలిస్తే మనం ప్రజాస్వామ్యాన్ని, దేశ ఐక్యతను కాపాడుకోగలిగామనటంలో సందేహం లేదు. అయితే, మన దేశానికి ఉన్న ఇతర వనరులతో పోలిస్తే మానవ వనరులు ఎక్కువ. అసలు మనుషులు తమ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసుకున్న కృత్రిమ వ్యవస్థే రాజ్యం. దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని గాంధీజీ కాలం కంటే ముందే గొంతెత్తిన మహాకవి కూడా మన దేశంలోనే పుట్టారు. అయినా మనం ఆ మానవ వనరుల్ని అభివృద్ధి చేయటంలో నేరసమాన నిర్లక్ష్యంతో ఘోరంగా విఫలమయ్యాం. అందుకే 1947 తర్వాత స్వతంత్రం పొందిన చాలా దేశాలతో పోలిస్తే మనం మానవాభివృద్ధిలో వెనుకబడ్డాం. మనకు జనాభా ఎక్కువ కాబట్టి మన దేశంలో నాణ్యమైన చదువును పొందిన 1% మంది చాలా పెద్దసంఖ్యలో ఉన్నట్లు కనిపిస్తుంది. వారిలో విదేశాలకు వెళ్లి ఉన్నత స్థానాల్లో ఉన్నవారిని చూసి ఒక పరిధి దాటి మనం గర్వించలేం. మన దేశ జనాభాలో అత్యధికులకు ఇప్పటికీ సరైన భవిష్యత్తు లేదు. మరోపక్క, కేవలం సరైన ఆరోగ్య వ్యవస్థ లేకపోవటం వల్ల ఏటా దేశంలో ఐదున్నర కోట్ల మంది పేదలుగా మారుతున్నారు. వేల ఏళ్ల నాగరికత వల్ల మన సమాజానికి సమకూరిన అంతర్గత బలం, సంక్లిష్ట భిన్నత్వం గల సువిశాల దేశం కాకుంటే, మనం ఘనంగా చెప్పుకుంటున్న అరకొర ప్రజాస్వామ్యం కూడా మనగలిగేది కాదేమో. ఉద్యోగస్వామ్యం, పార్టీలస్వామ్యంతో ప్రజాస్వామ్యాన్ని ఎదగనీయకుండా చేస్తున్నవారు, కులం, మతం వంటి వాటిలో చిక్కుకుని యథాతథస్థితిని కొనసాగాలను కునేవారు మన వైఫల్యాలకు ఇంకా కుంటిసాకులు చెబుతూనే ఉన్నారు. మిగిలిన దేశాలు మన కంటే చాలా తక్కువ జనాభా కల చిన్న దేశాలు కాబట్టి అభివృద్ధిని సాధించాయని కొన్నాళ్లు బుకాయించారు. ఆ తర్వాత మనతో జనాభా సహా నాగరికత పరంగా కూడా పోల్చదగిన చైనా అభివృద్ధిని చూసాక కొంత వెనక్కితగ్గినా, కొత్త వాదనలు అందుకున్నారు. చైనాలోలా మన దేశంలో ఒకే భాష లేదని, మనకున్న అపార వైవిధ్యం వల్ల, ప్రజాస్వామ్యం వల్ల మనం చైనాలా వేగంగా ఎదగలేకపోతున్నామని బుకాయిస్తున్నారు. కానీ చైనా విజయాలకు మూలంగా ఉన్న విధానాలను అమలు చేయటానికి మనకు ఏ వైవిధ్యం, ఏ సంక్లిష్టత అడ్డం వచ్చింది? భారత రాజ్యాంగం కూడా వాటి అమలు కోసమే ఘోషిస్తోంది కదా! అలాగే చైనా వైఫల్యాలన్నీ ఆ దేశంలో ప్రజాస్వామ్యం



లేకపోవటం వల్ల వచ్చినవే. మనం ప్రపంచ అనుభవాల్లో విజయాలు, అపజయాలు రెంటి నుంచీ పాఠాలు నేర్చుకోకుండా మనల్ని మనం మోసం చేసుకుంటున్నాం, దేశాన్ని నష్టపరుస్తున్నాం. సమస్య మన వంకర బుద్ధిలో, పెత్తందారీ రాజకీయంలో ఉంది తప్ప.. ప్రజాస్వామ్యంలోనో, భిన్నత్వంలోనో లేదు. పైగా ఈ తరంలో ఉన్న అపార శాస్త్ర సాంకేతిక వనరులతో భిన్నత్వంలోని సంక్లిష్టతలు సహా అన్ని అవరోధాల్నీ అధిగమించి ఈ దేశంలోని ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాల్ని అందించవచ్చు, నివారించదగ్గ అన్ని బాధల్నీ తొలగించవచ్చు. కాబట్టి..ప్రజాస్వామ్యపీఠం(ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నట్లు, 75 ఏళ్లు చరిత్రలో స్వల్పకాలమే అయినా, ఆ స్వల్పకాలంలో కూడా మన కంటే ఎన్నో రెట్లు ఎదిగిన దేశాల నుండి భారత్ పాఠాలు నేర్చుకోవాలి. మానవాభివృద్ధి విషయంలో 189 దేశాల ర్యాంకుల జాబితాలో భారత్ 131వ స్థానంలో ఉండగా, భారత్ తర్వాత దాదాపు 18 సంవత్సరాలకు స్వతంత్రం పొందిన సింగపూర్ మానవాభివృద్ధి సూచీ (హెచ్‌డీఐ)లో 11వ ర్యాంకును సాధించింది. అందుకే ఈవేళ భారత్‌తో పోలిస్తే సెటిలవటానికి అత్యుత్తమ దేశంగా సింగపూర్‌ని అత్యధికులు కోరుకుంటున్నారు. రాజ్యం పాత్రను సక్రమంగా గుర్తించి నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, స్థానిక సాధికారత, అవినీతిరహిత పౌర సేవలు మొదలైన బాధ్యతల్ని ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వర్తించటం, మానవాభివృద్ధిని సాధించటం ఏడున్నర దశాబ్దాల ఆలస్యంగానైనా భారత్ చేయాల్సిన పని.

## 1947 నుంచి.. స్వాతంత్ర్యం పొందిన దేశాల మానవాభివృద్ధి సూచీ ర్యాంకులు

| దేశం | స్వాతంత్ర్యం పొందిన తేదీ | హెచ్‌డీఐ ర్యాంకు |
|---|---|---|
| సింగపూర్ | 09.08.1965 | 11 |
| ఇజ్రాయెల్ | 14.05.1948 | 19 |
| మాల్టా | 21.09.1964 | 28 |
| యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ | 02.12.1971 | 31 |
| సైప్రస్ | 16.08.1960 | 33 |
| బహ్రెయిన్ | 15.08.1971 | 42 |
| కతర్ | 03.09.1971 | 45 |
| బ్రూనై | 01.01.1984 | 47 |
| ఒమన్ | 20.12.1970 | 60 |
| మలేషియా | 31.08.1957 | 62 |
| కువైట | 19.06.1961 | 64 |
| మారిషస్ | 12.03.1968 | 66 |
| సీషెల్స్ | 29.06.1976 | 67 |
| శ్రీలంక | 04.02.1948 | 72 |
| గ్రెనడా | 07.02.1974 | 74 |
| డొమినికా | 03.11.1978 | 88 |
| ఫిజి | 10.10.1970 | 93 |
| మాల్దీవులు | 26.07.1965 | 95 |
| బోట్సావానా | 30.09.1966 | 100 |
| జమైకా | 06.08.1962 | 101 |
| టోంగా | 04.06.1970 | 104 |
| లిబియా | 24.12.1951 | 105 |
| గయానా | 26.05.1966 | 122 |
| భారత్ | 15.08.1947 | 131 |
| ఎస్వాటిని | 06.09.1968 | 138 |
| ఘనా | 06.03.1957 | 138 |
| కెన్యా | 12.12.1963 | 143 |
| జాంబియా | 24.10.1964 | 146 |
| మయన్మార్ | 04.01.1948 | 147 |
| జింబాబ్వే | 18.04.1980 | 150 |
| పాకిస్థాన్ | 14.08.1947 | 154 |
| ఉగాండా | 09.10.1962 | 159 |
| నైజీరియా | 01.10.1960 | 161 |
| సూడాన్ | 01.01.1956 | 170 |
| మలావి | 06.07.1964 | 174 |

# లోక్‌సత్తా గెలిస్తే ఓడిపోయేదెవరు

- ఎ. అన్నపూర్ణ




ప్రజాస్వామ్యం అంటే పుట్టుకతో నిమిత్తం లేకుండా అందరికీ సమానావకాశాలు. కానీ మన దేశంలో ఆ పరిస్థితి లేదు. ఓటు వేయటానికి, అర్థం లేని విమర్శలు చేయటానికి, అరవటానికి స్వేచ్ఛ ఉంది గానీ, ఎదగటానికి కావలసిన కీలక అవకాశాల్ని అందుకోవటానికి స్వేచ్ఛ లేదు. పుట్టిన పుట్టుక అత్యధిక భారతీయుల భవిష్యత్తును శాసిస్తోంది. దీనర్థం, మన ప్రజాస్వామ్యం అపరిపక్వంగా ఉంది, ఫలితంగా కోట్లాది మందికి ఎదిగే అవకాశాలు కరువవుతున్నాయి.

ప్రజాస్వామ్య పాలనలో ఫలితాల్ని ప్రజలకు అందించటంలో విఫలమవుతున్న పాలన, రాజకీయాలను ప్రక్షాళన చేసి, తారుమారైన పాత్రల్ని సరిచేసి ప్రజల్ని ప్రభువులుగా, పాలకులు అధికారులను సేవకులుగా చేసి జన రాజకీయ సామాజిక ఆర్థిక వ్యవస్థను నిర్మించటం కోసం పాతికేళ్ల క్రితం లోక్‌సత్తా ప్రారంభమయింది.

ఈ 25 సంవత్సరాల కాలంలో కొన్ని ప్రధాన మార్పుల్ని లోక్‌సత్తా సాధించినప్పటికీ, మిగతావారితో, చివరికి ప్రధాన రాజకీయ పార్టీలు, అత్యున్నత పదవులను అలంకరించినవారితో పోలిస్తే అవి ఎక్కువే అయినప్పటికీ.. తన మౌలిక లక్ష్య సాధనకు లోక్‌సత్తా చేయవలసింది ఇంకా చాలా ఉంది. ఈ క్రమంలోనే సమర్థవంతమైన, అవగాహనతో కూడిన ఆలోచనలు కలవారికి ఎప్పుడూ లోక్‌సత్తా వేదిక మీద ఆహ్వానం ఉంటుంది.

లోక్‌సత్తాలో నా ప్రస్థానం

ఉన్నత భావాలు, తెలివితేటలు, గొప్ప ఆశయాలు, అలుపెరగని లక్ష్యసాధన, నియమబద్ధ జీవితం, పరిణతి వ్యక్తిత్వం గల అరుదైన వ్యక్తి డాక్టర్ జయప్రకాష్ నారాయణ్. అవన్నీ లోక్‌సత్తా ఉద్యమ సంస్థలో ప్రతిబింబిస్తుంటాయి. అంతవరకూ ప్రజాసేవ పట్ల ఎలాంటి అవగాహన లేని నేను 1997లో విజయవాడ నుండి హైదరాబాద్ వచ్చి సెటిలయ్యాక, ఉద్యమ సంస్థ కార్యాలయం ఎక్కడుందో వెతికాను. మా ఫ్లాటుకి దగ్గర్లోనే ఉందని తెలుసుకుని ఉత్సాహంగా చేరిపోయాను.








మొదటిసారి ఆఫీసులో అడుగుపెట్టినప్పుడు అక్కడ ఉన్నవారు ఎవరో తెలియదు. అక్కడున్న బాధ్యురాలు ఎల్.వి ప్రసాద్ కంటి వైద్య సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వరరావు గారి సతీమణి ప్రతిభారావు గారితో మాట్లాడాను. తరువాత పరిచయం ప్రీతి కుండాలియా. లోక్‌సత్తా వ్యవస్థాపక









సంతల్లో, పొలాల్లో సంతకాల సేకరణ













సభ్యుల్లో ఒకరు.




మరికొద్ది కాలానికి రేడియో అక్కయ్యగా పిలుచుకునే తురగా జానకిరాణి, మరో రచయిత్రి బీనాదేవితో పరిచయం అయింది. అప్పటికే వారిద్దరూ 70 ఏళ్లు దాటినవారు కనుక అప్పుడప్పుడూ ఏదైనా మీటింగ్ ఉంటే వచ్చేవారు. తొలినాళ్లలో క్రమం తప్పకుండా వెళ్లే మహిళను నేను మాత్రమే.


జిల్లాల నుండి కొంతమంది మహిళలు వచ్చేవారు. తెలంగాణ జిల్లా నుండి వచ్చి హైదరాబాద్‌లో ఉంటున్న గీతామూర్తి శ్రద్ధగా కష్టపడి పూర్తికాలం పనిచేసేవారు (ప్రస్తుతం ఆమె బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు).

చదువుకున్నవారు, చదువులేనివారు, పేద, మధ్యతరగతి, ధనవంతులు అనే తేడా లేకుండా క్రమంగా అనేకమంది లోక్‌సత్తా కార్యకర్తలయ్యారు. మహిళలు సైతం సంస్థ పట్ల గౌరవంతో అన్ని జిల్లాల నుండి సమావేశాలకు వచ్చేవారు. అన్ని వర్గాలవారి ఆశయాల పందిరి 'లోక్‌సత్తా ఉద్యమ సంస్థ'. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు, విభజన జరిగిన తర్వాత కూడా.

జేపీ గారిది 'రాజకీయం పవిత్ర వ్యాసంగం, మార్పు కోసం అందరూ కలిసి పనిచేయాలి" అనే ఆలోచన. ప్రజలలో రాజకీయం, పాలన పట్ల, హక్కుల పట్ల చైతన్యం కలిగించి, అవగాహన పెంచుతూ వారికి ఉన్న ఎదిగే అవకాశాలు ఏమిటో తెలియచెప్పే ప్రయత్నం చేయటానికి ఎంతో కృషి చేశారు. ఐఏఎస్ అధికారిగా జేపీ ట్రాక్ రికార్డుతోపాటు లోక్‌సత్తా భావజాలంలోని బలం, బహిరంగ చర్చ ప్రమాణాలు, ప్రజల మధ్య కృషి వల్ల పార్టీలకతీతంగా కాంగ్రెస్, బీజేపీ నాయకులు, ప్రాంతీయ పార్టీల నేతలూ జేపీ సలహాలు సూచనలు స్వీకరించి గౌరవించేవారు.

జేపీ ప్రతి ప్రసంగంలో దేశ ప్రజాస్వామ్యంలోని లోపాల్ని, సంక్షోభాన్ని ఆచరణసాధ్య పరిష్కారాలతో ఎండగడుతూనే, ఉన్న వ్యవస్థలోనే నిజాయతీగా, మార్పు తేవాలనే ఆశతో, సమర్థంగా పనిచేసిన, చేస్తున్న రాజకీయ నేతలు, న్యాయమూర్తులు మొదలైనవారి గురించి చెబుతుండేవారు. ప్రజలకు ఏదోక మంచి చేసి పేరు తెచ్చుకోవాలని తపన పడే నేతలు అన్ని పార్టీల్లో ఉన్నారని, అయితే వారు ఒక విషవలయం లాంటి వ్యవస్థలో కూరుకుపోయిన బాధితులని చెబుతుండేవారు. జేపీ గారి అనుభవాలు, సానుకూల ఆలోచనలు మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకునేవి.

జేపీ గారు తనకు స్ఫూర్తినిచ్చిన ముగ్గురు హీరోల గురించి చెబుతుండేవారు. వాళ్లు డాక్టర్ రజనీకాంత్ అరోలీ, వర్గీస్ కురియన్, శరద్ జోషి.




డాక్టర్ అరోలీ.. మహారాష్ట్ర అహ్మద్‌నగర్ జిల్లాలోని జాంఖేడ్‌లో దశాబ్దాల క్రితమే తక్కువ ఖర్చుతో, స్థానిక వనరులతో, సులభంగా, అక్కడి ప్రజల భాగస్వామ్యంతో గొప్ప ఆరోగ్య ఫలితాల్ని సాధించి చూపారు.

వర్గీస్ కురియన్.. గుజరాత్ కేంద్రంగా సహకార రంగంలో పాడి రంగాన్ని అభివృద్ధి చేసి రైతులకు లాభాలనిస్తూ దేశంలో శ్వేత విప్లవాన్ని తీసుకొచ్చారు. సహకార సంస్థల స్వతంత్ర ప్రతిపత్తికి గ్యారంటీనిచ్చేలా లోక్‌సత్తా కృషి వల్లే వచ్చిన 97వ రాజ్యాంగ సవరణను కోట్లాది మంది రైతులు, ప్రజల తరపున వర్గీస్ కురియన్‌కు జేపీ అంకితమిచ్చారు.

శరద్ జోషి.. వ్యవసాయంలో విధానాలు దేశ ఆహార భద్రతతోపాటు రైతుకి ఆదాయం లక్ష్యంగా ఉండాలని స్వేచ్ఛా మార్కెట్ కోసం మహారాష్ట్ర నుండి పోరాడారు, షేత్కారీ సంఘటన్‌ని స్థాపించారు. దేశ ఆర్థిక వ్యవస్థను లైసెన్స్-పర్మిట్ రాజ్ నుండి విముక్తి చేయటం కోసం, మహిళలకు ఆస్తి హక్కు కోసం ఆయన దీర్ఘకాల కృషి చేశారు.

లోక్‌సత్తా ఉద్యమ సంస్థలో కార్యకర్తలుగా పనిచేసినవారిలో పలువురు ఉన్నత విద్యావంతులున్నారు, విదేశాల్లో వచ్చిన ఉద్యోగం వదులుకున్నవారున్నారు. ఉన్నత స్థానాల్లో పనిచేసిన అనుభవమున్న విశ్రాంత ఉద్యోగులున్నారు. జేపీని అనుసరించిన యువతలో వివిధ రాష్ట్రాల్లో, విదేశాల్లోనూ పనిచేస్తున్నవారున్నారు. జేపీతో ఏమాత్రం పరిచయం లేకున్నా, లోక్‌సత్తా భావజాలం పట్ల ఆకర్షితులై అభిమానులుగా మారినవారు, అందుకోసం పనిచేస్తున్నవారు అనేకమంది.

అందరూ పుట్టిన ఊరిలో ఉండరు. చదువు, ఉద్యోగం, వివాహం రీత్యా అనేక ప్రాంతాలకు వెళుతూ ఉంటారు. అన్ని చోట్ల బంధువులు, స్నేహితులు ఉంటారు. ఈ సంస్థ అందరినీ కలిపింది. ఆ స్నేహబంధాన్ని ఇప్పటికీ చెదిరిపోనీక పటిష్ఠంగా ఉంచింది.

లోక్‌సత్తా ఉద్యమ సంస్థని లేదా పార్టీని నడిపించింది కేవలం పౌరులు ఇచ్చిన విరాళాలతోనే. నా చేతులతో కలెక్ట్ చేసినవి చెక్కులు మాత్రమే. అలాగే రసీదు లేకుండా డబ్బు తీసుకున్న దాఖలా లేదు. ఎక్కడ్నుంచి డబ్బు వచ్చిందో, ఆ నియోజకవర్గంలోనే ఖర్చు చేయాలని నాయకత్వం సూచించేది.

2022, ఆగస్టు 3న 25వ వార్షికోత్సవాన్ని జరుపుకున్న లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మరెన్నో విజయాల్ని సాధించాలని మనసారా కోరుకుంటూ శుభాకాంక్షలు. లోక్‌సత్తా గెలిస్తే ఓడిపోయేదెవరు?

# అప్పట్లో ఇంటర్‌నెట్ కూడా లేదు..

## ఇప్పుడు సోషల్ మీడియానూ సరిగా వినియోగించుకోలేకపోతున్నాం

ఇంటర్‌నెట్ మనకు అందుబాటులో లేని కాలంలోనే జేపీ లోక్‌సత్తా భావజాలాన్ని తయారుచేశారు. లోక్‌సత్తాను ప్రారంభించటానికి ఎన్నో ఏళ్ల ముందు ఆయన చేసిన ప్రసంగాలను వింటే ఈ విషయం స్పష్టమవుతుంది. లోక్‌సత్తాని ప్రారంభించాక కూడా నెట్ సౌకర్యం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచవ్యాప్త పరిజ్ఞానాన్ని సేకరించటం ఎంత ప్రయాస అవుతుందో ఈవేళ్టి గూగుల్ సెర్చ్ తరం ఊహించటం కూడా కష్టం. ఒక్కో అంశంపై స్పష్టత కోసం ఏదైనా పుస్తకాన్ని తెప్పించుకోవాలంటే, నెలల తరబడి సమయం పట్టిన సందర్భాలున్నాయి. అలాంటి అవస్థ నుండి మనను తప్పించటంతోపాటు, చిటికెలో అభిప్రాయాల్ని ప్రపంచవ్యాప్తంగా తెలియచెప్పే అవకాశాన్ని ప్రముఖులతో సమానంగా మనలో ప్రతి ఒక్కరికీ అందించిన సోషల్ మీడియాను కూడా సాంకేతికత మనకు అందుబాటులోకి తెచ్చింది. ప్రపంచ చరిత్రలో ఇంత గొప్ప సాంకేతిక వనరుల్ని పొందిన కాలం మునుపెన్నడూ లేదు. కానీ మనలో ఎక్కువమందిమి ఏం చేస్తున్నాం? విచక్షణ లేకుండా ఆ సదుపాయాల్ని దుర్వినియోగం చేస్తున్నాం. సత్యమేదో, అసత్యమేదో, అర్ధసత్యమేదో తెలియకుండా, సారమేంటో, సందర్భమేంటో పరిశీలించకుండా ఇన్‌స్టంట్ కామెంట్లు పెడుతున్నాం. ముఖ్యంగా సమాజంలోని అంశాల పట్ల విచక్షణతో స్పందించటం తక్కువగా ఉంటోంది. అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఈ సమస్య ఉందిగానీ, మనలాగా నాణ్యమైన విద్యలేని, సువిశాల సంక్లిష్ట భిన్నత్వమున్న, పేద దేశంలో ఇది ఎక్కువ నష్టం చేస్తుంది. సమాజం కోసం ఎంతో లోతైన కృషిని కూడా ఉపయోగించుకోలేని అసంబద్ధమైన స్పందనల వల్ల వ్యక్తిగతంగానూ మనకు ఒరిగేదేమీ ఉండదు. కాబట్టి హేతుబద్ధంగా, పరిజ్ఞానంతో, బహిరంగ చర్చ ప్రమాణాలతో స్పందించేవారినే అనుసరిద్దాం.. మన ఆలోచనలు, విమర్శల్ని కూడా సహేతుకంగా, అర్ధవంతంగానే తెలియచేద్దాం. అప్పుడే ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన ఫలితాల్ని మన వ్యక్తిగత అభివృద్ధికి, సమాజహితానికీ ఉపయోగించుకోగలం.

# రైతు పక్షపాతం చాలదు..

## మేధస్సును జోడిస్తేనే వారి ఆదాయాలు పెరుగుతాయి




ఆత్మవిశ్వాసం, ఆశావాద దృక్పథంతో ముందుకెళ్తేనే గ్రామీణాభివృద్ధి దిశగా నిర్దేశిత లక్ష్యాలను సాధించగలుగుతామని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. దేశంలోని కొన్ని రంగాలు ఉత్పత్తి లక్ష్యాలను సాధించినప్పటికీ, చాలా రంగాలు వెనుకబడే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన 'అన్నదాత' వ్యవసాయ మాసపత్రిక పూర్వ సంపాదకుడు డాక్టర్ వాసిరెడ్డి నారాయణరావు సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ, దేశాభివృద్ధికి కీలకమైన వ్యవసాయం, పశుపోషణ, గ్రామీణాభివృద్ధి కోసం నారాయణరావు పడిన తపన, చేసిన కృషి ఎంతో ఉందన్నారు. రైతు పక్షపాతం అందరి మనసులో ఉందని, ఆ మనసును మేధస్సుతో సంధానించకపోతే వారి ఆదాయాలు పెరగవన్నారు. ఈ సందర్భంగా 'వ్యవసాయ రుషి వాసిరెడ్డి నారాయణరావు' పేరిట ప్రచురించిన స్మృతి సంచికను జేపీ, 'ఈనాడు' సంపాదకుడు ఎం. నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. సభకు కథా సాహితీ సంపాదకుడు వాసిరెడ్డి నవీన్ అధ్యక్షత వహించగా, నారాయణరావు సతీమణి, మహిళా విజయం మాసపత్రిక ఎడిటర్ కాశీరత్నం, కుమార్తెలు పుతుంబాక ఇంద్రాణి, పెనుమత్స మైత్రేయి, పడాల పద్మ, సన్నిహిత మిత్రుడు డాక్టర్ దొడ్డపనేని ప్రసాద్, అభ్యుదయ రైతు సుఖవాసి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

---



## ప్రభుత్వ రాయితీకన్నా సిలిండర్ బట్వాడా మామూలే ఎక్కువగా ఉంది

గ్యాస్ సిలిండర్‌ను బట్వాడా చేసే సమయంలో రసీదుపై ముద్రించిన దానికంటే రూ.50 అదనంగా అడుతున్నారని, ఎందుకివ్వాలి అంటే దురుసుగా మాట్లాడుతున్నారని, ఈ సమస్యపై చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా నేతలు సూర్యలక్ష్మి, వంశీ ప్రసాద్, వైబీఐ నేత వై.శివరామకృష్ణ హైదరాబాద్‌లోని పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో జాయింట్ కమిషనర్‌కి ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. కొంతమంది గ్యాస్ ఏజెన్సీ వారయితే, డెలివరీ బాయ్స్‌కి జీతాలు ఉండవు, మీ దగ్గర సిలిండర్ బట్వాడా చేయటానికి రోడ్లు బాగుండవు, తోచినంత ఇవ్వండని సమర్థిస్తున్నారన్నారు. గృహావసరాల సిలిండర్‌కి ప్రభుత్వం ఇస్తున్న రాయితీ కన్నా డెలివరీ బాయ్స్‌కి ఇస్తున్న మామూలే ఎక్కువగా ఉందని, తక్కువలో తక్కువగా రూ.20 అయినా ఇవ్వాల్సి వస్తోందన్నారు.

## రూ.1.65 లక్షల కోట్ల పంచుడు ద్వారా ఎంతమందిని పేదరికం నుండి బయటపడేశారు?

సంక్షేమం ముసుగులో ప్రభుత్వం ఆర్భాటం చేయటం తప్ప పాలన చేయటం లేదని ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ ఫోరం అధ్యక్షుడు నేతి మహేశ్వరరావు విమర్శించారు. సంక్షేమానికి రూ.1.65 లక్షల కోట్లు వెచ్చించామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. 1.2 కోట్ల తెల్లకార్డులున్న వారిలో ఎంతమందిని పేదరికం నుండి బయటపడేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని విజయవాడలో అన్నారు. రూ.1.65 లక్షల కోట్లు సంక్షేమం పేరుతో వెచ్చిస్తే.. తెల్లకార్డులున్న ప్రతి ఒక్కరికీ ఏడాదికి రూ.లక్ష వరకు రావాలని, కానీ అన్నీ కలిసినా ఒక్కొక్కరికీ రూ.30 వేలు కూడా ఉండటం లేదన్నారు. అంటే సంక్షేమం అర్హత ఉన్న పేదలకు చేస్తున్నారా.. ఓట్లు సీట్ల కోసం ప్రతి ఒక్కరికీ పంచుతున్నారా.. అనేది బయటపెట్టాలని మహేశ్వరరావు డిమాం డ్ చేశారు. ఈ స్థాయిలో సంక్షేమం అమలు జరిగితే.. ప్రజల కొనుగోలు శక్తి పెరగాలిగానీ తగ్గటం ఏమిటని ప్రశ్నించారు. ఒకవైపు సంక్షేమం అంటూ ఇచ్చి.. మరోవైపు మద్యం ద్వారా ప్రభుత్వం ఆదాయం పెంచుకోవటం దేనికి సంకేతమన్నారు. ఆర్థిక లోటులో ఉన్న రాష్ట్రంలో పేదలను స్వయంసమృద్ధి వైపు తీసుకెళ్లే పథకాలకు ప్రాధాన్యం ఇవ్వాలే కానీ తాత్కాలిక పథకాలతో ఏం ప్రయోజనమన్నారు. ప్రభుత్వం చేస్తున్న నగదు బదిలీ తీరు అభివృద్ధి కన్నా సామాజిక అసమానతలు పెంచేలా ఉందన్నారు. ఫోరం కార్యదర్శి బొప్పన రాజశేఖరరావు, సభ్యుడు పి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# 2025-26కైనా ప్రమాణాలు మెరుగయ్యేనా

సిలబస్ పూర్తిపై, మధ్యాహ్న భోజనం అమలుపై తప్ప, విద్యార్థులు వారి తరగతికి తగ్గ అంశాలు నేర్చుకుంటున్నారా అనే సమీక్ష లేకపోవటంతో మన దేశంలో పాఠశాల విద్యాప్రమాణాలు అధ్వాన్నంగా కొనసాగుతున్నాయి. ఇందులో కూడా తెలంగాణలో పరిస్థితి మరీ నాసిరకంగా ఉందని 2021 నవంబర్‌లో నిర్వహించిన జాతీయ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్)లో సైతం వెల్లడైంది. 3,5,8,10 తరగతుల విద్యార్థులపై రెండేళ్లకోసారి నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహిస్తున్నారు. తాజా సర్వేలో తెలంగాణలో 3,5 తరగతుల్లో కనీసం 50% ప్రశ్నలకు 56-68 శాతం మంది విద్యార్థులే సరైన జవాబులు రాశారు. ఎనిమిదో తరగతిలో.. గణితంలో 37 శాతం మంది, భాషలో 53 శాతం మందే కనీసం 50% ప్రశ్నలకు సరైన జవాబులు రాశారు. ఈ నేపథ్యంలో దిద్దుబాటు చర్యల్లో భాగంగా కొన్ని లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ ఇటీవల తెలిపింది. కనీసం 50 శాతం, ఆపై ప్రశ్నలకు విద్యార్థులందరూ సరైన సమాధానాలు రాసేలా తీర్చిదిద్దుతామని యూనియన్ ప్రభుత్వానికి హామీ ఇచ్చింది. మొత్తం 28 అంశాలపై వచ్చే నాలుగు సంవత్సరాల్లో ఎలాంటి పురోగతి సాధిస్తామో వివరిస్తూ ఇటీవల పాఠశాల విద్యాశాఖ యూనియన్‌కి నివేదిక సమర్పించింది. 3,5 తరగతుల్లో 2025-26 నాటికి భాష, గణితంలో 100 శాతం విద్యార్థులు కనీసం 50% ప్రశ్నలకు సరైన జవాబులు రాసేలా తీర్చిదిద్దుతామని, ఎనిమిదో తరగతిలో ఈ శాతాన్ని 85కు పెంచుతామని తెలిపింది.

**50%, ఆపై ప్రశ్నలకు సరైన జవాబులు ఇచ్చినవారు.. 2022-23 నుంచి పెంపు లక్ష్యాలు (శాతాల్లో)**

| విషయం | ప్రస్తుతం | 2022-23 | 23-24 | 24-25 | 25-26 |
|---|---|---|---|---|---|
| 3వ తరగతి భాష | 68 | 80 | 85 | 90 | 100 |
| గణితం | 69 | 79 | 85 | 90 | 100 |
| 5వ తరగతి భాష | 57 | 75 | 80 | 90 | 100 |
| గణితం | 56 | 75 | 80 | 90 | 100 |
| 8వ తరగతి భాష | 53 | 70 | 75 | 80 | 85 |
| గణితం | 37 | 70 | 75 | 80 | 85 |

## 1 నుంచి 5 తరగతి వరకు 'తొలిమెట్టు'

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేతోపాటు రాష్ట్ర పరిధిలోని ఎస్‌సీఈఆర్‌టీ అధ్యయనం కూడా పాఠశాల విద్యాప్రమాణాల అధ్వాన్న స్థితిని విస్పష్టంగా వెల్లడించటంతో 1 నుంచి 5 తరగతుల విద్యార్థుల్లో ప్రమాణాలు పెంచేందుకు, అభ్యసన మెలకువలు అభివృద్ధి చేసేందుకు 'తొలిమెట్టు' కార్యక్రమానికి తెలంగాణ విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయిలో రిసోర్స్ పర్సన్స్‌కి శిక్షణ ఇచ్చారు. వారి ద్వారా జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. తొలిమెట్టు కోసం ప్రత్యేక మాడ్యూళ్లు తయారుచేశారు. ఏదో సిలబస్ పూర్తి చేశామనిపించుకోవటం కాకుండా, అర్థవంతమైన బోధన చేయాలన్నది ఈ కార్యక్రమ ప్రధానోద్దేశమని ప్రభుత్వం తెలిపింది. 'విద్యార్థిపై రోజూ అదనంగా ఓ గంట ప్రత్యేక దృష్టి పెడతారు. ముందుగా అతను ఏ స్థాయిలో ఉన్నాడనేది క్లాస్ టీచర్ అంచనా వేస్తారు. దానికి అనుగుణంగా బోధన ప్రణాళికను సిద్ధం చేస్తారు. ఉదాహరణకు విద్యార్థి ఓ గేయాన్ని చూసి రాయగలడు. కానీ చదవలేడు. కాబట్టి అతను ప్రతిరోజూ చదివేలా చేస్తారు. గణితంలో కూడికలు, తీసివేతలు అర్థమయ్యేలా ప్రత్యేక పద్ధతుల ద్వారా పునశ్చరణ చేస్తారు. దీనికోసం ఎస్‌సీఈఆర్‌టీ సరికొత్త బోధనా పద్ధతులను రూపొందించింది. పాఠాలు ఎంతమందికి అర్థమయ్యాయనేది పరిశీలిస్తారు. కనీసం 80 శాతం మందికి అర్థమవకుంటే, పాఠాన్ని అదనంగా తీసుకునే క్లాసులో మరోసారి బోధిస్తారు. చదవటం, రాయటం, పాఠంలో నుంచి కొత్త ఆలోచన రేకెత్తించటం వంటి సరికొత్త పద్ధతులు అనుసరిస్తారు. వీటికి సంబంధించి ప్రతి వారం ప్రతి విద్యార్థి ప్రమాణాలను అంచనా వేసి, నివేదికలు రూపొందించాల్సి ఉంటుంది. వీటిని ప్రతినెలా రాష్ట్రంలోని ఉన్నతాధికారులు పరిశీలిస్తారు' అని తొలిమెట్టు శిక్షకులు తెలిపారు. కాగా, ఆగస్టు 15 నుంచి తొలిమెట్టును ప్రారంభిస్తారని ప్రకటించినా ఇప్పటివరకు సంబంధిత ప్రగతిపై సరైన సమాచారం లేదు.

# లోక్‌సత్తా భావజాలాన్ని యువత మరింతగా అందిపుచ్చుకోవాలి



భారతదేశం ఎంతోకొంత అభివృద్ధిని తప్ప తన సామర్థ్యానికనుగుణంగా ఎదగలేకపోతోందని, ముఖ్యంగా మానవ వనరుల అభివృద్ధిలో ఘోరంగా విఫలమైందని, ఈ నేపథ్యంలోనే డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పాతికేళ్ల కిందట లోక్‌సత్తా ఉద్యమాన్ని ప్రారంభించి రాజకీయ, పాలనా, ఆర్థిక సంస్కరణల కోసం పోరాటం ప్రారంభించారని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. రాజకీయాలకి కొత్త భాషని, నూతన ప్రమాణాల్ని జేపీ తీసుకొచ్చారని, రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన రీతిలో కొత్తరీతిలో ఉద్యమాల్ని నడిపి దేశ చరిత్రలోనే కొత్త అధ్యాయానికి నాంది పలికారని అన్నారు. రాజకీయం లక్ష్యం, మార్గం రెండూ ప్రజలే ఉండాలని 'ప్రజలే ప్రభువులు-పాలకులు సేవకులే' అని నినాదమిచ్చారన్నారు. స్వతంత్ర భారతంలో పరాధీనులుగా జీవిస్తున్న కోట్లాదిమందిని మేలుకొలుపుతూ 'లోక్‌సత్తా' అని ఉద్యమ సంస్థకి నామకరణం చేశారన్నారు. లోక్‌సత్తాను ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విజయనగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన లోక్‌సత్తా విజయాలను విడుదల చేశారు. దేశానికి స్వతంత్రం వచ్చిన తొలినాళ్లలో కొన్ని రాజ్యాంగ సంస్థల్ని ఏర్పాటు చేయటం, ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు వేస్తుండటం తప్ప ప్రజాస్వామ్యాన్ని విస్తరించేందుకు దేశంలో ఏ పార్టీ, ఏ ప్రభుత్వమూ ప్రయత్నించలేదని, ఫలితంగానే మన సమాజంలో ప్రజాస్వామ్య భావన ఇంకా ఇంకలేదని, ఏటికి ఎదురీదుతూ లోక్‌సత్తా చేసిన కృషి వల్ల కొన్ని విజయాలు లభించటంతోపాటు అనేక ఆలోచనలు దేశమంతా వ్యాప్తి చెందాయన్నారు. ఈ మార్పుల్ని వేగవంతం చేయటం కోసం లోక్‌సత్తా వివిధ మార్గాల్లో నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలు లభించటం, నివారించదగ్గ బాధల్ని తొలగించటం లోక్‌సత్తా మౌలిక లక్ష్యమన్నారు. జేబుఖర్చు లేకుండా ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించేందుకు లోక్‌సత్తా రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానం అమలుకు కృషి చేస్తున్నామని, అలాగే నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు డిజి కంటెంట్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని తెలిపారు. దేశంలో పలు అనర్థాలకు కారణమవుతున్న కేంద్రీకృత పాలనకు వ్యతిరేకంగా ఫెడరలిజాన్ని మూడో అంచెకు తీసుకెళ్లి స్థానిక ప్రభుత్వాలకు సాధికారత అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వ్యవసాయం, చట్టబద్ధపాలన, పౌర సేవలు తదితర రంగాల్లో లోక్‌సత్తా చేస్తున్న ప్రయత్నాలను ఈ సందర్భంగా బాబ్జీ వివరించారు. లోక్‌సత్తా భావజాలాన్ని యువత మరింతగా అందిపుచ్చుకుని నాయకులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నేతలు అల్లంశెట్టి నాగభూషణం, తాత్రాజు రాజారావు, పి.ఎల్.ఎన్ రాజు, బోర రమేష్, ఇప్పలవలస గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## రహదారుల విస్తరణకు సంతకాల సేకరణ

పత్తికొండలో రహదారుల విస్తరణను వెంటనే చేపట్టాలని లోక్‌సత్తా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ఆనందాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు నాలుగు స్తంభాల కూడలి వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. పత్తికొండలోని ప్రధాన రహదారులను వెడల్పు చేయాలని అనేక పార్టీలు, ప్రజాసంఘాలు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని వెంటనే ఇందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నేతలు జయరాముడు, ప్రసాద్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం ప్రాజెక్టుపై అఖిలపక్షంతో చర్చించండి

జాతీయ ప్రాధాన్యత గల పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయటంలో రాజకీయ అసమర్థత వల్ల ప్రజాధనం వృధా కావటంతోపాటు ప్రజలు ఇక్కట్ల పాలవుతున్నారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరమణబాబు అన్నారు. ప్రాజెక్టును పూర్తి చేయటం కేంద్ర ప్రభుత్వ విధి అని, అవసరమైన నిధుల్ని సమీక రించటం సకా లంలో చేయటం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతని అన్నారు. ప్రాజెక్టుపై నిర్లక్ష్యం వల్ల ఈ ఏడాది గోదావరి వరదల వల్ల దాదాపు 70 వేల మంది నిర్వాసితులు కట్టుబట్టలతో పునరావాస కేంద్రాల్లో ఉండాల్సి రావటం విచారకరమన్నారు. ప్రాజెక్టుపై శ్వేతపత్రం ప్రకటించి అఖిలపక్షంతో చర్చించి వెంటనే రోడ్‌మ్యాప్‌ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జూలై సంచిక తరువాయి

# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం**

## జులై 2021

(తెలుగులో స్థూల అనువాదం)

(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)



### 5.2. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఆరోగ్యశ్రీ కార్యక్రమం

రాష్ట్రంలోని పేదలందరికీ రూ.2,00,000 వరకు ఆర్థిక కవరేజి ఇచ్చేలా ఆరోగ్యశ్రీ ఆరోగ్య బీమా కార్యక్రమం 2007లో ప్రారంభమైంది. కార్యక్రమ ప్రారంభ బడ్జెట్ 2007-08లో సుమారు రూ.160 కోట్లు. అక్కడి నుండి పెరుగుతూ 2011-12 నాటికి రూ.1800 కోట్లను దాటింది. చికిత్సల కవరేజీ తొలుత ఆరు స్పెషాలిటీలలో 163 గుర్తించిన ప్రక్రియలకు ఉండగా, ఆ తర్వాత 31 స్పెషాలిటీలలో 942 ప్రక్రియలకు విస్తరించింది. రాష్ట్ర విభజన నాటి నుండి, రెండు తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆ పథకం అమలును కొనసాగించాయి. వర్తింపును క్రమంగా పెంచాయి. తెలంగాణ ప్రభుత్వం చికిత్స వ్యయం మీద పరిమితిని తొలగించి ఆర్థిక కవరేజీని రూ.2 లక్షల నుండి విస్తరించింది. కొన్ని అత్యాధునిక చికిత్సలకు కవరేజీ రూ.10 లక్షల వరకూ కూడా ఉంటుంది. తెలంగాణలో ఏటా రెండు మూడు లక్షల మంది రోగులు చికిత్స పొందుతుంటారు. 2020-21లో సుమారు రూ.577 కోట్లతో దాదాపు 2.5 లక్షల చికిత్సలను నిర్వహించారు. ఇందులో 1,63,799 ప్రయివేటు ఆస్పత్రుల్లో జరగగా, 83,113 రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగాయి.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి, విభజన తర్వాత ప్రభుత్వం ఆర్థిక కవరేజీని ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.2.00 లక్షల నుండి 2.50 లక్షలకు పెంచింది. మరో వంద వైద్య ప్రక్రియలను జోడించింది. 2019లో ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ వర్తింపును కుటుంబానికి ఏటా రూ.5 లక్షలకు పెంచారు. రాష్ట్ర కార్యక్రమాన్ని జాతీయ కార్యక్రమం ఆయుష్మాన్ భారత్ - పి.ఎం.జె.ఎ.వైతో సంధానం చేశారు. దీంతోపాటు, 2019 నుండి ఆరోగ్యశ్రీ కవరేజీని వార్షికాదాయం రూ.5 లక్షల లోపు ఉన్న అన్ని కుటుంబాలకూ వర్తింపచేశారు. దీనివల్ల నెలకు రూ.40,000 ఆదాయం ఉన్న మధ్యతరగతి కుటుంబాలను కూడా, వైద్య ఖర్చు రూ.1,000 దాటిన అన్ని కేసుల్లో మెరుగైనరీతిలో కవర్ చేయగలిగారు. అటువంటి కొత్త వైద్య ప్రక్రియలు వెయ్యింటిని గుర్తించి పశ్చిమ గోదావరి జిల్లాలో పైలట్‌గా అమలు చేశారు. మార్చి 2020 నుండి 12 జిల్లాల్లో 200 గుర్తించిన ప్రక్రియలను జత చేశారు. 2021 నాటికి, కార్యక్రమం కింద మొత్తం 2436 చికిత్సలను కవర్ చేశారు. సరిహద్దు జిల్లాల్లో నివసిస్తున్న కుటుంబాల ప్రయోజనం కోసం, 130 ఆస్పత్రుల్ని పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుల్లో 2019లో కార్యక్రమం కింద జాబితాలో చేర్చారు. దాదాపు అయిదు లక్షల మంది రోగులు ఏటా ఆరోగ్యశ్రీ కింద ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. రాష్ట్రంలో కార్యక్రమం కింద 2020-21లో, 7.58 లక్షల కేసులలో ముందస్తు అనుమతి చికిత్సలను చేయగా, 5.33 లక్షల ఇన్‌పేషెంట్లకు వైద్యం అందించారు.

పట్టికలు 5.4, 5.5 ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఆరోగ్యశ్రీ కార్యక్రమం విధివిధానాలు, బడ్జెట్, ప్రగతి గురించిన విహంగ వీక్షణాన్ని అందిస్తాయి.

(పట్టిక 5.4: ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఆరోగ్యశ్రీ కార్యక్రమంపై విహంగ వీక్షణం)

(పట్టిక 5.5: ఆరోగ్యశ్రీ కార్యక్రమ బడ్జెట్)

రెండు రాష్ట్రాల్లో ఆరోగ్యశ్రీ కవరేజీలో గుర్తించదగిన పంథాలు కనిపిస్తాయి.

1. కొన్నేళ్లుగా చికిత్సల కవరేజీ గణనీయంగా పెరుగుతోంది.
2. దారిద్ర్య రేఖ ప్రమాణాలతో సంబంధం లేకుండా మొత్తం జనాభాలో 85 శాతం లేదా ఇంకా ఎక్కువమంది, ఏక చెల్లింపుదారు ద్వారా ఉమ్మడి నష్ట ప్రమాద భర్తీ బీమా (సింగిల్-పేయర్ రిస్క్ పూలింగ్ ఇన్సూరెన్స్) కార్యక్రమం కింద కవరేజీ పొందుతున్నారు.
3. ఆరోగ్యశ్రీ వర్తింపునకు దారిద్ర్య రేఖకు దిగువ (బి.పి.ఎల్) రేషన్ కార్డు ప్రాతిపదిక కాగా.. కార్యక్రమం కింద కుటుంబాలకు ఆరోగ్య కవరేజీ వస్తుందన్న తాపత్రయంతో ఆ రేషన్ కార్డులకు భారీ డిమాండ్ ఏర్పడింది.
4. ఆరోగ్యశ్రీ కింద చికిత్సను అందుకుంటున్న రోగుల సంఖ్య, కార్యక్రమం కోసం చేసే వ్యయం పెరుగుతూనే ఉన్నాయి. కార్యక్రమాన్ని 2007-08లో అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో రూ.160 కోట్ల వార్షిక వ్యయంతో ప్రారంభించారు. 2020-21లో రెండు తెలుగు రాష్ట్రాల్లో వ్యయం రూ.2100 కోట్ల దాకా ఉంది.
5. ఆరోగ్యశ్రీ కింద మొత్తం ఇన్‌పేషెంట్లలో దాదాపు 80 శాతం ప్రయివేటు ఆస్పత్రుల్లో ఉన్నారు. కేవలం 20 శాతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స అందుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధ్వాన్న మౌలిక వసతులు, వాటి మధ్యే విపరీత రద్దీ, రోగులు వ్యక్తిగతంగా ప్రయివేటు ఆస్పత్రుల పట్లే ఆసక్తి చూపటం సహా అనేక అంశాలు ప్రయివేటు ఆస్పత్రుల్లోనే ఎక్కువ వ్యయం జరగటానికి కారణంగా ఉన్నాయి.
6. ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యేందుకు తొలి సంవత్సరాలలో ప్రయివేటు రంగంలోని భారీ స్థాయి మల్టీ స్పెషాలిటీ, తృతీయ స్థాయి ఆస్పత్రులు పెద్దఎత్తున ఉత్సుకతను ప్రదర్శించాయి. కానీ, కాలక్రమంలో, అలాంటి పలు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ కార్యక్రమం నుంచి వైదొలుగుతున్నాయి. ప్రభుత్వాల నుండి చెల్లింపుల్లో జాప్యం ఇందుకు కొంత కారణమైతే, కార్యక్రమం కింద అనుమతించే వ్యయంతో రోగులకు చికిత్స చేయటం గిట్టుబాటు కాదని అత్యంత ఖరీదైన తృతీయ స్థాయి ఆస్పత్రులు గుర్తించటం ఇంకొంత కారణం.
7. ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ కింద దాదాపు సగం వ్యయం నాలుగు రకాల తృతీయ స్థాయి వైద్య చికిత్సల్లో అవుతోంది. ఉదాహరణకి, 2020-21లో సుమారు రూ.220 కోట్లను క్యాన్సర్ చికిత్సలో వెచ్చించారు. రూ.200 కోట్లు బహుళ

ట్రౌమా, ఎముకలు, కీళ్ల సంబంధ చికిత్సలు, రూ.200 కోట్లు గుండె సంరక్షణ, గుండె శస్త్రచికిత్సలు, రూ.85 కోట్లు మూత్రపిండాల వైఫల్యాలు, డయాలసిస్‌పై ఖర్చు చేశారు. తృతీయ స్థాయి వైద్యాన్ని మనం మినహాయిస్తే, ద్వితీయ స్థాయి సమస్యలపై వ్యయం ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ కింద చేస్తున్న మొత్తం ఖర్చులో బహుశా 50-60% ఉంటుంది.

8. ఆంధ్రప్రదేశ్‌లోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో, కేవలం 85 తమ ప్రాదేశిక పరిధిలో ఆరోగ్యశ్రీ కింద జాబితాలో నమోదయిన ప్రయివేటు ఆస్పత్రులను కలిగి ఉన్నాయి. 90 నియోజకవర్గాలలో అధీకృత జాబితా ఆస్పత్రులు లేవు. ఒక్కోటి 30 లేదా కొంత ఎక్కువ సంఖ్యలో పడకలు కలిగిన చిన్న నర్సింగ్ హోంలు రాష్ట్రంలో ఆరు వందలకు పైగా ఉన్నాయి. కానీ ప్రస్తుత నిబంధనలు కనీసం 50 పడకలు ఉండాలని నిర్దేశిస్తున్నందున, వీటిని కార్యక్రమం జాబితాలో చేర్చలేదు. ఈ నిబంధనల్ని సడలించేందుకు, చిన్న నర్సింగ్ హోంలను జాబితాలో చేర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

### 5.3. ద్వితీయ స్థాయి వైద్యంలో అందరికీ ఆరోగ్య కవరేజీ ఉండాల్సిన ఆవశ్యకత

సమర్థవంతమైన, సార్వజనీనమైన ద్వితీయ స్థాయి సేవల కవరేజీని అందించటానికి కావలసిన మౌలిక వసతులు, ఏర్పాటు ఇప్పుడు మనకున్నాయని ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీల అనుభవం తెలియచేస్తోంది. ఇంతకుముందే చర్చించినట్లు, ప్రభుత్వ రంగంలో మనకు జిల్లా ఆస్పత్రులు, ఉప-జిల్లా ఆస్పత్రుల నెట్‌వర్క్ ఉంది. భారత్‌లో ప్రభుత్వ రంగంలో పడకల కంటే ప్రయివేటు రంగ ఆస్పత్రి పడకలు ఎక్కువగా ఉన్నాయి. తగిన పర్యవేక్షణలు, ముందుజాగ్రత్తలతో వైద్య సేవల మధ్య పోటీ, రోగులకు ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉంటే, చౌకగా నాణ్యమైన ఆరోగ్యం ప్రజలకు అందుబాటులోకి వస్తుంది.

ఆదాయాలతో సంబంధం లేకుండా ప్రజలందరికీ కవరేజీని విస్తరించటం వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. పరిమిత ఆదాయాలు, తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తితే ఓ కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక సంక్షోభం దృష్ట్యా ఆస్పత్రి సేవల కవరేజీని కేవలం దిగువ ఆదాయ కుటుంబాలకు మాత్రమే పరిమితం చేయలేము. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఇప్పటికే 85 శాతం జనాభాకు ఆరోగ్యశ్రీని వర్తింప చేస్తున్నాయి. దారిద్ర్యరేఖకు మన వద్ద నిర్వచనం చాలా పరిమితులతో కూడినది. తలసరి 2500 కేలరీల ఆహారాన్ని వినియోగించగల ఏ వ్యక్తయినా దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్నట్లుగానే పరిగణిస్తారు. అయితే, మన దేశంలో దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న అనేకమంది కనీస స్థాయి జీవనాన్ని కూడా ఏ రోజుకారోజు అన్నట్లు తీవ్ర అభద్రతలో గడుపుతున్నారు. జనాభాలో అత్యధిక సంఖ్యాకులు కార్యక్రమం కింద కవర్ అవుతూ, స్వల్ప సంఖ్యాకులు మినహాయించబడితే అప్పుడు కవరేజీకి అర్హతను.. రేషన్ కార్డుతో సబ్సిడీ ఆహారానికి అర్హులను ధృవీకరించటం ద్వారా, లేదా కుటుంబ ఆదాయ స్థాయిని బట్టి నిర్ణయించాల్సుంటుంది. ఇలా ప్రజా పంపిణీ వ్యవస్థ, లేదా ఆదాయ ధృవపత్రం, లేదా ఇతర ధృవీకరణ పత్రాలతో లంకెపెట్టటం ద్వారా ఆరోగ్య సంరక్షణను అమలు చేయటం వల్ల సేవలను అందుకోవటం ప్రజలకు కష్టసాధ్యంగా, పెద్ద ప్రయాసగా మారుతుంది. ధృవీకరణ పత్రాలు లేకపోవటం వల్ల అనేక పేద కుటుంబాలు వైద్య సేవల వర్తింపు పరిధిలోకి రాలేకపోవచ్చు, మరోవైపు, నిర్దేశించిన ఆదాయ పరిమితికి పైన ఉన్నవారు కవరేజీని పొందవచ్చు. ముఖ్యంగా గ్రామీణం నుండి పట్టణ ప్రాంతాలకు తరలి వెళ్లే అనేకమంది వలస కార్మికులకు సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. భారతదేశం ఎక్కువగా గ్రామీణం అయినా, పట్టణీకరణ వేగంగా జరుగుతోంది. ఉద్యోగాలు, మెరుగైన జీవితం కోసం కొన్ని పని కాలాల్లోనో (సీజన్‌లలో), శాశ్వతంగానో పట్టణ ప్రాంతాలకు పెద్దఎత్తున వలసలు జరుగుతున్నాయి. సరైన పత్రాలు లేవన్న కారణంగా ఎక్కువమంది నిరుపేద వలస కార్మికులు తమకు ఉద్దేశించిన ఆరోగ్య సంరక్షణ కవరేజీ కార్యక్రమాలను అందుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది.

ఆరోగ్య కవరేజీని సార్వజనీనంగా అందరికీ వర్తింప చేయటానికి అనుకూలంగా పలు బలమైన వాదనలున్నాయి. మొదటిది, కొన్ని రకాల పద్ధతుల ప్రాతిపదికపై కుటుంబాల్ని తొలగించటం గందరగోళకరమైనది, సంక్లిష్టమైనది. ధృవీకరణ పత్రాల జారీలో పొరపాట్లు దొర్లే అవకాశాలు ఎప్పుడూ ఉంటాయని మన అనుభవం తెలియచేస్తోంది. రెండోది, ఆరోగ్యాన్ని ఒక హక్కుగా గుర్తించాలి. చట్టబద్ధపాలన, మౌలిక వసతులు, కనీస సౌకర్యాలు, నాణ్యమైన విద్యతోపాటు ఆరోగ్యాన్ని అందించటం ప్రభుత్వ ప్రాథమిక విధి. ఆరోగ్య సంరక్షణ సేవల్ని ఏ రకంగా పరిమితం చేసినా, మొత్తంగా ప్రజా సంక్షేమాన్ని, ఉత్పాదకతను, ఆర్థికాన్ని దెబ్బతీస్తుంది. మూడోది, కేవలం పేదలకే ఉద్దేశించిన సేవలు కాలక్రమంలో నాణ్యతాపరంగా క్షీణిస్తాయి. జనాభాలో ప్రశ్నించ గలిగే వర్గాలకు కూడా అందులో భాగస్వామ్యం ఉన్నప్పుడే సేవ గణనీయంగా మెరుగుపడుతుంది. కాబట్టి, మధ్యతరగతుల వారిని కూడా చేర్చటం సేవల నాణ్యతను మెరుగుపరుస్తుంది.

అయితే, ప్రభుత్వానికుండే బడ్జెట్ పరిమితులపై కొన్ని న్యాయమైన ఆందోళనలు ఉన్నాయి. ప్రభుత్వ నిధులతో నడిచే ఆరోగ్య సేవల వ్యవస్థ చౌకయినది, దీర్ఘకాలంలో మనగలిగేది కావాలి. ఆరోగ్యంపై భారతదేశ మొత్తం ప్రజారోగ్య వ్యయం (యూనియన్+రాష్ట్రాలు) జీడీపీలో కేవలం 1 శాతం కంటే కొద్దిగా ఎక్కువ. సమీప భవిష్యత్తులో ఈ వ్యయాన్ని జి.డి.పిలో నాలుగు లేదా ఐదు శాతానికి పెంచగలమనుకోవటం అవాస్తవికమవుతుంది. ఆస్పత్రి సంరక్షణ ఎంతో ఖరీదైనది, సంక్లిష్టమైనది. టెక్నాలజీ-కేంద్రితమైన తృతీయ స్థాయి వైద్యం

మరీ ఎక్కువ ఖరీదైనది. ఆధునిక వైద్యంలో, మూడో దశ చికిత్సల్లో ఖర్చులు అనూహ్యంగా పెరుగుతున్నాయి. అదే సమయంలో అటువంటి వ్యయం వల్ల ఫలితాలు మాత్రం అత్యంత తక్కువగా ఉంటాయి. సమర్థత, నాణ్యత, అందరికీ కవరేజీతో సేవలు అందించకపోతే, చివరికి భరించలేని స్థాయికి ఖర్చులు పెరిగి ఖజానా ఖాళీ అయ్యే పరిస్థితి వస్తుంది. అమెరికా వంటి ఎంతో సంపన్న దేశాలు కూడా వేగంగా పెరుగుతున్న ఖర్చులకు వనరులను కేటాయించటానికి సతమతమవుతున్నాయి. వనరుల కొరత ఉన్న దేశంలో, వనరుల కేటాయింపుకి అనేక పోటాపోటీ ప్రాథమ్యాలు ఉంటాయి. తీవ్ర ఆరోగ్య సంక్షోభం కోట్లాదిమందిని పేదరికంలోకి నెడుతూ, పైకి కనిపించని మరికొన్ని కోట్లమందికి ఊహకందని వేదనను కలిగిస్తూన్నందున ఆరోగ్య సంరక్షణ మన దేశానికి అత్యంత ప్రాధాన్యాంశం కావాలి. అయితే, నాణ్యమైన ఆరోగ్యం, అందరికీ కవరేజీతోపాటు ఖజానాపై ఖర్చుల్ని తగ్గించటం కూడా ముఖ్యం.

### 5.4. అందరికీ వర్తించే, ఏక చెల్లింపుదారు, బీమా-ఆధారిత ద్వితీయ స్థాయి వైద్య వ్యవస్థ వ్యయాన్ని అదుపులో ఉంచటం

మనమంతా సంతోషించాల్సిన విషయమేమంటే, ద్వితీయ స్థాయి వైద్య సేవల వ్యయాన్ని అదుపులో ఉంచే నాలుగు కారకాలు భారతదేశ నేపథ్యంలో ఉన్నాయి. మొదటిది, ఆంధ్రప్రదేశ్ వివరాలు చూపుతున్నట్లు, దాదాపు 50 శాతం ఆరోగ్యశ్రీ వ్యయం కేవలం నాలుగు తృతీయ స్థాయి చికిత్సల కవరేజీకి మాత్రమే ఉపయోగపడుతోంది. క్యాన్సర్ చికిత్స, బహుళ ట్రౌమా, ఎముకలు, కీళ్ల సంబంధ చికిత్సలు, గుండె జబ్బులు, మూత్రపిండాల వైఫల్యం, డయాలసిస్. ఆయుష్మాన్ భారత్‌లో తృతీయ స్థాయి వైద్య వ్యయాల సూక్ష్మ వివరాలు అందుబాటులో లేనప్పటికీ, అత్యధిక వ్యయం పి.టి.సి.ఎ, సి.ఎ.బి.జి, ఫ్రాక్చర్‌లు, మొత్తం మోకాలి మార్పిడి, రేడియో థెరపీ ఇలా తృతీయ స్థాయి చికిత్సలకే అవుతోంది. తృతీయ స్థాయి వైద్యం అత్యధికంగా టెక్నాలజీ-కేంద్రితంగా ఉంటుంది. దీనికి అత్యున్నతస్థాయి నైపుణ్యాలు, పెద్దఎత్తున వనరులు కావాలి. అవసరమైనప్పుడు అత్యున్నత నాణ్యత కలిగిన తృతీయ స్థాయి వైద్యాన్ని అందించేందుకు ఒక విధానాన్ని అందుబాటు ఖర్చుతో మనం అమల్లోకి తేవాలి. ఖర్చు నియంత్రణతో నాణ్యమైన సేవలను అందించటంలో సవాళ్లను సమన్వయం చేసే ఒక ఆచరణసాధ్యమైన, సమర్థవంతమైన నమూనా వివరాలు తృతీయ స్థాయి వైద్యంపై ఉన్న తదుపరి అధ్యాయంలో ఉన్నాయి. ఒక్కసారి తృతీయ స్థాయి వైద్యాన్ని ఏక చెల్లింపు దారు (సింగిల్-పేయర్), ఇన్సూరెన్స్-ఆధారిత ఉమ్మడి నష్ట పరిహార చెల్లింపు ద్వితీయ స్థాయి వైద్య సేవల వ్యవస్థ నుండి తొలగిస్తే.. విస్తృతీకరించిన ఆయుష్మాన్ భారత్ కార్యక్రమ వ్యయం ద్వితీయ స్థాయి సేవల్లో మొత్తంగా అదుపులోకి వచ్చి తేలిగ్గా నిర్వహించగల వీలుంటుంది.

రెండోది, ప్రయివేటు తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో సేవల ఖర్చు భరించలేని స్థాయిలో ఉంటుంది. ఓ పెద్ద నగరంలో ఆధునిక తృతీయ స్థాయి ఆస్పత్రి అంటే, భారీ పెట్టుబడితో కూడినది. భూమి విలువ భారీగా ఉండటం, అత్యాధునిక మౌలిక వసతులు, అధునాతన సాంకేతికతల పరికరాల దృష్ట్యా తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో పెట్టుబడి వ్యయం ఒక్కో పడకకు రూ.1 కోటి లేదా ఇంకా ఎక్కువే అవుతుంది (అధ్యాయం 6లో పట్టిక 6.1). ఆస్పత్రిని నడపటంలో భారీ వ్యయం ఉంటుంది. రుణ చెల్లింపులు, ఆస్పత్రి నిర్వహణ, ఔషధాలు, వైద్య వినియోగ వస్తువులు, రోగ నిర్ధారణలు, విశేష నైపుణ్యమున్న వృత్తినిపుణులకనిమిత్తం ఎంతో ఖర్చవుతుంది. అందుకే అధునాతన తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో ఒక్కో పడకకు బిల్లు ఏడాదికి రూ.30 లక్షల నుండి 100 లక్షల వరకు అవుతుంది. అయితే చాలా ద్వితీయ స్థాయి చికిత్సలకు అటువంటి ఖరీదైన మౌలిక సదుపాయాలు, పరికరాలు అక్కర్లేదు. తగిన వసతులున్న చిన్న నర్సింగ్ హోంలు నాణ్యమైన ద్వితీయ స్థాయి సేవల్ని సమర్థవంతంగా అందించగలవు. ఈ చిన్న నర్సింగ్ హోంలు 20-30 పడకలతో, ఒక ఆపరేషన్ థియేటర్, ఒక ప్రసూతి గది, ఆక్సిజన్ సదుపాయాలు, ఇద్దరు లేదా ముగ్గురు ఫిజీషియన్లు- ఒక ఫిజీషియన్, ఒక జనరల్ సర్జన్, ఒక ప్రసూతి మరియు గైనకాలజిస్ట్- కొంతమంది సహాయక నర్సింగ్ సిబ్బందితో పనిచేస్తుంటాయి. అటువంటి చిన్న నర్సింగ్ హోంలు అర్ధ గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాలు, కొన్ని నగరాల్లో కూడా దశాబ్దాలపాటు ప్రయివేటు ఆరోగ్య రంగ ప్రధాన క్షేత్రాలుగా ఉన్నాయి. మౌలిక వసతుల వ్యయం తక్కువగా ఉండేలా చూసుకోవటం, చిన్న పట్టణాల్లో వేతన స్వరూపం పెద్ద నగరాల్లో కంటే తక్కువగా ఉండటం వల్ల ఈ నర్సింగ్ హోంలు ఉదరకోశ శస్త్రచికిత్సలు సహా నాణ్యమైన సేవల్ని అందుబాటు ధరలో అందించాయి.

పెద్ద నగరాల్లో ప్రయివేటు తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో భారీ పెట్టుబడులు ప్రవేశించాక, చిన్న నర్సింగ్ హోంలు తమ ప్రాధాన్యతను కోల్పోతున్నాయి. అత్యున్నత నాణ్యత గల మౌలిక సదుపాయాలు, అధునాతన డయాగ్నొస్టిక్‌లు, మల్టీ స్పెషాలిటీ సేవలు పెద్ద నగరాల్లోని ఈ ఆస్పత్రుల వైపు పెద్దసంఖ్యలో రోగులను, తరచూ దూర గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల నుండి ఆకర్షిస్తున్నాయి. ఖరీదైన ఈ ప్రయివేటు తృతీయ వైద్య ఆస్పత్రుల్లో వ్యయ స్వరూపం, బిల్లులు అనివార్యంగా ఎక్కువగా ఉండటంతో.. అత్యధిక సంఖ్యాక రోగులు వైద్య చికిత్సల భారాన్ని మోయలేక ఆర్థికంగా సంక్షోభంలోకి జారిపోతున్నారు. అయితే, చిన్న గ్రామీణ, చిన్న పట్టణాల నర్సింగ్ హోంల స్థానాన్ని పెద్ద నగరాల తృతీయ స్థాయి ఆస్పత్రులు ఆక్రమించటమనేది నిర్దాక్షిణ్యమైన, అడ్డూఆపూ లేకుండా కొనసాగుతోన్న ప్రక్రియ. ఇది గ్రామాలు, చిన్న పట్టణాల్లోని వారికి వైద్యాన్ని అందని ద్రాక్షగా మారుస్తూ సేవల వ్యయాన్ని అనూహ్యంగా పెంచేస్తోంది.

చిన్న నర్సింగ్ హోంలను మనం ద్వితీయ స్థాయి వైద్యంలో

కేంద్రబిందువుగా చేస్తే, నాణ్యమైన రెండో దశ వైద్యాన్ని అందుబాటు ఖర్చులోనే చిన్న పట్టణాల్లో అందించవచ్చు. దీనివల్ల మొత్తం ద్వితీయ స్థాయి సేవల చికిత్సలు తక్కువ ధరలోనే లభిస్తాయి. సేవల అందుబాటును నర్సింగ్ హోంలు మెరుగుపరుస్తాయి. వీటిల్లో అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా, సేవల్లో ప్రమాణాలు, నియమావళి పాటించేలా అవసరమైన అన్ని చర్యల్నీ తీసుకోవాలి. అటువంటి విధానం వల్ల ఆస్పత్రి సేవలను ఆశించే గ్రామీణ, చిన్న పట్టణ ప్రజానీకం మొత్తానికి రవాణా, బస వంటి కారణాలరీత్యా అయ్యే ఓ.ఓ.పి.ఇ వ్యయం కూడా తగ్గుతుంది. ప్రభుత్వ నిధులు, చిన్న నర్సింగ్ హోంల ద్వారా అమలయ్యే ఏక చెల్లింపుదారు (సింగిల్-పేయర్) ద్వితీయ స్థాయి ఇన్సూరెన్స్ కార్యక్రమం నుండి వృత్తిపరమైన సంతృప్తిని, ప్రజల్లో గుర్తింపుని, ఆర్థిక ప్రోత్సాహకాన్ని పొందేందుకు.. ఇంకా ఎక్కువమంది డాక్టర్లు, ఆరోగ్య సంరక్షణ సిబ్బంది చిన్న పట్టణాల్లోకి విస్తరించటాన్ని ఇది ప్రోత్సహిస్తుంది.

ఆస్పత్రి ఖర్చుల్ని అదుపులో ఉంచే మూడో అంశం.. తొలి వైద్య సంప్రదింపు స్థానంగా, పై స్థాయి చికిత్సకు సిఫార్సుదారుగా ఎఫ్.పి వ్యవహరించే పటిష్ఠ ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ! సమర్థవంతమైన ఎఫ్.పి వ్యవస్థ ద్వారా, అత్యధిక శాతం ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు, లేదా తొందరగా రోగ కారణాలను గుర్తించి అవి తీవ్రంగా, ప్రాణాపాయ జబ్బులుగా మారకముందే తగిన చికిత్స చేయవచ్చు. అదేవిధంగా, సమర్థవంతమైన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థలో ఎక్కువ శాతం ఎన్.సి.డిలను స్క్రీనింగ్ చేసి, తొలి దశలోనే రోగ నిర్ధారణ చేస్తారు. ఎన్.సి.డిలను ప్రాథమిక స్థాయిలో సక్రమంగా నిలువరించటం వల్ల మంచి ఆరోగ్యాన్ని నిరంతరం కాపాడుకునేలా చేయవచ్చు, అధునాతనమైన, ఖరీదైన చికిత్సలు అవసరమయ్యే తీవ్ర స్థాయి అనారోగ్యాలను నివారించవచ్చు లేదా సాధారణ స్థాయికి తగ్గించవచ్చు. వెనకటికో సామెత చెప్పినట్లు, గోటితో పోయేదానికి గొడ్డలి అవసరం ఉండదు. ప్రపంచవ్యాప్తంగా కూడా సమర్థవంతమైన ప్రజారోగ్య, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ.. ఆరోగ్యాన్ని మెరుగుపరిచింది, జీవనకాలాన్ని పొడిగించింది, ఆస్పత్రి ఖర్చుని తగ్గించింది. ఈ పత్రంలో ప్రతిపాదించిన నమూనా ఒక పటిష్ఠమయిన, సమర్థవంతమైన, అందుబాటులో ఉండే, తక్కువ ఖర్చయ్యే, ఆచరణసాధ్యమైన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను అందిస్తోంది. అటువంటి నమూనా అందరికీ ద్వితీయ, ఆస్పత్రి చికిత్సల వ్యయాన్ని సాపేక్షంగా బాగా తగ్గిస్తుంది.

అందరికీ ఆస్పత్రి సేవలు అందించే ఏర్పాటు వల్ల ఖజానాపై పడే భారాన్ని తగ్గించే నాలుగో అంశం.. మన సామాజిక-ఆర్థిక నిర్మాణం. ఉద్యోగుల ప్రభుత్వ ఇన్సూరెన్స్ (ఇ.ఎస్.ఐ) కార్యక్రమం కింద ఇప్పటికే ఆరోగ్య కవరేజీ కలిగిన సంఘటిత రంగంలోని శ్రామికుల్లో అత్యధికులు, అధికాదాయమున్న మధ్యతరగతి వర్గాలు, వృత్తినిపుణులు, స్వయంఉపాధి పొందుతున్న ప్రజానీకం తమ సొంత బీమా పథకాల మీదే ఆధారపడే అవకాశాలు ఎక్కువ. జనాభాలో ఎక్కువశాతం దశాబ్దాలుగా ప్రయివేటు ఆస్పత్రులపై ఆధారపడి ప్రయివేటు రంగ ఆరోగ్య సంస్థలు, ఆరోగ్య బీమా పరిశ్రమ వేగంగా వృద్ధి చెందుతున్న నేపథ్యంలో, 20-25% దాకా ప్రజలు ఆరోగ్య సంరక్షణను సొంతంగానే పొందటాన్ని కొనసాగించే అవకాశాలున్నాయి. ఇ.ఎస్.ఐ ప్రస్తుతం 3.41 కుటుంబాలను, అంటే సుమారు 13.24 కోట్ల మంది ప్రజానీకాన్ని కవర్ చేస్తోంది. ఇ.ఎస్.ఐ కార్యక్రమం కింద ఉద్యోగి, యజమాని ఇద్దరూ ఆరోగ్య బీమాను వాటా పద్ధతిలో కడతారు. నెలకు రూ.21,000 లోపు ఆదాయమున్న (దివ్యాంగులకయితే రూ.25,000) సంఘటిత రంగ కార్మికులందరూ చట్ట ప్రకారం ఇ.ఎస్.ఐ వర్తింపులోకి వస్తారు. శ్రామికులు, వారి కుటుంబాలకు సమగ్ర ఆరోగ్య సేవల్ని అందించేందుకు తగినన్ని వనరుల్ని కేటాయించారు. అధికాదాయ శ్రామికులు, సమాజంలో వనరులున్న వర్గాల వారు తమ అవసరాలు, ఆసక్తుల కనుగుణంగా ప్రయివేటు బీమాను కొనుగోలు చేస్తారు.

స్థూలంగా, ఆరోగ్య బీమా రంగాన్ని ప్రభుత్వ ప్రాయోజిత ఆరోగ్య బీమా, ప్రయివేటు పెట్టుబడులతో సామూహిక (గ్రూపు) బీమా (ప్రభుత్వ ప్రాయోజితాలు మినహాయించి), వ్యక్తిగత ఆరోగ్య బీమాలుగా విభజించవచ్చు. ప్రభుత్వ ప్రాయోజిత బీమాలో పి.ఎం.జె.ఎ.వై, ఇ.ఎస్.ఐ, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సి.జి.హెచ్.ఎస్), ఇతర జాతీయ, రాష్ట్ర ఇన్సూరెన్స్ కార్యక్రమాలు ఉన్నాయి. 2015 నుండి 2020 వరకు ఏ తరహా బీమాలో ఎంతమంది కవర్ అయ్యారో పట్టిక 5.6 తెలియచేస్తుంది. 2019-20లో 13.24 కోట్ల మంది ఇ.ఎస్.ఐ కింద వర్తింపును పొందగా, 13.67 కోట్ల మంది ప్రజలు వివిధ ప్రయివేటు వ్యక్తిగత, గ్రూపు ఇన్సూరెన్స్ కార్యక్రమాల కింద, 0.36 కోట్ల మంది సి.జి.హెచ్.ఎస్ కింద కవరేజీని పొందారు. పలు రాష్ట్రాల్లో ప్రభుత్వోద్యోగులకు సామూహిక బీమా కార్యక్రమాలు కూడా ఉన్నాయి. రాష్ట్రాల్లో ప్రభుత్వోద్యోగుల కవరేజీని మినహాయిస్తే.. 2019-20 నాటికి మొత్తం 27.27 కోట్ల మంది ఉద్యోగులు ఇ.ఎస్.ఐ, ప్రయివేటు వ్యక్తిగత, గ్రూపు ఇన్సూరెన్స్ కార్యక్రమాలు, సి.జి.హెచ్.ఎస్ కింద తగిన ఆరోగ్య ఇన్సూరెన్స్ కవరేజీని కలిగివున్నారు.

**(పట్టిక 5.6: భారత్‌లో ఆరోగ్య బీమా కవరేజీ.. రకాల వారీగా (లక్షల్లో), 2015-2020)**

భారతదేశ ఆరోగ్య బీమా రంగం వైవిధ్యమవుతూ వేగంగా పెరుగుతోంది. పలు రకాల ప్రయివేటు ఇన్సూరెన్స్ కార్యక్రమాలు, అత్యాధునిక ప్రయివేటు ఆస్పత్రుల పెరుగుదల, మెరుగైన వనరులున్నవారు ఇన్సూరెన్స్ లేదా ఓ.ఓ.పి.ఇ ద్వారా ప్రయివేటు ఆరోగ్య సంరక్షణ పట్ల మొగ్గు చూపటం.. గణనీయ శాతం ప్రజలు ప్రభుత్వ మద్దతు లేకుండా ప్రయివేటు కవరేజీ మీద ఆధారపడటానికి కారణాలుగా ఉన్నాయి.

ఆర్థిక వృద్ధి, ప్రగతి పెరుగుదలతో ప్రయివేటు ఇన్సూరెన్స్ మీద ఆధారపడే కుటుంబాల సంఖ్య మరింత పెరుగుతుంది.

ఇ.ఎస్.ఐ కవరేజీ, సి.జి.హెచ్.ఎస్, ప్రయివేటు ఆరోగ్య బీమా, సంపన్నులకు ఖరీదైన ఇన్సూరెన్స్ కార్యక్రమాలు, సంపన్నుల ఓ.ఓ.పి.ఇ.. ఈ విభాగాల్లో సుమారు 20-25% జనాభా ఉంటారని వాస్తవిక అంచనాగా లెక్కేసుకోవచ్చు. భారత్‌లో ప్రయివేటు ఆరోగ్య రంగం భారీ స్థాయిలో ఉండటం, వేగంగా వృద్ధి చెందటం వల్ల.. స్తోమతు ఉన్నవారు ఆరోగ్య సేవలకు ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించే సరళి పటిష్ఠ ప్రయివేటు రంగ నిరంతరాయ వృద్ధికి దోహదం చేస్తుంటుంది. దీనివల్ల కొత్త పోకడలకు, పోటీకి ప్రోత్సాహం లభించి సేవల నాణ్యత పెరుగుతుంది. భారతదేశం ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సేవల కేంద్రంగా అవతరిస్తోంది. ఖర్చు, నాణ్యతల పరంగా మన వద్ద ఉన్న సానుకూలతల రీత్యా, ఈ ప్రక్రియ ప్రయివేటు రంగం వృద్ధికి, దేశంలోని పేద, మధ్యతరగతివారిపై భారం మోపకుండా ఆరోగ్య రంగంలో ఉద్యోగాల సృష్టికి దోహదం చేస్తుంది. నిధుల కొరతలేని ఈ ఇన్సూరెన్స్ పథకాలు జనాభాలో 20-25% ప్రజల ఆరోగ్య అవసరాలను తీరుస్తాయి. ఆ మేరకు ప్రభుత్వం నిధులు సమకూర్చేటువంటి అందరికీ ఆరోగ్య సేవల విధానంపై భారం తగ్గుతుంది.

ఈ విధంగా, పి.పి.పి పద్ధతిలో ఏక చెల్లింపుదారు ఇన్సూరెన్స్-ఆధారిత ద్వితీయ స్థాయి వైద్య సేవల నుండి తృతీయ దశ వైద్యాన్ని వేరు చేయటం, చౌకయిన, నాణ్యమైన ద్వితీయ దశ వైద్యానికి చిన్న నర్సింగ్ హోంలపై అధికంగా ఆధారపడటం, పటిష్ఠమైన, ఆస్పత్రులపై ఆధారపడే అవసరాన్ని తగ్గించే సమర్థవంతమైన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ, ఇ.ఎస్.ఐ కార్యక్రమం, ప్రయివేటు ఇన్సూరెన్స్‌కి ప్రోత్సాహాన్ని కొనసాగించటాల్ని ఒక సమాహారంగా అమలు చేస్తే ఖజానాపై భారం అదుపులో ఉంటుంది. అటువంటి గరిష్ట వ్యయ ప్రయోజనకర ద్వితీయ స్థాయి ఆరోగ్య సంరక్షణ నమూనా ప్రజలందరి అవసరాలనూ తీరుస్తూ నాణ్యమైన ఆరోగ్యానికి కూడా భరోసా ఇస్తుంది. భారత్‌లో మెరుగైన వనరులను కలిగిన వారు, భారత్ వెలుపల నుండి వచ్చే వారి ద్వారా డిమాండ్‌కు అనుగుణంగా ప్రయివేటు రంగ వృద్ధి కొనసాగుతుంటుంది.

**ప్రభుత్వం నిధులు సమకూర్చే ఏక చెల్లింపుదారు బీమా-ఆధారిత ద్వితీయ స్థాయి ఆరోగ్య వ్యవస్థను నిర్దేశించాల్సిన సూత్రాలు-**

1. అన్ని ద్వితీయ స్థాయి ఆరోగ్య సేవలనూ అందరికీ వర్తింప చేయటం.
2. ఎమర్జెన్సీ సందర్భాల్లో మినహా ఆస్పత్రి సేవలకు ప్రాథమిక సేవల నెట్‌వర్క్ నుండి సిఫార్సు (రెఫరల్) ఉండటమనేది ముందస్తు నిబంధనగా ఉంటుంది.
3. ద్వితీయ స్థాయి వైద్యాన్ని అందించటంలో సి.హెచ్.సిలు, చిన్న ప్రయివేటు నర్సింగ్ హోంలు కీలక పాత్ర పోషిస్తాయి.
4. ఏ ఆస్పత్రికి వెళ్లాలనేది ఎంచుకోవటానికి రోగికి స్వేచ్ఛ ఉంటుంది. వివిధ ప్రయివేటు, ప్రభుత్వ వైద్యుల మధ్య పోటీ ఉంటుంది.
5. సి.హెచ్.సిలు, జిల్లా ఆస్పత్రుల్లోని రోగ నిర్ధారణ సేవల ఉమ్మడి వినియోగం.
6. తృతీయ స్థాయి వైద్యాన్ని వేరు చేసి, ఏక చెల్లింపుదారు పద్ధతిని పూర్తిగా రెండో దశ వైద్యానికే వర్తింప చేయటం.
7. నగదు రహిత రోగ నిర్ధారణ పరీక్షలు, చికిత్సలు, ఆపరేషన్ అనంతర సేవలు.

**5.5. అందరికీ వర్తించే, ఏక చెల్లింపుదారు, బీమా-ఆధారిత ద్వితీయ దశ వైద్య సేవల వ్యవస్థలో ఉండాల్సిన ప్రతిపాదిత అంశాలు**

ఉమ్మడి నష్ట ప్రమాద భర్తీ, ఏక చెల్లింపుదారు (రిస్క్ పూలింగ్, సింగిల్-పేయర్) పి.పి.పి పద్ధతిపై ఆధారపడిన రెండో దశ వైద్య సేవల వ్యవస్థ పూర్తి స్థాయి ప్రయోజనాల్ని అందుకోవటానికి ఈ దిగువ చర్యలు ఉపయోగపడతాయి.

1. ఈ కార్యక్రమం కింద ఎమర్జెన్సీ సందర్భాలలో మినహా మిగతా సమయాల్లో ఆస్పత్రి సంరక్షణ ఎఫ్.పి నుండి సిఫార్సు ద్వారా మాత్రమే అందుబాటులో ఉండటం విధిగా అమలవుతుంది.

2. ఆరోగ్య సమస్య తీవ్రంగా ఉన్న రోగులకు రవాణా సహాయాన్ని అందించవచ్చు. ఇప్పటికే, అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వం ఇ.ఎం.ఆర్.ఐ (ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) లేదా ఇతర స్వచ్ఛంద సంస్థల ద్వారా ఉచిత అంబులెన్స్ సర్వీసులను అందిస్తోంది. పి.పి.పి నమూనాలో పనిచేస్తున్న ఒక స్వచ్ఛంద సంస్థ ఇ.ఎం.ఆర్.ఐ. భారత్‌లో సమగ్రమైన, వేగవంతమైన అత్యవసర నిర్వహణ సేవలను అందిస్తోంది. 2005లో హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ సంస్థ, ప్రస్తుతం 17 రాష్ట్రాలు, యు.టిల్లో 12,420 అంబులెన్స్‌లతో పనిచేస్తోంది (108 ఎమర్జెన్సీ ప్రతిస్పందన అంబులెన్స్ సర్వీసులు, జనని శిశు సురక్షా కార్యకారం (జె.ఎస్.ఎస్.కె) ప్రభుత్వ పథకం కింద 102 తల్లి, బిడ్డ అంబులెన్స్ సర్వీసులు కలిపి) వివిధ రాష్ట్రాల్లో రోజుకు 20,000కు పైగా ఎమర్జెన్సీలు, 30,000 పైచిలుకు జె.ఎస్.ఎస్.కె లబ్ధిదారులకు సేవలందిస్తున్నాయి. అటువంటి ఎమర్జెన్సీ ప్రతిస్పందన సర్వీసులను అన్ని రాష్ట్రాలకూ విస్తరించి, ఆస్పత్రి సేవల అందుబాటును పెంచేలా బలోపేతం చేయవచ్చు.

3. జిల్లా ఆస్పత్రి, సి.హెచ్.సి స్థాయిలో కొన్ని డయాగ్నొస్టిక్ సేవలను ఉమ్మడి వినియోగ పరిధిలోకి తేవచ్చు. ఉదాహరణకి, ఒక సి.టి స్కానర్‌ని కొని, నిర్వహించటం ఓ చిన్న నర్సింగ్ హోంకు ఆర్థికంగా గిట్టుబాటు కాకపోవచ్చు. అటువంటి సదుపాయాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంటే, ఆ చుట్టుపక్కల ప్రాంతంలోని అన్ని జాబితా ఆస్పత్రులూ ఆ సేవలను కొంత రుసుముతో వినియోగించుకోవచ్చు.

4. డయాగ్నొస్టిక్, చికిత్స సేవలను తగు స్థాయిలో అందించేలా జిల్లా ఆస్పత్రులు, సి.హెచ్.సిలలో అదనపు పెట్టుబడులు అవసరం ఉండొచ్చు. ఆయుష్మాన్ భారత్ ఏక చెల్లింపుదారు ఇన్సూరెన్స్ కార్యక్రమం అయినందున.. అందించిన సేవలకు ఆదాయావకాశం అందుబాటులో ఉంటుంది. కాబట్టి, ప్రభుత్వాస్పత్రులు గనక పోటీపడి రోగులను ఆకర్షించగలిగితే, వైద్య పరికరాలు వాటి పెట్టుబడిని అవి ఆర్జించగలుగుతాయి. అలాగే, డయాగ్నొస్టిక్‌లను ఉమ్మడి వినియోగ పరిధిలోకి తెచ్చి జాబితాలోని ప్రయివేటు ఆస్పత్రులకు రుసుముతో సేవలను అందించటం ద్వారా కూడా ఆదాయాన్ని ఆర్జించవచ్చు. కాబట్టి, అటువంటి మూలధన పెట్టుబడుల్లో ప్రయివేటు నిధుల్ని 8–10% వడ్డీ మేర నికర ఆదాయ భరోసా కల్పిస్తూ ప్రోత్సహించవచ్చు. ప్రభుత్వాస్పత్రుల్లో అటువంటి పెట్టుబడి ఆకర్షణీయంగా ఉండేలా ప్రభుత్వం పన్ను, ఇతర ప్రోత్సాహకాల్ని రూపొందించవచ్చు. పరికరాల నిర్వహణను కూడా వాటి సక్రమ పనితీరు బాధ్యతలో భాగస్వాములైన పెట్టుబడిదారులకే అప్పగించవచ్చు. అటువంటి వినూత్న పద్ధతులు ప్రభుత్వంపై పెట్టుబడి వ్యయ భారాన్ని తగ్గిస్తాయి, ఆస్పత్రులకు పూర్తిస్థాయిలో సాధనసంపత్తిని సమకూర్చటంలో జాప్యాన్ని తగ్గిస్తాయి, వనరుల కేటాయింపు సమర్థవంతంగా ఉండేలా చేసి, పెట్టుబడికి తగ్గరీతిలో అవి వినియోగమయ్యేలా చేస్తాయి. పోటీ, ఎంపికలు రోగి ప్రాధాన్యతలను ప్రభావితం చేసి, నాణ్యమైన సేవలకు ప్రోత్సాహకాన్ని అందిస్తాయి కాబట్టి.. ఈ రకమైన ఏర్పాట్లు ప్రభుత్వ ఆస్పత్రుల వ్యవస్థను పటిష్ఠం కూడా చేస్తుంది.

5. సి.హెచ్.సిలు.. ఆచరణసాధ్యమైనంత మేరకు చిన్న ప్రయివేటు నర్సింగ్ హోంలతో కలిసి ద్వితీయ స్థాయి వైద్య సేవలను ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో అందించే ఆస్పత్రులుగా వ్యవహరించాలి. ఇది ప్రభుత్వానికి ఖర్చుకు తగ్గ ప్రయోజనాలను చూపటంతోపాటు, ఆస్పత్రి చికిత్సలో పోటీని, ఎంపికను ప్రోత్సహిస్తుంది. బ్లాక్ స్థాయి ఆరోగ్య పాలనా విభాగాలుగా, పైస్థాయి ఆరోగ్య సదుపాయాలకి సిఫార్సులు చేసే (రెఫరల్స్ గేట్‌కీపర్) 30 పడకల ఆస్పత్రులుగా సి.హెచ్.సిల రూపకల్పన ఉంటుంది. వైద్యం, ప్రసూతి, గైనకాలజీ, శస్త్రచికిత్సలు, పిల్లల వైద్యం, దంత, 'ఆయుష్'లలో అవి స్పెషలిస్ట్ సేవలను అందిస్తాయి. భారత్‌లో 5649 సి.హెచ్.సిలు (5183 గ్రామీణ, 466 పట్టణ), దాదాపు ప్రతి 2,40,000 జనాభాకి ఒక సి.హెచ్.సి చొప్పున ఉన్నాయి. వీటితో పాటు, 1234 ఉప–జిల్లా (సబ్–డివిజనల్) ఆస్పత్రులు దేశంలో ఉన్నాయి. వీటిలో పడకల సామర్థ్యం 31 నుండి 100 దాకా ఉంది. ఇవి అత్యవసర ప్రసూతి సంరక్షణ, నవజాత శిశు సంరక్షణ అందిస్తున్నాయి. అయితే, ప్రభుత్వ రంగంలో ద్వితీయ స్థాయి సేవలను ఎక్కువగా దేశవ్యాప్తంగా ఉన్న 756 జిల్లా ఆస్పత్రుల్లోనే అందిస్తున్నారు. పలు సి.హెచ్.సిలు, ఉప–జిల్లా ఆస్పత్రుల్లో తగినన్ని సౌకర్యాల్ని, వనరుల్ని సమకూర్చేంత వరకూ, జిల్లా ఆస్పత్రులు కీలక పాత్ర పోషించవచ్చు. కానీ క్రమంగా సి.హెచ్.సిలను బలోపేతం చేయాలి, జిల్లా ఆస్పత్రుల్ని కేవలం తృతీయ వైద్యానికి పరిమితం చేయాలి.

6. గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లో సాపేక్షంగా తక్కువ వ్యయాలతో విజయవంతంగా సేవలందించగల అద్వితీయ అవకాశం చిన్న ప్రయివేటు నర్సింగ్ హోంలకు ఉంది. అనేక రాష్ట్రాలలో అటువంటి చిన్న ప్రయివేటు నర్సింగ్ హోంలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఉదాహరణకి, ఆంధ్రప్రదేశ్‌లో కనీసం 30 పడకలు గల అటువంటి నర్సింగ్ హోంలు 600కి పైగా ఉండగా, తెలంగాణలో 1000కి పైగా ఉన్నాయి. ఏక చెల్లింపుదారు నమూనాలో ద్వితీయ వైద్య సేవల కార్యక్రమం బాగా పనిచేస్తుంటే, అటువంటి నర్సింగ్ హోంల ఏర్పాటుకు ఇంకా అనేకమంది డాక్టర్లు ముందుకొస్తారు. ప్రభుత్వ బీమా కార్యక్రమంలో ప్రయివేటు భాగస్వామ్యం ప్రధానంగా ఈ చిన్న నర్సింగ్ హోంలకే పరిమితం కావాలి. పెట్టుబడి పరిమాణం పెరగటం వల్ల ఖర్చు పరంగా కలిగే ప్రయోజనం కోసం, వ్యయం తగ్గింపు, డయాగ్నొస్టిక్‌లను సకారణాలతో వినియోగించటం కోసం.. ఖరీదైన, ఎక్కువ పెట్టుబడులు అవసరమైన డయాగ్నొస్టిక్‌లను సి.హెచ్.సిలు, ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉమ్మడి వినియోగం ప్రాతిపదికన ఏర్పాటు చేయవచ్చు. కొంతకాలానికి మొత్తం ద్వితీయ స్థాయి వైద్య సేవలను ఏక చెల్లింపుదారు పద్ధతిలో విధిగా సి.హెచ్.సిలు, జాబితాలోని చిన్న ప్రయివేటు నర్సింగ్ హోంల ద్వారా మాత్రమే అందించాలి. బోధనాస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు.. తదుపరి అధ్యాయంలో స్థూలంగా పేర్కొన్నట్లు, నాణ్యమైన తృతీయ స్థాయి వైద్యాన్ని తక్కువ ఖర్చుతో అందించటంపై దృష్టి కేంద్రీకరించాలి.

ఆస్పత్రి సంరక్షణలో ఒక దేశంగా, మనం ఇప్పటికే ఏక చెల్లింపుదారు (సింగిల్–పేయర్) పద్ధతులు, ఉమ్మడి నష్ట ప్రమాదాల భర్తీ ఏర్పాటులోని సవాళ్లను ఎదుర్కోవటంలో అనుభవం సంపాదించాం. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ పెద్దఎత్తున విజయవంతమై ప్రజల్లో విస్తృత ప్రాచుర్యం పొందాయి. ఈ అనుభవాన్ని ఆరోగ్య రంగంలోని పద్ధతులు, ప్రక్రియలను మెరుగుపరచటానికి, రోగి సంరక్షణకు నియమావళిని పాదుకొల్పటానికి, సేవల నాణ్యతను పర్యవేక్షించటానికి, ఆర్థిక వ్యయ ప్రయోజనత్వాన్ని సమీక్షించటానికి, అత్యుత్తమ శాస్త్రీయ సాక్ష్యాధారాల ప్రాతిపదికన రోగ నిర్ధారణలు, రోగి సంరక్షణ, చికిత్సల్లో ప్రొటోకాల్స్ రూపంలో ఆరోగ్య సేవలదారులకు సాంకేతిక మార్గదర్శకత్వాన్ని క్రమానుగతంగా జారీ చేయటానికి వినియోగించాలి. ఆస్పత్రి సంరక్షణ సంక్లిష్టతతో కూడినది, కొత్త వ్యాధులను ఎదుర్కోవటం నిరంతర ప్రక్రియ. కాబట్టి, ఆస్పత్రి సేవల్లోని వైద్య, పాలన, ఆర్థిక కోణాలను స్పెషలైజ్డ్ నిపుణుల బృందాలు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో కూడా నిరంతరం పర్యవేక్షిస్తుండాలి.

(ఇంకా ఉంది...)

# అభివృద్ధి - అందరి భాగస్వామ్యం

అభివృద్ధితోపాటు అందులో అందర్నీ భాగస్వాముల్ని చేసే పని తగినంత వేగంగా జరగకపోతే, ఆ భాగస్వామ్యం అభివృద్ధిని మరింత పెంచకపోతే ఒక దేశంగా మనం ప్రగతి ప్రస్థానంలో విఫలమవుతాం. అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి.. భారత్‌కు ఎంతో కీలకం.

- సెంటర్ ఫర్ సివిల్ సొసైటీ (సీసీఎస్)
రజతోత్సవ కార్యక్రమంలో
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు
డాక్టర్ జయప్రకాష్ నారాయణ్



RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th September, 2022 Posting Date 15 &16th of every month




# సరైన ఆరోగ్యం అందించకుండా ప్రజాస్వామ్య దేశమని ఎలా చెప్పుకోగలం?

ప్రజాస్వామ్యం అంటే కేవలం స్వేచ్ఛ ఉంటే చాలదు, ఎన్నికలు ఉంటే చాలదు. అట్టడుగున ఉన్న మనిషికి కూడా మౌలిక సదుపాయాల్ని కల్పించి, అవకాశాల్ని ఇచ్చి వివక్షలేని సమాజాన్ని నిర్మాణం చేస్తే అది ప్రజాస్వామ్యం. దానికి విద్య, ఆరోగ్యాల్ని మించి సాధనాలు వేరే లేవు. ఈ రెండూ ప్రభుత్వ కర్తవ్యం. ఇంకా ఎన్నో ఉన్నాయి. కానీ అవన్నీ సమాజం చేతుల్లో ఉన్నాయి. మీరు పెళ్లి ఎట్లా చేసుకుంటారు, ఇలాగే చేసుకోండి అని మనం చెప్పలేం. అవి సమాజం చూసుకోవాలి. కానీ ప్రభుత్వం మాత్రమే చేయాల్సిన పనులు, ఇంకెవరూ అంతగా చేయలేనివి ఈ రంగాలు. ఈ రంగాల్లో ప్రభుత్వం విఫలమవుతున్నది. అందుకోసమే విద్య, ఆరోగ్యం కోసం పోరాడుతున్నాం.

విద్య మీద కొందరితో కలిసి లోక్‌సత్తా పట్టుపట్టి పనిచేసింది కాబట్టి, ఒక మంచి విద్యావిధానమంటూ వచ్చింది. అది అమలుకు కొంతకాలం పడుతుంది. కానీ కనీసం ఒక విధానమంటూ వచ్చింది. విద్య కోసం ప్రభుత్వం డబ్బులు కూడా ఖర్చుపెడుతోంది. ఇంకా ఖర్చు పెడితే మంచిదేగానీ, పెడుతున్న ఖర్చు తక్కువేమీ కాదు.

ఆరోగ్యంలో విధానమూ లేదు, ఖర్చూ లేదు. దీంతోపాటు ఇటీవల కొవిడ్ నేపథ్యం వల్ల ఇది సరైన సమయం. కాబట్టి ఊరికే గుడ్డెద్దు చేలో పడ్డట్లు ఆరోగ్యం అంశాన్ని తీసుకోలేదు. ఈ దేశ భవిష్యత్తుకి, ప్రతి కుటుంబానికీ, ముఖ్యంగా పేద కుటుంబాలకి ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా రూపొందించిన ఆరోగ్య విధానం ప్రాణాధారం.




**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు**

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020